సాహిత్య

# ప్రస్థానం

మార్చి 2013

వెల రూ. 10



సాహితీ స్రవంతి

# ప్రస్థానం.కామ్ www.prasthanam.com

## చూస్తున్నారా! సాహిత్య ప్రస్థానం వెబ్‌సైట్ !!










ఢిల్లీలో జనవరి 4 నుండి 10 వరకు జరిగిన ప్రపంచ పుస్తక మహోత్సవంలో బుక్ ఆర్ట్

సాహిత్య
ప్రస్థానం
మార్చి 2013
సంపుటి : 12 సంచిక : 3

# కుట్రలను వమ్ముచేయాలి

మానవత్వంలేని ముష్కర హంతకుల ఉన్మాద హత్యాకాండకు అమాయకులే అత్యధికంగా బలవుతుంటారు. దిల్‌సుఖ్‌నగర్ లో హఠాత్ హంతక విధ్వంసానికి ప్రాణాలు కోల్పోయిన వారంతా అలాటివారే. మానని వ్రణంలా తయారైన రకరకాల ఉగ్రవాదాల హత్యాకాండతో వర్తమాన ప్రపంచం అందులో భాగంగా భారతదేశం కూడా తల్లడిల్లిపోతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాదు నగరం కూడా ఉగ్రవాద మారణహోమాలకు ఒక కేంద్ర బిందువుగా మారడం అత్యంత ఆందోళనకరం.

లుంబిని, గోకుల్‌చాట్ పేలుళ్ళ తరుణంలోనే రాజధాని గుండె చెదిరింది. గత మూడేళ్ళలోనూ రాష్ట్రంలో తిష్ట వేసిన అనిశ్చితి నడుమ హైదరాబాదులో పోటాపోటీ మతతత్వాల మధ్య పొంచి ఉన్న ప్రమాదంపై ప్రమత్తత ఊహకందని విషయం. అఫ్జల్ గురు ఉరితో సహా అనేకానేక కారణాలు ఏకరువు పెట్టొచ్చు గానీ అన్నిటికన్నా కీలకం అలసత్వమే. ఉగ్రవాద కుట్రలను ఛేదించడం నూటికి నూరుపాళ్ళు సాధ్యం కాకపోవచ్చు గానీ విశృంఖల మారణ వ్యూహాలను అరికట్టడానికి పటిష్టమైన నిఘా, నియంత్రణ అవసరం. ఘటన జరిగిన తర్వాత గంభీర ప్రకటనలు ఎన్ని చేసినా వ్యర్థమే. ఇప్పుడు కూడా ఘటనా స్థలంలో సిసి కెమెరాల వైఫల్యం, కమీషనర్ పర్యటన సమయంలోనే విద్రోహులు తప్పించుకోవడం వంటివన్నీ ముందు జాగ్రత్త లోపాన్నే సూచిస్తున్నాయి. జన సమ్మర్థంగా ఉండటమే గాక గత ఘటనలకూ రంగస్థలమైన దిల్‌సుఖ్‌నగర్ వంటి చోట్ల ప్రత్యేక నిరంతర నిఘా ఏర్పరిస్తే ఇలాటివి నివారించే అవకాశం కొంతైనా ఉండేది.

సాహిత్య జీవులెప్పుడూ మత సామరస్యాన్ని, సుహృద్భావాన్ని కాపాడతారు. ప్రత్యేకించి ఇలాటి సంక్లిష్ట సమయంలో రాజకీయ విభేదాలకు, కుల, మత, ప్రాంతీయ తేడాలకు అతీతంగా ప్రతివారూ భుజం కలిపి నిలవాలి. స్వార్థ ప్రయోజనాల కోసం రకరకాల ప్రచారాలతో పక్కదోవ పట్టించే శక్తులకు ఏ మాత్రం అవకాశం రాకుండా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా హైదరాబాదీలు మతసామరస్యాన్ని నిలబెట్టుకుని కుటిల శక్తుల కుట్రలను వమ్ము చేయాలి. మృతులకు ఇదే మా ప్రగాఢ సంతాపం. ఈ ఘటనలో క్షతగాత్రులైన వారు త్వరితంగా కోలుకోవాలని ఆకాంక్ష.

ముఖచిత్రం: ఢిల్లీలో జరిగిన ఇండియా ఆర్ట్‌ఫెయిర్ 2013 ఓ దృశ్యం. ఫొటోలు, లోపలి వ్యాసం: గుడిపూడి విజయరావు

బొమ్మలు : తుంబలి శివాజి, వెంకటేష్, భాస్కర్

## ఈ సంచికలో...

ఎన్నెలమ్మ (కథ)............ 2
కవితలు............ 10
వాసిరెడ్డి సీతాదేవి నవలల్లో సామాజిక దృక్పథం............ 11
కవిత............ 13
ఉత్తమ కథకుడు శశిశ్రీ............ 14
కవిత............ 16
అంతర్జాలంలోని తెలుగు వెలుగులలో
బాలల కోసం ప్రసరిస్తున్న కిరణాలు............ 17
కవితలు............ 21
అమ్మా నన్ను ప్రేమించవూ! (కథ)............ 22
కవితలు............ 26
కళాభిమానులకు విందు............ 27
కవితలు............ 30
చిన్ని (కథ)............ 31
కవితలు............ 35
సమాజానికి కావాల్సిన 'ఊతకర్రలు'–చాతుర్య............ 36
కవిత............ 38
ప్రైవేటుకు దాసోహం ప్రజలకు కరెంటు భారం............ 39
కవితలు............ 42
స్వీకారం............ 43
కవితలు............ 45
డైరీ............ 46

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వీరప్రసాద్
వల్లభాపురం జనార్దన

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్టీసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

కథ

# ఎన్నెలమ్మ

సింహాద్రి నాగశిరీష
982989326



జనమంతా గుంపుగూడి చోద్యం చూస్తున్నారు. లోపల్నించి సన్నగా ఏడుపు మాత్రం వినబడుతోంది. ఏమీ పనీపాటా లేనివాళ్ళు అక్కడే నిలబడి ఆత్రంగా గుంపులోకి చొరబడి ఆ ఏడుపు ఎవరిదో, ఏం జరిగిందో తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంటే, పనీపాటా ఉన్నట్లు చెప్పుకునేవారు మాత్రం అదేదో తమ ప్రిస్టేజ్ ప్రాబ్లం అన్నట్లుగా అటుకేసి ఓ చూపు విసిరి తమకేమీ పట్టనట్లు నటిస్తూ వెళ్ళిపోతున్నారు. గేదెల కోసం మేత కోసుకొని అదే దారినవస్తున్న మస్తాన్‌బీ ఆ గుంపును చూసింది. ఏమీ అర్థంకాక గుంపును సమీపించి అక్కడివారిని అడిగింది. ఎవరూ విషయం సరిగా చెప్పడం లేదు. పిచ్చిదంటారు, పడిపోయిందంటారు, ఏడుస్తుందంటారు. ఇట్లా అయితే లాభంలేదనుకొని గడ్డిమోపు పక్కన పడసి జనాన్ని తోసుకుంటూ లోపలికి వెళ్ళింది. అక్కడి దృశ్యం చూడగానే మస్తాన్‌బీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒంటిపై బట్టలు ఉన్నాయన్న మాటేగానీ శరీరాన్నంతా తమ చిరుగుల్లోంచి ప్రదర్శిస్తున్నాయి. పిచ్చిపిల్లకు ఆ స్పృహే లేదు. స్పృహలో ఉన్నవారిలో కొందరు మాత్రం ఆ చిరుగుల్లోని అందాలను ఆస్వాదిస్తున్నారు.

రోడ్డుపై పొర్లుతూ ఆ పిల్ల ఏడుస్తుంటే మస్తాన్‌బీ విలవిల్లాడిపోయింది. ఆ అమ్మాయిని పట్టుకుని 'ఏమ్మా ఎందుకేడుస్తున్నావ్?' అడిగింది మస్తాన్‌బీ.

'నొప్పేస్తోంది' ఏడుస్తూ చెప్పింది ఆ అమ్మాయి.

ఇందాకటి నుంచీ నొప్పి, నొప్పి అని ఏడుస్తూనే ఉంది అన్నారు ఆ గుంపులో నుంచి ఎవరో.

'బిడ్డ అట్టా మెలికలు తిరిగిపోతుంటే ఎలా చూస్తూ ఉండగలుగుతున్నారు?' గద్దించింది మస్తాన్‌బీ.

'అసలే పిచ్చిది. మీదకెగబడి కొరికితే? అందుకే దూరంగా నిల్చున్నాం. నువ్వూ దూరంగా జరుగు, లేదంటే మీదబడి రక్కినా రక్కుతుంది' అన్నారు మరొకరు హెచ్చరికగా.

'ఛీ, నోర్మూయ్యండ్రా! గుండెలవిసేలా ఆ పిల్ల ఏడుస్తుంటే అలా ఎలా మాట్లాడుతున్నారు? పిచ్చిపిల్ల అయితే మాత్రం నొప్పెట్టకూడదా, ఏడవకూడదా? కనీసం జాలి లేకుండా ఎలా మాట్లాడగులుగుతున్నారు' విసుక్కుంది మస్తాన్‌బీ.

ఆ పిచ్చిపిల్ల మాత్రం అమ్మా నొప్పి అంటూ రోడ్డుపై పొర్లుతోంది.

'ఎక్కడ నొప్పేస్తోంది?' అడిగింది మస్తాన్‌బీ.

పొట్టమీద చెయ్యి ఆన్చి చూపింది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి పొట్టపై చెయ్యి ఆన్చి ఇక్కడేనా అడిగింది మస్తాన్‌బీ.

కాదన్నట్లు తల ఊపి మస్తాన్‌బీ చేతిని ఇంకొంచెం కిందికి జరిపింది ఆ అమ్మాయి.

పొత్తి కడుపులో నొప్పి అని అర్థం చేసుకుంది మస్తాన్‌బీ 'పాపం బిడ్డ అన్నం తిని ఎన్నిరోజులైందో. ఆకలితో కడుపులో నొప్పి వచ్చినట్లుంది' అంటూ కళ్ళొత్తుకుంది మస్తాన్‌బీ.

పక్కనున్న ఒకామె 'ఆకలి కాదమ్మా! ఆకలేస్తుందనుకుని అన్నం పెట్టబోతే చూడు ఆ అన్నం డబ్బా నేలకేసి కొట్టింది' అంటూ మట్టిపాలైన అన్నం చూపించింది.

మరెందుకేడుస్తోందా అని ఎంత ఆలోచించినా ఎవరికీ అర్థం కాలేదు. ఇంతలో ఎవరికో పురుడుపోసి అదే వీధివెంట వస్తూ ఈ తతంగమంతా చూసింది ఓ మంత్రసాని. ఎందుకో అనుమానం వచ్చిందామెకు. అందరినీ పక్కకు జరిపి ఆ అమ్మాయి నాడి పట్టుకుని చూసి చిన్నగా నిట్టూర్చింది.



'ఏంటవ్వా! ఏమైంది? మేము ఎంత ప్రయత్నించినా అర్థం కావడం లేదు. ఈ పిల్లకేమో చెప్పడం చేతకావడం లేదు. నీకేమన్నా అర్థమైందా?' అడిగింది మస్తాన్‌బీ.

'మస్తానీ, ఏదైతే అనుమానించానో అదే అయింది. ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు' అంది మంత్రసాని.

'ఏందవ్వా, ఏమనుమానించావు? ఏమైందీ? ' ఆదుర్దాగా అడిగింది మస్తాన్‌బీ.

'ఈ పిచ్చిది కడుపుతో ఉంది' అంది మంత్రసాని.

షాక్కొట్టినట్లు చూశారంతా. ఆ గుంపులో ఉన్న మగవాళ్లంతా ఒకరి తరువాత ఒకరు మెల్లగా జారుకున్నారు.

'పిచ్చిపిల్ల అని కూడా చూడకుండా ఇంత దారుణానికి ఎవరు ఒడికట్టుంటారు? తనను గురించి తాను పట్టించుకునే ధ్యాస కూడా లేని ఈ పిల్ల కడుపులో మరో జీవా? ఏంటవ్వా, ఏంటీ దారుణం' తల్లడిల్లిపోయింది మస్తాన్‌బీ.

'మన వీధిలో పనీపాటా లేకుండా తిరిగే జులాయి వెధవలున్నారు! వారి పనే అయి ఉంటుంది?' అంది ఒకామె.

'వాళ్ళనే కాదులే, ఇక్కడ ఎవరినీ తక్కువ అంచనా వెయ్యడానికి లేదు. ఎందుకంటే అందరి కళ్ళూ ఆ పిల్లమీదే. ఈ విషయంలో మనం ముందే ఏదైనా జాగ్రత్త తీసుకొని ఉండాల్సింది' అంది మస్తాన్‌బీ.

'మా మగాళ్ళు అలాంటి వాళ్ళేమీ కాదు. మీరనవసరంగా మా వాళ్ళ మీద రాళ్ళేస్తున్నారు' అంటూ రుసరుసలాడుతూ వెళ్ళిపోయారు కొందరు.

'ఈ పిల్ల రోజంతా వీధుల్లోనే తిరుగుతుంది కాబట్టి ఈ అఘాయిత్యం కచ్చితంగా రాత్రిపూటే జరిగి ఉంటుంది' అంది మంత్రసాని.

'నిజమే అవ్వా! ఈ పిల్ల రాత్రిళ్ళు ఆ బళ్ళో పడుకుంటుంది. ఆ స్కూలుకు కాపలాగా వాచ్‌మెన్ ఉన్నాడు కదా! బహుశా వాడేమైనా ....' అంటే అనుమానం వెలిబుచ్చింది ఒకామె.

'ఇహ ఎవరేమనుకున్నా జరగాల్సిందంతా జరిగిపోయింది. ఇప్పుడింకేమి చేయగలం, చూస్తూండటం తప్ప' నిట్టూర్చింది మంత్రసాని.

'ఈ విషయాలన్నీ తరువాత కానీ ముందీపిల్లకు నొప్పి తగ్గడానికి ఏమైనా చెయ్యవ్వా' అడిగింది మస్తాన్‌బీ.

'నాదంటా నాటు వైద్యం మస్తానీ, ఆస్పత్రికి తీసుకుపోతే మంచిదేమో!' అంది మంత్రసాని.

'చూనస్తా, చూనస్తా బిడ్డను ఇలా వదిలెయ్యడానికి మనసొప్పడం లేదు. డాక్టరు దగ్గరికి తీసుకుపోదాం. తలా ఓ చెయ్యి వెయ్యండమ్మా. బిడ్డను బతికించినోళ్ళమవుతాం' అంది మస్తాన్‌బీ.

'ఏవో నవ్మా వూయింట్లే ఇట్టాంటివి ఒప్పుకోరు' అంటూ లేచెళ్ళిపోయిందొకామె.

'నామొగుడసలే మంచోడు కాదు. వయసులో ఉన్న పిల్లను చూశాడంటే నా కాపురానికే ఎసరొస్తుంది' అంటూ దీర్ఘం తీసిందిమరొకామె.

'మాకే తింటానికి లేదు. ఇంకా ఈ పిచ్చిదాన్ని కూడా పోషించే స్తోమత లేదు' అంది ఇంకొకామె.

ఇలా తలా ఒక కారణం చెప్పి అందరూ జారుకున్నారు. చివరికి మస్తాన్‌బీ, మంత్రసాని మాత్రం మిగిలారు. ఓ చిన్న నవ్వు నవ్వి 'నీకెందుకు మస్తానీ, నువ్వూ నీ దారి చూసుకో. ఇదంతా జరిగే పనికాదు' అంది మంత్రసాని.

'ఏంటవ్వా! నువ్వూ అలా అంటావు. బిడ్డ అవస్థ చూస్తే కడుపుతరుక్కుపోతోంది. నా వల్ల కాదు. నేను చూస్తూ ఉండలేను. నాకు చేతనైంది నేను చేస్తాను' అంది మస్తాన్‌బీ జాలిగా ఆ పిల్లను చూస్తూ.

'ఏం సాయం చేస్తావ్ మస్తానీ! నువ్వు నానా కష్టాలు పడుతున్నప్పుడు నీకెవరు సాయం చేశారు? అయినా నువ్వు చెప్పినట్లే అనుకుందాం. ఇప్పుడాపిల్లని ఆస్పత్రిలో చేర్పిస్తావు. బాగానే ఉంది. ఆ తర్వాత సంగతేంటీ? దాన్ని ఎవరు చూసుకుంటారు. మళ్ళీ రోడ్ల వెంటపడి తిరుగుతుంది, గెంతుతుంది, ఎగురుతుంది. ఈ దుమ్మూ ధూళిలో పొర్లుతుంది. ఎవరన్నా జాలిపడి ఓ ముద్ద పెడితే తింటుంది.

లేదంటే ఏడుస్తూ పడుకుంటుంది. కథ మళ్ళీ మొదటికొస్తుంది, అప్పుడేం చేస్తావ్. ఎల్లకాలం దానికి కాపలా ఉంటావా? నువ్వే రెక్కల కష్టం చేసుకు బతుకుతున్నావ్, నీకెందుకొచ్చిన తలనొప్పి' నచ్చజెప్పజూసింది మంత్రసాని.

'అవన్నీ తర్వాత ఆలోచిద్దాంలే కానీ ముందు ఆస్పత్రికి తీసుకుపోదాం. నువ్వన్నా కాస్త సాయం పట్టవ్వా' అంది మస్తాన్‌బీ.

ఇంకా మనుషుల్లో మంచితనం బతికే ఉంది అనుకుంది మంత్రసాని తనలోతాను.

* * *

'నాకేమీ తెలీదు తల్లో అంటే నీకు ఎందుకు అర్థం కాదు. నా వయసు అరవై దాటింది. ఈ ముసలోడు ఆ పిచ్చిదానికి కడుపెట్టా తెస్తాడు?' వాదించాడు వాచ్‌మెన్.

'కడుపు తేవడానికి ఆ వయసేమీ ఎక్కువ కాదులే. నిజం చెప్పు. ఈ పిల్ల స్థితికి కారణం నువ్వే కదూ!' గద్దించింది మస్తాన్‌బీ.

'ఎన్నిసార్లు చెప్పాలెహే. నాకు తెలీదు' అన్నాడు వాచ్‌మెన్.

'నీకేమీ తెలీకపోతే పిచ్చిలో కూడా ఈ పిల్లని అడిగితే నీ ఇంటి దగ్గరకే తీసుకొచ్చి ఎందుకు నిలబడుతోంది?' కోపంగా అరిచింది మస్తాన్‌బీ.



'ఆకలితో మాడి చస్తోందని దానికి కాస్త కూడు తగలేశా. ఆ విశ్వాసంతో అది నా ఇంటి ముందుకొస్తే నా తప్పా?' రెట్టించాడు వాచ్‌మెన్.

'చూడరా, బాబూ! నువ్వన్నదే నిజమనుకుందాం. ఆ పిచ్చిదానికి కూడెట్టి నువ్వే పోషించట్లేదుగా! ఆ పిల్లకు రోజూకొకరు చొప్పున తలా ఓ ముద్ద పడేస్తున్నారు. అందరినీ వదిలేసి నీ ఒక్కడి మీదే ఆ పిల్ల విశ్వాసం ఎందుకు చూపిస్తున్నట్లు. అహఁ! నాకు తెలీక అడుగుతాను' అంది మంత్రసాని.

'అదంతా నాకేం తెలుసు. నన్నడిగితే ఎట్టా?' మొండిగా వాదించాడు వాచ్‌మెన్.

'అదే అదే నీకేం తెలుస్తది పాపం. నీ పెళ్ళాన్నడిగితే తెలుస్తుంది పద' అంటే గేటు తోసుకు లోపలికెళ్ళారు ఇద్దరూ.

'అరే! అలా తోసుకొస్తారేంటి' అంటూ వారించబోయాడు వాచ్‌మెన్.

'ఏమమ్మా! లోపలున్నావా?' అంటూ కేకేసింది మస్తాన్‌బీ.

'ఎవరూ?' అంటూ బయటికొచ్చింది వాచ్‌మెన్ భార్య.

పిచ్చిపిల్లను, మస్తాన్‌బీని, మంత్రసానిని చూశాక ఆమెకు విషయం అర్థమైంది. ఆ పిచ్చిపిల్లను తిండి వంకతో ఇంటికి తేవడం, తను ఏమరుపాటుగా ఉన్నప్పుడల్లా ఆ పిల్లను తాకడం, పిచ్చి చేష్టలు చేయడం చూసి కూతురు వయసున్న పిల్ల అని మొహం వాచేలా చీవాట్లు పెట్టింది కూడా. దాంతో ఆ పిల్లను ఇంటికి తీసుకురావడం మానేశాడు కానీ ఆమెకు మాత్రం భర్తపై అనుమానంగానే ఉంది. ఆఖరికి తన అనుమానమే నిజమని వచ్చిన వాళ్ళ వాలకం చూస్తుంటే ఆమెకు అర్థమైపోయింది.

'ఏమ్మా! ఏమలా బొమ్మలా నిలబడ్డావ్?' అంది మంత్రసాని.

'అబ్బే అదేం లేదే. ఇలా అంతా కట్టకట్టుకుని మా ఇంటి మీదికి పడ్డారేంటా అని చూస్తున్నా' అందామె తన తత్తరపాటు కప్పిపుచ్చుకుంటూ.

'తినబోతూ రుచెందుకడుతావు. అక్కడికే వస్తున్నాం. ఈ పిచ్చిపిల్ల కడుపుతో ఉంది. ఆ విషయం గురించే మాట్లాడదామని వచ్చాం' రెండు ముక్కల్లో ముగించేసింది మస్తాన్‌బీ.

'అదా! నాకెప్పుడో తెలిసిందిలే. ఊళ్ళో ఆడామగా దీని గురించే చెప్పుకుంటున్నారులే. అయినా ఈ ముక్క చెప్పడానికా పనిమాలా మా ఇంటికొచ్చారు' అంది ఏమీ పట్టనట్టు.

అసలే మస్తాన్‌బీ కోపం మీద ఉందేమో 'ఆ ముక్క చెప్పినోళ్ళు ఆ కడుపుకు కారణం నీ మొగుడే అని కూడా చెప్పుంటారుగా. అందుకే వచ్చాం...' అంది నొక్కుతూ.

'ఇదిగో, ఇట్టాంటి మాటలంటే నాకు మా చెడ్డ చిరాకు. నా మొగుడసలే నిప్పులాంటోడు. ఆడపురుగు వంక కూడా కన్నెత్తి చూడడు. ఏదో పిచ్చిదని జాలిపడి ఇంటికి తీసుకొచ్చి ఓ ముద్ద పెట్టమని నాకు అప్పగించి తను ఎల్లిపోయేవాడు. అయినా నాకు తెలీక అడుగుతాను, ఇంట్లో నన్ను పెట్టుకుని వేరే ఆడదాని ఎంట ఎట్టాపడతాడు? ఎందుకు పడతాడు?' అంటూ విషయమంతా తెలిసినా కూడా తప్పుచేసిన మొగుణ్ణి వెనకేసుకొస్తూ.

'ఇంట్లో పెళ్ళాం ఉన్న మొగుళ్ళు బయట ఆడదాన్ని చూసి వెధవవేషాలు వెయ్యరని రూలేమైనా ఉందా? అదే నిజమైతే ఆడదానికి ఈ బాధలెందుకూ. ఇన్ని కష్టాలెందుకూ' వెటకారంగా అంది మస్తాన్‌బీ.

'అసలేం కావాలి మీకు' చిరాకు పడింది వాచ్‌మెన్ భార్య.

'ఆ పిల్ల స్థితికి నువ్వు అవునన్నా కాదన్నా నీ మొగుడే కారణం. కాబట్టి ఆ పిల్లకు కావలసినవన్నీ మీరే చూడాలి. దానికి బిడ్డ పుట్టేదాకా మందులు, ఆస్పత్రి ఖర్చులు భరించాలి. బిడ్డ పుట్టాక ఆ బిడ్డ ఆలనాపాలనా, చదువుసంధ్యలూ అన్నీ మీరే చూడాలి' అంటూ హుకుం జారీచేసినట్లు అంది మస్తాన్‌బీ.

'ఆ పిచ్చిదాన్ని చూసుకుంటే చాలా, మీ ఇద్దర్ని కుడా చూసుకోవాలా? పోనీలే అని ఇంతసేపూ మాట్లాడుతుంటే ఆర్డర్లు వేస్తున్నావేంటీ. అంతగా కావాలంటే ఓ పదోపరకో ఇస్తా, తీసుకెళ్ళండి. అంతేగానీ మీ ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేవారెవరూ లేరు' కొరకొరా చూస్తూ అందామె.

'చూడమ్మా! మొగుడిమీద ప్రేమ, నమ్మకం ఉండటం

సహజం. ఉండాలి కూడా. కాదనను. కానీ ఆ ప్రేమ గుడ్డిది కాకూడదు. ఇక్కడ ఇద్దరి జీవితాల సమస్య. తలా ఓ ముద్దేసి ఇన్నాళ్ళూ ఆ పిల్లను చూసినట్లే ఇక ముందు కూడా ఈ పేట జనం చూడగలరు. కానీ నీ భర్త చేసిన తప్పును అతని చేతనే సరిదిద్దించాలని వచ్చాం. ఒక్కసారి ఒక ఆడదానిగా ఆలోచించి చూడు. ఇలా తప్పులు చేసినా కూడా మన భర్తలను వెనకేసుకొచ్చి మన గొయ్యి మనమే తవ్వుకుంటున్నాం. ఇక చాలు' నచ్చజెప్పాలని చూసింది మంత్రసాని.

'మొగుడు చచ్చిన ముండలిద్దరూ తగుదునమ్మా అని వచ్చారు. ఊరుకుంటే అందరూ నీతులు చెప్పేవారే' అంటూ ధడాలున వారి ముఖం మీదే తలుపేసుకుందామె.

'చూడు మస్తానీ! మనం కాకులమూ కాదు, కుక్కలమూ కాదు. మనుషులం. ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు' అడిగింది మంత్రసాని.

'ఏముందవ్వా చేయడానికి. నేనా ఒంటరి పక్షిని. నాకే గనక ఓ బిడ్డ ఉంటే దానికి ఏ ఆపదా రాకుండా కళ్ళలో పెట్టుకు చూసుకోనూ. ఈ బిడ్డా అట్టాంటిదేగా. నేనే చూసుకోగలిగినంత కాలం చూసుకుంటా' అంది మస్తాన్‌బీ.



'ఎంత దొడ్డ మనసు మస్తానీ నీది. నీకెప్పుడూ మేలే జరుగుతుంది. నీ మంచితనమే నిన్ను కాపాడుతుంది. ఇక పోదాం పద' అంది మంత్రసాని.

ఇద్దరూ నెమ్మదిగా ఇంటిదారి పట్టారు.

* * *

'ఎన్నెలమ్మా! ఓ ఎన్నెలమ్మా! ఎక్కడున్నావ్' కేకేసింది మస్తాన్‌బీ.

'నే చెప్పనుగా' సమాధానం చెప్పింది ఓ కంఠం.

'మా మంచి ఎన్నెలమ్మ కదూ. ఎక్కడ దాక్కున్నా సరే వచ్చేస్తుందంటా. అన్నం తింటుందంట' వెన్నెలమ్మను వెదుకుతూ అంది మస్తాన్‌బీ.

'అయినా సరే. నే చెప్పనుగా' అంది వెన్నెలమ్మ.

మంచం కింది నుంచి ఆ ధ్వని రావడంతో గభాలున వంగి చూసింది మస్తాన్‌బీ. మంచం కింద బాచాపట్ల వేసుకుని నవ్వుతూ కన్పించింది వెన్నెల. గబగబా మంచం ఎత్తి పక్కకు పెట్టింది.

'ఎన్నెలమ్మా! నీకెన్నిసార్లు చెప్పాను. ఇలా మంచం కింద దాక్కోవద్దని. నువ్వు అసలే ఒట్టి మనిషివి కాదు. నీ బొజ్జలో ఇంకో చిన్నపాప ఉందని చెప్పాను కదా! నువ్విలా మంచాల కింద దూరితే పాపకు నొప్పేస్తుంది కదా' అంది మస్తాన్‌బీ.

'అవునా! సరే అయితే, మరి ఆ చిన్నపాప ఎప్పుడు బయటకొత్తుంది' అమాయకంగా అడిగింది వెన్నెల.

'వస్తుంది వస్తుంది. నువ్వు గబగబా అన్నం తింటే మనం ఆస్పత్రికి పోదాం. అక్కడ డాక్టరమ్మ ఉందిగా ఆమె చెబుతుంది పాప ఎప్పుడొస్తుందో' చెప్పింది మస్తాన్‌బీ.

'నేను ఆస్పత్రికి రాను' అని ఏడుపులంకించుకుంది వెన్నెల.

'ఎందుకు రావు' అడిగింది మస్తాన్‌బీ.

'ఇంత పేద్ద సూదితో నన్ను పొడిచేత్తారు' ఏడుస్తూ చెప్పింది వెన్నెల.

'నువ్వు చెబితే వినకుండా మంచం కింద దూరుతున్నావు. చిన్న పిల్లలతో గెంతుతున్నావు కదా. అలా చేస్తే చిన్న పాపకు లోపల కళ్ళు తిరుగుతాయి కదా. అందుకే డాక్టరమ్మ సూది పొడుస్తోంది. అలా చేస్తే చిన్నపాప ఆరోగ్యంగా ఉంటుంది. తొందరగా వచ్చేస్తుంది' చెప్పింది మస్తాన్‌బీ.

'మరి నాతో ఆడుకుంటుందా?' అడిగింది వెన్నెల.

'ఓ ... చక్కగా ఆడుకుంటుంది. నువ్వు తొందరగా అన్నం తింటే డాక్టరమ్మ దగ్గరికి పోదాం' అంటూ అన్నం తినిపించి, పని ముగించుకుని వెన్నెలను ఆస్పత్రికి తీసుకెళ్ళింది మస్తాన్‌బీ.

వెన్నెలను పరీక్షించి డాక్టర్ కొన్ని మందులు రాసిచ్చింది.

'డాక్టరమ్మా! మా వెన్నెలమ్మకు ఎలా ఉంది. బిడ్డ ఆరోగ్యంగానే పెరుగుతోందా, కాన్పు ఎప్పుడొస్తుంది. సుఖ ప్రసవం అవుతుందా' అంటూ కుతూహలంగా అడిగింది మస్తాన్‌బీ.

'మస్తాన్‌బీ! మొదటిసారి ఈ అమ్మాయిని తీసుకొచ్చినప్పుడు అసలీ గర్భం నిలుస్తుందా అనే సందేహం వచ్చింది. కానీ నువ్వు రెగ్యులర్‌గా చెకప్‌కు తీసుకొచ్చిన ప్రతిసారీ చాలా మంచి ఇంప్రువ్‌మెంట్ కనిపిస్తోంది. ఎవరో వదిలేసిన మానసిక వికలాంగురాలు. పైగా గర్భవతి అని తెలిసికూడా ఏ సంబంధం లేని నువ్వు కంటికి రెప్పలా కాపాడుతుంటే తల్లీబిడ్డా క్షేమంగా ఎందుకుండరు చెప్పు. వచ్చే నెల 15న ఈ అమ్మాయికి కాన్పు వస్తుంది. ఇక ముందు కూడా ఇంతే జాగ్రత్తగా చూసుకుంటే సుఖ ప్రసవం అవుతుంది. కంగారు పడవలసింది ఏమీ లేదు' నిశ్చింతగా చెప్పింది డాక్టర్.

'నాదేముంది డాక్టరమ్మా! ఏదో బిడ్డలులేని దాన్ని. మా వెన్నెలమ్మ పండంటి బిడ్డకు జన్మనిస్తే ఆ బిడ్డను పెంచుకుందామని ఆశ. ఉంటానమ్మా' అంటూ వెన్నెలను తీసుకు బయటుదేరింది మస్తాన్‌బీ.

* * *

'మస్తానీ! మస్తానీ!' కేకేసింది మంత్రసాని.

'వత్తన్నా' అంటూ బయటికొచ్చి ఎదురుగా ఉన్న మంత్రసానిని చూసి 'నువ్వా అవ్వా! దా కూర్చో' అంటే మంచం వాల్చింది.

'ఎన్నెలమ్మ ఏమి చేస్తోంది' అడిగింది మంత్రసాని.

'నిద్రపోతోంది. అన్నట్టు నీకు తెలుసా. వచ్చేనెల 15న కాన్పు తారీకు ఇచ్చింది డాక్టరమ్మ. కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉందంట. సుఖ ప్రసవం అవుతుందని డాక్టరమ్మ చెప్పింది' సంబరంగా చెప్పింది మస్తాన్‌బీ.

'పోనీలే, నీ పంట పండినట్టే' నవ్వుతూ అంది మంత్రసాని.

'పొయ్యి మీద చాయ్ నీళ్ళు పెట్టొచ్చాను. ఇప్పుడే వస్తా. నువ్వు కూర్చో అవ్వా' అంటూ లోపలికెళ్ళి టీ గ్లాసులతో బయటికొచ్చింది మస్తాన్‌బీ.

ఇంతలో కళ్ళు నులుముకుంటూ వచ్చి వాళ్ళ పక్కనే మంచం మీద కూర్చుంది వెన్నెల.

'మస్తానీ! ఎన్నెలమ్మ చక్కగా ముస్తాబు చేస్తే కుందనపు బొమ్మలా ఎంత అందంగా ఉందో చూడు. అప్పుడు చినిగిపోయిన గుడ్డలతో, చింపిరి జుట్టుతో ఎట్టా ఉండేది. ఆ పిల్ల, ఈ పిల్ల ఒకళ్ళేనా అనే అనుమానం వస్తుంది' అంటూ వెన్నెల బుగ్గలు చిదిమింది మంత్రసాని.



'అవునవ్వా! ఆ అల్లానే ఈ ఎన్నెలమ్మను నా దగ్గరికి పంపాడు. ఆయన దయవల్ల పండంటి ఆడపిల్ల పుడితే నేనే పెంచుకుంటా. బాగా చదివిస్తా' మెరుస్తున్న కళ్లతో చెప్పింది మస్తాన్‌బీ.

'అమ్మా! ఆశ దోశ. నా చిన్నిపాపను ఎవ్వరికీ ఇవ్వను. నేను పెంచుకుంటా' అంది వెన్నెల బుంగమూతి పెడుతూ.

'నీకే దిక్కులేదు కదా. ఆ చిన్నపాపను నువ్వెలా పెంచుతావే. ఆడుక్కు తిని పెంచుతావా?' నవ్వుతూ అడిగింది మంత్రసాని.

'అవును, రోజంతా అడుక్కుంటా. ఆ అన్నం చిన్నపాపకు తినిపిస్తా' అంది వెన్నెల ఆరిందాలా.

'ఈ అడుక్కునే తిప్పలు నీకెందుకే ఎన్నెలా. చక్కగా మస్తానీకి ఇచ్చేస్తే ఇద్దర్నీ పెంచుతుంది కదా!' అంది మంత్రసాని.

'లేదు, నేనివ్వను. నా చిన్నపాప నాదే. నేనివ్వను. వా....' అంటే ఏడుపు లంకించుకుంది.

'నీ దుంపదెగ, ఊరుకోవే. నీ చిన్నపాపను నేనేమీ తీసుకోనులే. ఇక ఏడవకు' ఊరడించే ప్రయత్నం చేసింది మస్తాన్‌బీ.

'అమ్మో! ఈ పిల్ల చాలా గడుసుదేనే మస్తానీ. మన సోయిలో లేకపోయినా పుట్టబోయే బిడ్డ మీద ఎంత మమకారమో చూడు' ఆశ్చర్యంగా అంది మంత్రసాని.

'పిచ్చిదైనా, మంచిదైనా ఆడది ఆడదే కదా అవ్వా. ఆ ప్రేమ, మమకారం ఎక్కడికి పోతాయి చెప్పు. అమ్మ మనసులేని ఆడది ఉంటుందా' తన్మయత్వంలో చెప్పుకుపోతోంది మస్తాన్‌బీ.

'నువ్వు చెప్పింది వింటానికి బాగానే ఉంది. పిల్ల కాస్త పెద్దదయ్యే వరకూ ఈ పిచ్చిదాని చేతికి మాత్రం ఇవ్వకు మస్తానీ. దీని పిచ్చిలో తెలీక ఆ పసిదాన్ని ఏం చేస్తుందో ఏమో. ఏదేమైనా కాస్త పిచ్చి కుదిరే దాకా జాగ్రత్త' వెన్నెల వింటుందేమోనని వంగి మస్తాన్‌బీ చెవిలో గుసగుసగా చెప్పింది మంత్రసాని.

'సరేలే అవ్వా! నువ్వింతగా చెప్పాలా' నవ్వింది మస్తానీ.

'చీకటి పడేలా ఉంది. కాస్త కూడొండి పడేస్తే ఓ పని అయిపోద్ది. నేనుంటానే మస్తానీ' అంటూ లేచింది మంత్రసాని.

'ఈ వయసులో ఒక్క దానికి ఏం తిప్పలు పడతావు కానీ నాతో ఉండరాదు. కడుపునిండా పెట్టలేకపోయినా పస్తు మాత్రం ఉంచనులే' అంది మస్తాన్‌బీ ముసలామె చెయ్యి పట్టుకుని.

'బాగానే ఉంది సంబడం. ఇలా అందరి బరువూ నీ నెత్తిన ఏసుకోవడానికి నువ్వేమైనా లక్షాధికారివా. కష్టపడి చదివించిన కొడుకు ఉద్యోగం పేరుతో ఎక్కడో పొయ్యి కూచున్నాడు. నాలో సత్తువ ఉన్నంత కాలం నా రెక్కల కష్టం మీదే బతకాలని నా తాపత్రయం. వాడి మీద పంతంతో ఇలా ఎవరి ముందూ చేయి చాచకుండా బతుకుతున్నా. నీకో మాట చెప్పనా మస్తానీ. నా కొడుకు నన్ను పట్టించుకోనని ముఖం మీదే చెప్పి వెళ్ళిపోయినప్పుడు నా గుండె తట్టుకోలేకపోయింది. సచ్చిపోదామనిపించింది. కానీ నిన్ను చూశాకే నాకు బతకగలనన్న ధైర్యం వచ్చింది. ఆ ధైర్యం ఇంకా నాలో ఉంది మస్తానీ. అయినా ఇదంతా ఎందుకుగానీ, నా చివరి క్షణాల్లో మాత్రం నీతోనే ఉంటా' అంటూ చెమర్చిన కళ్ళు తన కొంగుతో తుడుచుకుంటూ వెళ్ళిపోయింది మంత్రసాని.

మంత్రసాని వెళ్ళిన వైపే చూస్తూ అలా ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియలా.

పుట్టి బుద్ధెరిగింది మొదలు కష్టాలతోనే సావాసం చేసింది. ఆడపిల్లకు చదువెందుకని చదువూ చెప్పించలా. తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. ఎన్నో అష్టకష్టాలు పడి తల్లి తన పెళ్ళి చేసింది. అత్తవారింట్లో ఇంకా ఇంకా కట్నం కావాలని వేదింపులు. భర్త సంపాదించకపోగా జూదం, తాగుడు మొదలు అన్ని రకాల దురలవాట్లూ ఉన్నాయి. వాటితోనే అతడూ చనిపోయాడు. ఏడుస్తూ పుట్టింటికి చేరిన తనకు తల్లి శవం స్వాగతం పలికింది. గుండెలవిసేలా ఏడుస్తూ ఎన్ని రాత్రులు, పగళ్ళూ గడిపిందో తనకే తెలియదు. చచ్చిపోదామన్నా ధైర్యం లేదు. ఇరుగుపొరుగు వారు కన్నీళ్ళు తుడవకపోగా సూటిపోటి మాటలు. ఒంటరిగా ఉన్న తనను ఆకలిగా చూసే ఎన్నో వేల కళ్లు. ఆ భయంలో, ఆ కష్టాలు కన్నీళ్ళ మధ్య ఏదో తెలియని తెగింపు తనలో ఎలా వచ్చిందో తనకే తెలియదు.

తల్లి తనకు మిగిల్చిన ఆస్తల్లా రెండు గేదెలు. భయపడితే బతకలేనని, బతకాలంటే ఎదురు తిరగాలని పరిస్థితులే తనకు నేర్పాయి. ఒకప్పుడు తనపై నోరు పారేసుకున్న వారే ఇప్పుడు తన సాయం

కోరుతున్నారు. ఒకప్పుడు తనను చూపులతో హింసించిన వాళ్ళే తన వంక చూడడానికే జంకుతున్నారు … అప్పుడు అర్థమైంది తనకు బతకడం ఎంత తేలికో. ఆ తేలికైన బతుకు కోసం ఎంత కష్టపడాలో …

గతాన్ని తలుచుకున్న మస్తాన్‌బీకి తనకు తానే కొత్తగా అనిపించింది. ఎన్నో ఏళ్ళ తర్వాత తన ఇంట్లో పసిపాప కేరింతలు వినబడబోతున్నాయన్న ఊహే ఆమెలో కొత్త ఉత్తేజం నింపింది.

* * *

'వెన్నెలమ్మా! ఎక్కడున్నావ్' అంటూ ఇల్లంతా వెదికింది మస్తాన్‌బీ. ఎక్కడా వెన్నెల కన్పించలేదు. మంచం కింద, తలుపు వెనక, గంపలో, గొడ్ల చావిడిలో వెదికినా కనబడలేదు. ముచ్చెమటలు పోశాయి. రోడ్డుపైకి దౌడు తీసి కన్పించిన ప్రతి ఒక్కరినీ అడిగింది. అందరూ తమకు తెలియదనే చెప్పడంతో నిరాశగా ఇంటికి చేరింది మస్తాన్‌బీ.

ఇంతలో ఎవరో పిలిచినట్లు అనిపించి తలెత్తి చూస్తే ఎదురుగా ఖాన్.



'ఏంటి ఖాన్ భయ్యా! ఇలా వచ్చావు' నీరసంగా అడిగింది మస్తాన్‌బీ.

'ఏం లేదు చెల్లెమ్మా. ఇవాళ పొద్దునే చిన్న పనిబడి రైలుషేటన్ కాడికి ఎల్లా. అక్కడ మీ ఎన్నెలమ్మ కన్పించింది. ఏందే ఇక్కడున్నావని అడిగితే నే పోతన్నా అంటది. ఎక్కడకే అంటే నా చిన్నపావను నేనే పెంచుకుంటా అంది. నాకేదో అనుమానమొచ్చి ఇంటికి తెద్దామని చెయ్యిపట్టుకు లాక్కొస్తుంటే నా చెయ్యి కొరికి కదిలిన రైలు ఎక్కేసింది బెహన్. అందుకే నీకు చెబుదామని గబగబా వస్తున్నా' అన్నాడు ఖాన్‌భాయి.

ఉన్నపళంగా కుప్పకూలిపోయింది. ఈ పిచ్చిది ఇంత పని చేస్తుందని కలలో కూడా అనుకోలా. ఈ ముక్క ముందే ఊహించి ఉంటే పొరపాటున కూడా నీ బిడ్డను నేను పెంచుతాననే మాట అని ఉండేదాన్ని కాదు. అది మొదలు మనసు మనసులో లేకుండా ఏదో పరధ్యానంగా గడిపేది మస్తాన్‌బీ. రోజూ డాక్టరమ్మ ఇచ్చిన తారీఖును లెక్కపెట్టుకుంటూ కూర్చునేది. ఇదంతా గమనించిన మంత్రసాని ఆమెకి ఎన్నో రకాలుగా చెప్పిచూసి విఫలమైంది.

రోజులు దొర్లిపోతున్నాయి. వెన్నెలమ్మను మర్చిపోలేక పోయింది మస్తాన్‌బీ. వెన్నెలమ్మ ఇప్పుడెలా ఉందో? ఎక్కడుందో? ఇలా ఆలోచనల్లోంచి బయటికి రాలేకపోతోంది.

ఇంతలో 15వ తారీఖు రానే వచ్చింది. 'ఎన్నెలమ్మా ఎంత పని చేశావే. నీ బిడ్డను నేను కొరుక్కుతింటాననుకున్నావా? ఈ పాటికి కాన్పు అయిపోయి ఉండేది. ఈ చేతుల్లో ఓ పసిబిడ్డ ఆడుకుంటూ ఉండేది. ఎక్కడకెళ్లిపోయావే' అనుకుంటూ తనలో తనే మాట్లాడుకుంటోంది మస్తాన్‌బీ.

అప్పుడే గడపలో కాలుబెడుతున్న మంత్రసాని ఆ మాటలు వింది.

'మస్తానా! ఏంటిది. నీ పిచ్చిగానీ, ఇలా ఏడుస్తూ కూర్చుంటే వెన్నెలమ్మ వస్తుందా. అయినా ఆ పిచ్చిదానిపై అంత మమకారం ఎందుకే నీకు. నిన్నగాక మొన్న వచ్చింది. ఎలా వచ్చిందో అలాగే పోయింది. ఇక వదిలెయ్' అంది ఓదారుస్తూ.

'ఎట్టా వదిలేయమంటావు అవ్వా! ఇవాళ తారీఖు తెలుసా. ఈరోజే దానికి కాన్పు వచ్చింది. ఎవరూ లేని ఒంటరిపక్షిని. దానిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానో తెలుసా. అది అసలే పిచ్చిది. ఎట్టా ఉందో ఏంటో' పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అంది మస్తాన్‌బీ.

'చూడు మస్తానీ! అయిందేదో అయిపోయింది. ఇప్పటికి ఇంకా ఏమీ మించిపోలేదు. నా మాట వింటానంటే ఓ మంచి ఉపాయం చెప్తా' అంది మంత్రసాని.

'ఏంటవ్వా అది' అడిగింది మస్తాన్‌బీ.

'ఏం లేదే. ఇలా ఎంతకాలం ఎన్నెలమ్మను తలచుకుంటూ బాధపడతావు. ఎవరైనా ఓ అనాథను చూసి పెంచుకోరాదూ. నాకు తెలిసిన ఓ బ్రోకరు ఉన్నాడు. మాట్లాడమంటావా? అంది మంత్రసాని.

'వద్దు అవ్వా! తీరా బిడ్డను తెచ్చుకుని, ఆ బిడ్డపై మమకారం పెంచుకున్నాక వాడి కన్నవాళ్ళు వచ్చి మా బిడ్డను మాకిచ్చెయ్ అంటే నా పరిస్థితి ఏంటి' అంటూ తన భయాన్ని వెల్లడించింది మస్తాన్‌బీ.

'ఆ మాత్రం నాకు తెలియదంటే. బిడ్డను ప్రసవించి చనిపోయే తల్లులుంటారు కదా! అలాంటి అనాథ బిడ్డనే తెద్దాం. నీకు శాశ్వతంగా బిడ్డ దొరికినట్టేగా' ఉపాయం చెప్పింది మంత్రసాని.

'సరే అవ్వా! కానీ ఎందుకో ఎన్నెలమ్మ ముఖం ఇంకా నా కళ్ళముందే మెదులుతోంది' బాధపడింది మస్తాన్‌బీ.

'ఆ ఎన్నెల ఎక్కడుందో, ఏమైపోయిందో కూడా తేలీదు. ఇంక ఆ విషయం వదిలెయ్. నేనెల్లి ఆ బ్రోకర్‌గాడు కలుస్తాడేమో చూసి విషయం మాట్లాడతా. సరేనా. ఇట్టా తిండీ, తిప్పలు మాని కూర్చోక కాస్త ఎంగిలి పడు' అంటూ మందలించి బ్రోకర్‌ను కలవడానికి వెళ్ళింది మంత్రసాని.

* * *

'ఇంద, ఐదు వేలు అని డబ్బులు చేతిలో పెడుతూ ఈ బిడ్డకు ఎనకాముందూ ఎవరూ లేరుగా' అడిగాడు బ్రోకర్.

'లేరని ఎన్నిసార్లు చెప్పాలి. ఎవరో పిచ్చిది రైలుటేసన్‌లో ఆడపిల్లను కని సచ్చిపోయింది. పిల్లలులేని వాళ్ళు శానా మంది వచ్చి

సూసి ఆడపిల్ల మాకొద్దని తిరిగి ఎల్లిపొయ్యారు. లేకపోతే వారం రోజులు నాకాడ ఎప్పుడైనా పిల్ల ఉందా? అందుకే ఇంత చౌకగా పిల్లనమ్ముతుంది. ఆ పిచ్చిదేమో మొగపిల్లోడ్ని కనకుండా ఆడపిల్లను కని సచ్చింది. నా బుర్ర తినకుండా ఈ పిల్లను తీసుకెల్తే తీసుకెల్లు. లేదంటే ఇంద నీ డబ్బులు నువ్వే తీసుకో. అంతేగానీ నువ్విచ్చే ఐదు వేలకి ఈ నాన్చుడు బేరం వద్దు' అంటూ హాస్పిటల్లో స్వీపర్‌గా పనిచేసే ముత్యాలమ్మ రుసరుసలాడింది.

'అది కాదు ముత్యాలూ! నాకు తెలిసిన ఓ ముసల్ది అమ్మా అబ్బాలేని పసిపిల్ల ఉంటే చూడమంది. ఆ పిల్లను తీసుకున్నాక ఎలాంటి ఇబ్బందులూ రాకూడదని మరీమరీ చెప్పింది. అందుకే' బ్రోకరు మాట పూర్తి చేసేలోపే ...

'ఇదిగో బోకరూ! తల్లికి తెలీకుండానే దొంగతనంగా పిల్లల్ని ఎత్తుకొచ్చి అమ్మినదాన్ని. నాతో ఎట్టాంటి పేచీలు ఇప్పటిదాకా ఎవరికీ రాలేదు. ఏ తల్లి బిడ్డను ఎత్తుకొచ్చానో, ఏ తల్లికి ఆ బిడ్డను అమ్మానో ఎవరికీ ఇంతవరకూ తెలీదు. ఇది అట్టాగే' అంది ముత్యాలమ్మ.

'సర్లే! ఇట్టాంటి లొసుగులే ఉండకూడదని కండిసన్ మరి. ఏ తల్లికీ కడుపుకోతా లేకుండా ఉంటేనే బిడ్డను తెమ్మంది. ఒక తల్లిని ఏడిపించి ఇంకో తల్లిని సంతోషపెట్టడం ఇట్టం లేదంట. అందుకే అనాథ అయితేనే చూడమంది ఆ ముసల్ది. నా పెళ్ళానికి అనుకోకుండా నొప్పులొస్తే సమయానికి ఈ ముసల్దే ఆదుకుంది. ఆ విశ్వాసంతో ఇంతగా అడుగుతున్నా. అంతేగానీ నీమీద డౌటేముంటది సెప్పు' అంటూ చెప్పుకొచ్చాడు బ్రోకర్.



'ఆహాఁ ! సర్సరే. ఇసయం మొత్తం చెప్పా కదా. ఇద బిడ్డ. అన్నట్టు ఈ పిల్ల పుట్టింది ఈనెల 15న. ఈ మధ్య ఇది కూడా అడుగుతున్నారులే. అడిగితే చెప్పుమరి. నేనుంటా. ఎవరికైనా బిడ్డ కావాలంటే నాకు సెప్పు. సిటికెలో తెత్తా. వుంటానిక' అంటూ వెళ్ళిపోయింది ముత్యాలమ్మ.

'అమ్మ నాయనో! ఇది మామూలు ఆడది కాదు. బిడ్డలను ఎత్తుకొచ్చి ఎంచక్కా యాపారం చేసేత్తంది. కనీసం బాధ కూడా లేదు. ఇట్టాంటి ఆడోళ్ళు కూడా ఉంటారా? పైవాడు అన్నీ లెక్కలు రాత్తానే ఉంటాడులే. అందుకే కడుపూ పండలా. కట్టుకున్నోడు దేశాలు పట్టిపోయాడు. అయినా నాకెందుకులే. దాని సావు అది సత్తది' అనుకుంటూ ఇంటిదారి బట్టాడు బ్రోకరు.

*　　　*　　　*

బిడ్డ ఎంత సక్కగుంది బోకరూ. ఇంద నీ ఐదేలు. మస్తానీ, మొత్తానికి నీకూ ఓ బిడ్డ దక్కింది. ఇంక సంతోసమేనా' అంది మంత్రసాని.

'అదంతా సరేకానీ, ఈ బిడ్డ నిజంగా అనాధేనా? ఎవరి బిడ్డనీ దొంగతనంగా తేలేదు కదా!' బిడ్డను అందుకుంటూ అడిగింది మస్తాన్‌బీ.

'ఆ అనుమానం నీకెందుకొచ్చింది మస్తానీ?' అడిగింది మంత్రసాని.

'ఏం లేదవ్వా? ఇందకా రచ్చబండ కాడ మన గవర్నమెంటు బడి మాస్టారు ఎవరితోనో చెబుతుంటే విన్నా. ఎవరో ముత్యాలమ్మట, గవర్మెంటు ఆస్పత్రిలో స్వీపరట. పసిబిడ్డలను మాయంచేసి అమ్ముతుంటే పోలీసోళ్ళు పట్టుకున్నారట. అందుకే కొంపదీసి ఈ బిడ్డ కూడా అలా ఎత్తుకొచ్చిందేమోనని అడుగుతున్నా' అంది మస్తాన్‌బీ.

'దాని దుంపతెగా! అదసలు ఆడదేనా? పిల్లల్ని ఎత్తుకెల్తుందా' మెటికలు విరిసింది ముసలమ్మ.

'హత్తెరికి నిన్ననేగా దాన్ని కలిసింది. ఇంతలోనే దొరికిపోయిందా? పాపం పండి ఉంటుంది' కసిగా అన్నాడు బ్రోకరు.

'అదేంటి, నీకామె తెలుసా?' అంది మస్తాన్‌బీ.

'తెలీకే, ఈ బిడ్డని తెచ్చింది దాని దగ్గరినుంచే. ఈ యాపారం మొదట్లో నేనూ చేసేవాణ్ణే. కానీ నాకు బిడ్డ పుట్టాక ఆ మమకారం తెలిసింది. కాన్పు సమయంలో నా భార్య పడ్డ అవస్థ చూశాను. అప్పుడే అర్థమైంది. కాన్పు ఆడదానికి పునర్జన్మలాంటిదని. ఆ సమయంలో ఒక్కోసారి ప్రాణం కూడా పోతుందని. అంతా తెలిసి ఓ బిడ్డకు జన్మనిచ్చే ఆ తల్లిని క్షోభపెడితే పుట్టగతులుండవని. అది మొదలు ఆ యాపారం మానేశా. యాపారమైతే మానేశాను గానీ బోకర్ అనే బిరుదు మాత్రం మిగిలింది' నవ్వుతూ అన్నాడు బ్రోకరు.

'మరీ ... ఈ బిడ్డ ...' అనుమానంగా చూసింది మంత్రసాని.

'అదేం కాదులే. అది దొంగతనం చేసేది మగపిల్లల్నే. ఆడపిల్లల్ని ఎవరూ కొనడం లేదంట. అందుకని ఆళ్ళ జోలికెల్లదు. ఎవరో పిచ్చితల్లి ఈ బిడ్డను కని సచ్చిపోయిందంట. ఆ బిడ్డే ఈ బిడ్డ. కాబట్టి మీరు ఏ అనుమానాలూ పెట్టుకోనవసరం లేదు' కచ్చితంగా చెప్పాడు బ్రోకరు.

'హమ్మయ్య' ఊపిరి పీల్చుకున్నారు ఇద్దరూ.

'మస్తానీ!' పిలిచింది మంత్రసాని.

'ఏందవ్వా' పసిబిడ్డకు తన్మయత్వంతో ముద్దిస్తూ అడిగింది మస్తాన్‌బీ.

'ఈ బిడ్డకు ఏంపేరెడతావ్' అడిగింది మంత్రసాని.

ఆ బిడ్డను తనివితీరా చూసి 'ఎన్నెలమ్మ' అంది మస్తాన్‌బీ.

'అన్నట్టు బిడ్డపుట్టింది ఈనెల 15న అట. పుట్టినరోజు చేసుకోవడానికి పనికొస్తదని కనుక్కున్నాలే' ఘనకార్యం సాధించినట్లు చెప్పాడు బ్రోకరు.

'అలాగా' కళ్ళింత చేసుకు ఆశ్చర్యంగా చూసింది మస్తాన్‌బీ.

'ఇంకేం. అలాగైతే నీకు నిజంగానే ఇంకో ఎన్నెలమ్మ దొరికింది' నవ్వుతూ అంది మంత్రసాని.

'అవునవ్వా!' తృప్తిగా నిట్టూర్చింది మస్తాన్‌బీ.



## ఫిబ్రవరి నెల పురస్కారాలు



### అన్య-అనన్య

కథకు.......రూ.700/-

రచయిత : ఎ. రవీంద్రబాబు

### నానీలు

కవితకు.......రూ.500/-

రచయిత : శ్రీ నాగాస్త్ర

**సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి.**

మీరు చదివిన కవితలు, కథలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. ఒక రచయిత ఈ ఎంపిక నుంచి తనను మినహాయించాలని కోరాడు. అలాంటి అభిప్రాయాలున్న రచయితలు కూడా మాకు రాయవచ్చు.

- ఎడిటర్

## తిరిగి మళ్ళీరావు

సి. హెచ్. ఆంజనేయులు
7702532453



కొన్ని మధుర క్షణాలు తిరిగి మళ్ళీరావు
కొన్ని మధురానుభూతులు
జీవితకాలం చివరిదాకా మళ్ళీతీరం చేరవు
అపుడపుడు తలచుకొన్నప్పుడల్లా
విషాదంలాంటి ఆనందమూకలుగుతుంది
కాలం పొగమంచులా కండ్లముందు
కరిగిపోతుంది.
బాల్యం బంగారు సౌందర్యానుభూతులను
ఎవరు మారుస్తారు
భవిష్యత్తు తలుచుకొన్నప్పుడల్లా
భయం అగాధం కనిపించి
వళ్ళంతా వణుకు స్పర్శా ఆవరిస్తుంది
జీవితం భయ సందేహాల చిత్రం
మనిషికి మనిషితోడుగా వున్నప్పుడే
విషాద ఘట్టాలు తొలగిపోతాయి
మనిషిని పీడించే అనేకానేక వేదనలు రోదనలు
ఒంటరి నిస్సాహాయ నిట్టూర్పులు
ఆర్తనాదాలు ఛేదించి
సాగిపోదాం వెలుగు శిఖరం వైపు
ఆగని రధచక్రాల వడిలో
అంతిమాశయం అంచుదాకా
నిరంతరంగా పదపద
ముందుకు మునుముందుకు
జీవశక్తి వున్నంతవరకు
చివరిశ్వాస ఆగేంతవరకు

## జీవన సంధ్య

మత్తే సత్యనారాయణ
040 - 23165151


అన్నదాత ఆత్మహత్య
పెట్టుబడికీ గిట్టుబాటుకీ మధ్య
కష్టజీవి నిర్వేదం
స్వేదానికీ మోదానికీ మధ్య
అవినీతి చిరునామా
అర్థానికీ స్వార్థానికీ మధ్య
పెరిగే అంతరాల గోడలు
మనిషికీ మనిషికీ మధ్య
అంతుచిక్కని కుంభకోణాలు
అధికారానికి ఆశ్రిత పక్షపాతానికీ మధ్య
అందీ అందని కరచాలనం
హైటెక్‌కీ ఆకలికీ మధ్య
దాతృత్వపు పరిమళం
దానానికీ వాగ్దానానికీ మధ్య
కరిగే జీవన సంధ్య
చీకటికీ వెలుతురుకీ మధ్య
అకర్మణ్యుని వేదాంతం
అంతా మిధ్య !



కవిత

# ఇంతకూ నువ్వేమంటావు?

-డా॥ సి. నారాయణరెడ్డి



ఏమంటావు నువ్వు ?
అంతరంగంలోకి తొంగిచూసుకుంటే
అగాధ సాగరాల లోతులు
అగుపిస్తున్నాయంటాను.
కళ్లు మూసుకుని పైపైకి చూస్తే
అంబరం అవతలి అంచులు
యెదుట నిలుస్తున్నాయంటాను.
నేలనంటుకుని వున్న గడ్డిపోచ
పచ్చని వృక్షం
ప్రాథమిక పాఠాలు
నేర్చుకుంటున్నదని అంటాను.
మధ్యాహ్నవేళ దాకా
నిటారుగా నిల్చుని నడిచే సూర్యుడు
జాము పొద్దవగానే
తలవాల్చుకుని సాగిపోతాడంటాను.
పగలంతా అజ్ఞాతవాసంలో వున్న
చుక్కలు
చీకటిపడగానే
ఆకాశాన్ని ఆక్రమిస్తాయంటాను.
ఏమంటావు ?
ఇంతకూ నువ్వేమంటావు ?

ఆలోచనల్లో మునకలు వేయవలసిన
అవసరం లేదంటాను.
ఒక్కొక్క ప్రశ్నను తరచి చూడు
ప్రశ్నల నిండా సమాధానాలున్నాయి.
తరచి చూసుకున్నావు కదా.
గడ్డిపోచ నుంచి గగనాంచలం దాకా
సర్వ సృష్టి
ప్రశ్నోత్తరాల కలబోతగా వుంది.
విశ్లేషించి చూస్తే
దేనికదే నీ కళ్లముందు నిలుస్తుంది.

చూసుకున్నావు కదా
ఇప్పుడేమంటావు?
ఇంకేమంటాను
ఔనంటాను.

## విశ్లేషణ

# వాసిరెడ్డి సీతాదేవి నవలల్లో సామాజిక దృక్పథం



### యర్రదొడ్డి సుగుణ

**సా**హిత్య ప్రభావం సమాజంలోనూ, సమాజ ప్రభావం సాహిత్యంలోనూ ప్రతిబింబించడం సర్వసాధారణం. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఏదో ఒక స్థాయిలో ప్రతిఫలించక తప్పదు. కనుక ఏ సాహిత్యంలో తీసుకున్నా సమకాలీన సాంఘిక చిత్రణ ఆయా రచనల్లో అంతర్లీనంగా ప్రతిఫలిస్తూనే ఉంటుంది.

సాంఘిక సమస్యల్ని లేక సాంఘిక వాస్తవాల్ని భౌతిక దృక్పథంతో పరిశీలించే రచయితను సామాజిక దృక్పథం గల రచయిత అని సొదుం రామ్మోహన్ గారి అభిప్రాయం.


"రచనలో వాస్తవాన్ని అందించడం వేరు. సామాజిక దృక్పథంతో వాస్తవాన్ని చిత్రించడం వేరు. అయితే నవలలో సామాజిక దృక్పథంతో కూడిన వాస్తవ చిత్రీకరణ జరగాలంటే రచయితకు భౌతికవాదం, వర్గచైతన్యం, వర్గదృక్పథాలతో పాటు వాటితో పరిచయం కూడా అవసరం. వీటన్నింటితో పరిచయమున్న రచయిత రచనలో సామాజిక చైతన్యం మరింత స్పష్టంగా, మరింత బలంగా వుంటుంద"ని 'సొదుం రామ్మోహన్' సాహిత్యావలోకనంలో అభిప్రాయపడ్డారు.

వాసిరెడ్డి సీతాదేవి తెలుగు సామాజిక జీవితంలోని అన్ని కోణాలు కన్పించేలా రచనలు చేశారు.దీనితో పాఠకుల మనస్సు హత్తుకునేలా ఈమె నవలలు దర్శనమిస్తున్నాయి. స్త్రీ పుట్టిన దగ్గర నుంచి వైధవ్యం పొందిన తరువాత కూడా ఎలాంటి ఇబ్బందులను అడుగడుగున ఎదుర్కొంటుందని తెల్పడంతో పాటుగా కొంతమంది స్త్రీలు తమకున్న విజ్ఞానంతో సమస్యను పరిష్కరించి ధైర్యంగా నిలబడుతుంటే మరికొందరు చదువు సంస్కారాలు ఉన్నప్పటికీ భర్త దగ్గర అవమానాలు, తిరస్కారాలు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని సామాజిక దృక్పథంతో ఆలోచించి రాశారు. దీనికి ఉదాహరణలుగా అర్చన, వసుంధర, బొమ్మరిల్లు, వైతరణి, రాబందులూ – రామచిలుకలూ నవలలు చెప్పుకోవచ్చు.

సీతాదేవి ప్రతి నవలా మానవుడి జీవితానికి అంతో యింతో ప్రాధాన్యాన్ని యిస్తున్నాయి. మానవుడికి ఆవేశం, అత్యాశ పనికిరాదని తెలియజేస్తూ దాని వలన పోగొట్టుకొనే జీవితం వివరంగా తెలియజేశారు. ఆవేశంతో 'సమత' నవలలోని అరుంధతి తీసుకున్న నిర్ణయం వల్ల ఆమె నిండు జీవితాన్ని కోల్పోయింది. చివరకు భర్త దగ్గర క్షమాభిక్ష కోరినా కూడా అతని దగ్గరకు చేరలేకపోయింది. అశ్లీల సాహిత్యాన్ని చదవడం వల్ల చిన్నప్పటి నుండి తన మనసు అదే ధోరణిలో ఉండటం వల్ల, తెలిసీ తెలియక ఆవేశంతో నోరుజారి చివరకు ఒంటరిగా మిగిలిపోయింది.

సీతాదేవి నవల ఏ ఒక్క కోణమో కాకుండా అన్ని కోణాల నుండి ఆలోచించి తద్వారా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా సాంఘిక దురన్యాయాలను పసిగట్టి వాటిని నలుగురికీ ఎత్తి చూపించడంలోనూ, పతనమైపోతున్న భూస్వామ్య సంస్కృతిని బొమ్మ కట్టించడంలోను వీరు సిద్ధహస్తులు. సమకాలీన సమాజాన్ని తీర్చిదిద్దే సామాజిక ఆర్థికాంశాలను తమ రచనలకు వస్తువుగా తీసుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారు. గ్రామీణ, పట్టణ జీవితాలను నిశితంగా పరిశీలిస్తూ, నేటి యువత ఆయా పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తూ తన రచనల ద్వారా వాటికి పరిష్కార మార్గాలను తెలియజేశారు.

సమిష్టి కుటుంబం అయితే ఆస్తి పంచాల్సి వస్తుందనే స్వార్థంతో ఆలోచించే వాళ్ళకు 'అడవిమల్లె' నవలలోని సారాంశం ద్వారా చాలా విషయాలు తెలిపారు. అందులో చంద్రం తన ప్రేమను పణంగా పెట్టి ఆపదలో ఉన్న అమ్మాయికి సాయం చేయడానికి అండగా నిలబడ్డాడు.




ఎంతమంది ఎన్ని రకాలుగా నిందించిన వెనకాడకుండా ఆమెకు దిక్కయ్యాడు. చివరకు రాక్షసుడి చేతిలో ఆవె ప్రాణాలు కోల్పోయింది.


మనుషులను నమ్మాలి కాని అది గుడ్డిగా నమ్మకూడదు. అందులో నిజాయితీని ముందు గ్రహించి ఆ తరువాత నిర్ణయం తీసుకోవాలి. ఏదైనా ఒక పని చేసేటప్పుడు దాన్ని ఒకటికి పదిసార్లు ఆలోచించుకొని మరీ చేయాలని మన పెద్ద వాళ్ళు ఊరికే అనలేదనిపిస్తుంది. ఆలోచించకుండా గుడ్డిగా నమ్మిన 'సత్యనారాయణ చెల్లెలి ప్రేమకు బంధితుడయి తన మనసు పాడుచేసుకోవడమే కాకుండా తన భార్యా పిల్లలను పట్టించుకోకుండా చెల్లి ధ్యాసలో ఉండి ఆమె తన స్వార్థం కోసం లేనిపోని మాటలు చెప్తే అవన్నీ విన్న 'సత్యనారాయణ భార్యకు తెలియకుండా ఆమె నగ అపహరించాలని చూస్తాడు. చివరకు ఆమెకు తెలిసి అడ్డు వచ్చేసరికి భార్యను కొట్టి మరీ ఆమె నగ తీసుకెళ్లి చెల్లికిస్తాడు. అక్కడికి వెళ్ళాక చెల్లి కాపురం చూసిన సత్యనారాయణ, తను చేసిన తప్పు గ్రహించి యింటికి వస్తే అప్పటికే భార్య చనిపోతుంది.

'మృగతృష్ణ' నవలలో సునంద దారిద్ర్యపు బాధను పుట్టిన దగ్గర్నుంచి అనుభవించింది. ఆ బాధతోనే తల్లిదండ్రుల దగ్గర దెబ్బలు తిని తిని అవమానంతో ఆత్మహత్య చేసుకుంటుంది. తల్లి లేకపోయేసరికి తండ్రి బిడ్డలను అడిగిన వాళ్ళకు అప్పగించి బాధ్యత దులుపుకుంటాడు. ఇవన్నీ అనుభవించిన సునంద కాలేజీలో తోటి కుర్రాడిని ప్రేమిస్తుంది. ఉద్యోగంలో చేరాక యిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకొంటారు. కానీ ఈలోపు సునందకు పై అధికారి నుండి పెళ్ళి ప్రస్తావన వచ్చేసరికి అతన్ని చేసుకోవాలనుకొంటుంది. ఇంట్లోంచి బయలుదేరి పెళ్ళి చేసుకోవడానికి వెళ్తుండగా మార్గమధ్యం లో ప్రేమించిన అతని ఆలోచనలతో మనసంతా ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే తుట్టకోలేక ఆ పెళ్ళిని తిరస్కరించి వెనక్కి వస్తుంది. నిలకడలేని మనస్తత్వంతో సునందకు డబ్బు మీద ఉన్న వ్యామోహం కొద్దీ ప్రేమించిన వ్యక్తి గురించి ఆలోచించకుండా డబ్బున్న వ్యక్తి అని పెళ్ళికి అంగీకరించి మళ్ళీ వెనక్కి తిరిగి ప్రేమించిన వ్యక్తి దగ్గరకు వచ్చినా అతన్ని పొందలేని పరిస్థితి తెచ్చుకొంది.

సమాజంలో కొంతమంది తమ సమస్యను తీర్చుకొనే ధైర్యం లేక తల్లిదండ్రులకు చెబితే పరువు తక్కువని వాళ్ళు ఏమవుతారోనని భయపడి ఎవరికీ చెప్పకుండా ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నారు. ఇదే విధంగా సీతాదేవి నవలలో అర్చనని చూడవచ్చు. ఆమె చేయని తప్పుకు భర్త అనుమానించి అన్ని రకాలుగా హింసిస్తాడు. అది భరించలేని అర్చన ఆత్మహత్య చేసుకొని చనిపోతుంది. తల్లిదండ్రులు పెళ్ళి సంబంధం చూసేటప్పుడు ఆస్తీ అంతస్తుకు ఇచ్చినంత ప్రాముఖ్యత పిల్లాడి వ్యక్తిత్వాన్ని గురించి తెలుసుకొని పెళ్ళి చేసి ఉంటే అర్చన నిండు జీవితం బలయ్యేది కాదు.

తల్లిదండ్రులు ఆడపిల్లలకు వయసొచ్చిందంటే గుండెల మీద కుంపటిలాగా భావిస్తారు. వాళ్ళలో ఈ తరహా ఆలోచనలో మార్పు రావాలనే ఉద్దేశ్యంతో సీతాదేవి ఉరి త్రాడు నవల రాశారు. ఈ నవలలో కరుణ తొందరగా పెళ్లి సంబంధం కుదరడం లేదని ఆమె తల్లి రోజూ కూతుళ్ళను నిందిస్తుంది. తీరా పెళ్ళి సంబంధం కుదిరింది అనుకున్నాక ఆ వ్యక్తికి అన్ని వ్యసనాలు ఉన్నాయని తెలిసినా ఆమె తల్లి మాత్రం అదే పెళ్ళి చెయ్యాలి లేదంటే పరువు తక్కువని భావిస్తుంది. అతనితోనే పెళ్ళి జరిపిస్తారు. అందరూ ఎంతో పవిత్రంగా భావించే మంగళసూత్రం కరుణ పట్ల ఉరిత్రాడుగా మారింది. పెళ్ళి జరిగిన సంవత్సరం తిరగకముందే కట్నం డబ్బులు పూర్తిచేసి మెడలోని బంగారం అంతా లాగేసి చివరకు మంగళసూత్రం ఇవ్వనందని బలవంతంగా లాక్కొని యింట్లోంచి గెంటేస్తాడు. ఆ సమయంలో పుట్టింటికి వెళ్ళిన ఆమె తల్లి కూడా భర్తను వదిలి ఇలా రావల్సింది కాదు. అంతకాదంటే చావాల్సిందంటుంది. అందరి బలవంతంతో భర్త దగ్గరకు వెళ్తే అక్కడ మందు తాగడానికి డబ్బులేక భార్యను పరాయి మగాడి పక్కన పడుకోబెట్టాలని చూస్తాడు. ఈ విషయం తెలుసుకొన్న కరుణ వాళ్ళకు బుద్ధి చెప్పి తన మెడలో పసుపుతాడు భర్త ముఖాన కొట్టి ధైర్యంగా బయటకు నడుస్తుంది. "వైతరణి' నవలలో చూస్తే పదిహేను సంవత్సరాలు కూడా నిండని పార్వతిని యాభైఐదు సంవత్సరాల ముసలివాడికి ఇచ్చి పెళ్ళి జరిపిస్తారు. ఆ ముసలాడితో కాపురం చేయడం యిష్టం లేక మేనల్లుడి ఆదరణతో ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది. వెళ్తూ తల్లితో, నాకు ఈ సమాజంతో పనిలేదు. ఈ సమాజం నీకు ఏమి యిచ్చింది. నా బతుకును నేను ఎంజాయ్ చెయ్యాలనుకొంటున్నాను. నన్ను ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు. నువ్వు అర్థం చేసుకుంటే చాలని యిల్లు విడిచి వెళ్ళిపోతుంది.

ఇలా సీతాదేవి నవలలో సమాజంలో ఉన్న సమస్యల్ని తెలుపుతూ వాటికి తన ధోరణిలో తగిన సలహాలను, సూచనలను అందిస్తూ రచనలు చేశారు. సమస్యను చూసి భయపడే స్త్రీలనే కాక దానికి ధైర్యంగా ఎదురు తిరిగి నిలబడి, సమస్య నుండి స్త్రీ ఏ విధంగా బయటపడిందన్న విషయాలను మన ముందుంచారు.



## కవిత

# దేశం ఏమౌతుంది ?

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
9493375447



మనిషి పుర్రెను
కుక్కలు జుర్రేసినట్లు
భూమిగర్భాన్ని
ఖాళీ చేసేశాక
దేశం ఎండిన సొరకాయ బుర్రకాక
మరేమౌతుంది ?

ఒక్కొక్కడూ
ఒక్కొక్క బుల్డోజరై
వాగులు వంకలు
కొండలు అడవులు
కుళ్ళగించేశాక
దేశం
పురాతన కుండ పెంకు కాక
మరేమౌతుంది ?

సిగరెట్టు పీల్చి
బూడిద నుయాష్ట్రేలో రాల్చేసినట్లు
ప్రణాళికా పద్దుల్ని కాజేసి
అప్పులు మిగిలిపోయాక
దేశం బూడిదకుప్పగాక
మరేమౌతుంది ?


ఈ దేశం నీళ్ళు తాగి
ఈదేశం గాలిపీల్చి
ఈదేశం గుడ్డ గట్టి
పడమటి రెక్కలు తొడుక్కొని
ఎగిరిపోతే
దేశం మసిగుడ్డ గాక
మరేమౌతుంది ?

తామర కొలనులో
ఏనుగులు జొరబడినట్లు
దేశంలో దొంగలు బడ్డాక
అది
పీనుగుల పెంట గాక
మరేమౌతుంది ?
నీతినంతా దొంగిలించేసి
నీతో.... నీతో... అని అరుస్తుంటే
దేశం
చీరగట్టిన సినీతారగాక
మరేమౌతుంది ?

# ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా

-వల్లభాపురం జనార్దన
9440163687

నేను రూపంలో మనిషినే
నిజంగా మనిషిననిపించుకుంటున్నానా?
అన్నది ప్రశ్నార్థకమే
ఇప్పుడసమాపక వాక్యంగా ఉన్న నేను
సమాపక వాక్యమై వాఖ్యానంగా మారడానికి
భగత్‌సింగ్‌నయ్యాను.
తథాగతుణ్ణయ్యాను
జ్యోతి బాపూలేనయ్యాను
అంబేద్కర్‌నై ఆగిపోయాను.
మనిషిని చేసే చదువుందేమోనని
అంతర్జాలాన్ని గాలించి వడపోశాను
పెట్టుబడిదారును బతికించే
చదువుల బడులే కన్పించాయి.
బతుకు తెరువును ఈడ్వడం కోసం
వాహనసంచార వ్యూహంలోదూకి
వేగ నిరోధకాల ఎదురుదాడిలో
తలపగిలి మెదడు చిట్లగొట్టుకున్నాను.



ఆరోగ్యాన్నిచ్చే తిండికోసం
వాల్‌మార్ట్ ప్రపంచం ముందు మోకరిల్లాను.
ఆకర్షకపత్రాల ప్యాకింగుల్లో
అనారోగ్య పోషకాహారమే దొరికింది.
పీల్చుకుతింటున్న రోగాన్ని తరిమికొట్టడం కోసం
మందుల షాపుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తే
ప్రిస్క్రిప్షన్ల రోకలి బండమోదింది.
కొందరు ఒంగోలు గిత్తల్లాబలుస్తుంటే
అందరూ ఆత్మహత్యల చావు చస్తున్నారు
వాడు ఎందుకు బతికున్నాడో
వీళ్ళెందుకు చస్తున్నారో
ఆ పరుసవేదిని కనుక్కోవడం కోసం
మార్క్స్‌నై కర్ఫ్యూ తాండవమాడుతున్న
ప్రయోగశాలల్లోకి
నిషేధాన్ని నిషేధిస్తూ కదిలాను
అందరిలో ఒకడుగా కాదు
అందరమూ ఒకటిగా

విశ్లేషణ

# ఉత్తమ కథకుడు శశిశ్రీ


కె.పి. అశోక్‌కుమార్

9700000948





కవిగా, కథకుడిగా, జర్నలిస్టుగా, సాహిత్య పత్రిక ఎడిటర్‌గా ప్రసిద్ధులైన శశిశ్రీ సరికొత్త కథా సంపుటమిది. ఇతివృత్తంలో, కథా కథన పద్ధతిలో వైవిధ్యభరితంగా మలచిన ఈ కథలు పాఠకుడి మనసును చూరగొంటాయి. జీవన పోరాటంలోని అశక్తత – నిస్సహాయతను, మనుష్యుల్లో పెరిగిపోతున్న అవకాశవాదాన్ని, రాజకీయాలను, కొత్తగా వస్తున్న నియో రిచ్ కల్చర్ ధోరణులను వారి కథలో చిత్రీకరించిన విధానం పాఠకుల్ని అబ్బురపరుస్తుంది. ఒకప్పుడు బాగా బ్రతికిన రైతులు, వరుస కరువులతో దివాళా తీస్తారు. కూలి పనులకు వెళ్ళలేరు. ఎవరినీ యాచించలేరు. చేసేది లేక చీకట్లో తమ పాలేరు పొలంలో దోసకాయల దొంగతనానికి వచ్చిన రాముడు అది బయటపడటంతో ఆత్మహత్య చేసుకోవడం "అలికిడి"లో కనిపిస్తుంది. అప్పిచ్చిన సుగాలీ సీతమ్మకు మొఖం చూపించలేక దాటేసిన సుబ్బారాయుడు, ఆమె కోర్టుకు పోకుండా ఆపడానికి ఇంటికి వెళతాడు. పాత అప్పును పట్టించుకోకుండా అతను నిలదొక్కుకోవడానికి మరింత ధనసహాయం చేసి పంపించడంతో ఆమె "ఆత్మబంధువు" కంటే ఎక్కువేనని గుర్తిస్తాడు. కండక్టర్‌గా పనిచేసే సుబ్బారాయుడు ఒకసారి బస్సులో సుగాలీ సీతమ్మ కుమార్తె నొప్పులు పడుతుంటే ప్రయాణీకులను దించేసి, ఆడాళ్ళ సహాయంతో పురుడుపోసి, ఆమెను ఇంటి దగ్గర దింపి వెళతాడు. ఇందుకు కోపించిన బస్సు యజమాని ఉద్యోగంలోంచి తీసేస్తాడు. భర్త, అల్లుడు లేని సీతమ్మ తన వంశాన్ని నిలిపిన సుబ్బారాయుడి మంచితనానికి మెచ్చి అతనికి అండగా నిలుస్తుంది. అవకాశవాదం రాజకీయాలలోనే కాదు, మనుషుల్లో కూడా మామూలైపోయిందని తెలిపే కథలు కొన్ని. శాస్త్రి సహాయంతో ఎంతో పైకెదిగిన రాజు, చివరకు శాస్త్రిని నిస్సహాయ పరిస్థితిలో పడేసి అతని ఇంటిని స్వంతం చేసుకున్న కథ 'స్టేటస్'. వ్యాపారంలో స్వపరభేదం, మంచి – చెడులకు తావులేదని నిరూపించే కథ ఇది. ధనబలం, కుల బలం అండ జూపి రాజకీయాల్లోకి దిగుతాడు. ఇవేమీ లేకుండా గోకర్లపేట కాన్షిస్సియెన్స్ నుంచి ఎం.ఎల్.సి.గా పోటీ చేసిన శంకర్ ఆ విపరీత వ్యయాన్ని తట్టుకోలేక దివాళా తీయడం, పోటీ అభ్యర్థి ట్రాప్‌లో పడి ఓడిపోవడమే "షేక్ హ్యాండ్". ఇంట్లో చెట్లు నరికేసే మనిషి స్కూల్లో చెట్లు నాటే కార్యక్రమానికి సారధ్యం వహించడం విచిత్రం కాదు. అది రాజకీయమని "ప్రకృతి" తెలియజేస్తుంది. ఎంతో కరడుగట్టిన ఫ్యాక్షనిస్టు అయినా పాపభీతి తొలిస్తే తప్ప అతని మనస్తత్వంలో మార్పు రాదు. దానధర్మాల పేరిట అక్రమార్జనలో కొంత భాగమైనా ప్రజాసేవకు ఉపయోగపడుతున్నందుకు మనం సంతోషించక తప్పదు. "రాతిలో తేమ" అనే ఈ కథ ఫ్యాక్షనిజంపై వచ్చిన డిఫరెంట్ కథగా గుర్తుండిపోతుంది. రాజకీయరంగం కంటే ఇతర రంగాలే లాభసాటివిగా మారిపోవడంతో రాజకీయ పార్టీలు కనుమరుగైపోతాయి. ప్రజల్లో చైతన్యం పెరగడంతో ప్రతి పైసాకు జవాబుదారీ వచ్చేస్తుంది. పాలన పూర్తిగా పారదర్శకమై, రాజకీయ రంగమంతా ప్రక్షాళన అయిపోతుంది. అలాంటప్పుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని నడపడమంటే విలువైన కాలాన్నీ, జీవితాన్ని ఖర్చు చేయడమే అని భావించి ఎవరూ రాజకీయాల్లోకి రాకపోవడంతో పార్టీలు మూతపడతాయి. సి.ఎం. ఎంపిక కోసం ఎంతో కష్టపడాల్సి వస్తుంది. "స్వప్న వాస్తవ" మనే ఈ కథ ఊహాతీతమైనా, అద్భుత రసానికి చెందినదిగా చెప్పవచ్చు. పెళ్ళిళ్ళ విషయంలో ఉన్నవాళ్ళకేమో ఎన్నెన్నో పంతాలు, పట్టింపులుంటాయి. లేనివాడికయితే తన అవసరాలు, పరిమితులను స్పష్టంగా గుర్తించి దానికనుకూలంగా నడుచుకోవాలని "నిప్పు... నీరూ.." తెలియజేస్తుంది. పెళ్ళిలో తమకు మర్యాదలు సరిగా జరపలేదని ఆగ్రహావేశాలతో రగిలిపోయే మగపెళ్ళివారు ఆ పెళ్ళిని రద్దు చేస్తారేమోనని భయపడతాం. కాని పెళ్ళి అన్న తర్వాత కోపతాపాలు తప్పవనీ, అవన్నీ తాత్కాలికమేనని తెలుసుకోవడంతో ఆందోళన సద్దుమణిగిపోతుంది. 'నా గర్వం" అనే ఈ కథలో గుంపు మనస్తత్వాన్ని చిత్రించిన విధానం చాలా బాగుంది. మనుషులు మట్టిజీవులు. కాని ఆ బుద్ధి వెర్రి తలలు వేస్తుంది. మానవ జీవన సమతుల్యం దెబ్బతింటున్నది. ప్రకృతి విరుద్ధమైన లైంగిక సంబంధాలతో నాగరికతను, సంస్కృతిని హేళన చేస్తున్నారు. ఈ "ఆం" అనే కథ ఆశ్చర్యాన్ని కాదు, విషాదాన్ని కూడా తెలియజేస్తుంది. బ్రహ్మాండంగా ఏర్పాటు చేసే కుస్తీ పోటీలలో భారీ ఎత్తున పందాలు కాస్తారు. అలాంటప్పుడు ఎవరు గెలిచినా, ఓడిపోయినా డబ్బులు కోల్పోవడంతో పాటు గలాభా చెలరేగే ప్రమాదముంది. అలాంటప్పుడు నిర్వాహకులు ఎక్కువ శాతం పోటీలను 'టై'గా నిర్ణయిస్తుంటారు. లేదా కలక్షన్స్‌ను

బట్టి వస్తాదులు. గెలుపోటములను ముందే నిర్ణయిస్తుంటారు. ఈ 'గోదా" కథలో కూడా రామయ్య గెలిచే సమయానికి పొగ బాంబులు విసిరేయడంతో అంతా చెల్లాచెదురవుతారు. ఫలితం తెలియకుండా పోటీ ముగిసిపోతుంది. కుస్తీ పోటీలలో వున్న మతలబులను ఈ కథ తెలియజేస్తుంది.

ముస్లింలలో వున్న నిరక్షరాస్యత, దారిద్ర్యం, గల్ఫ్‌కు పోయేవారి మీద కుటుంబ సభ్యులంతా ఆధారపడాల్సి రావడం – ఇలాంటి పరిస్థితులలో కూడా పండుగలకు, పబ్బాలకు, పెళ్ళి పేరంటాలకు తప్పనిసరిగా ఖర్చు పెట్టాల్సి రావడం, వాటి కోసం అప్పులు చేయడం, అది ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనతో కృంగిపోవడం, ఇలా వారి జీవన విధానాన్ని తెలియజేసిన కథలు మనసుకు హత్తుకుపోతాయి. తోపుడు బండిలో పళ్ళు అమ్ముకునే సత్తార్ రంజాన్ పండుగ సందర్భంగా ఇంటిల్లిపాదికి బట్టలు కుట్టించినా దర్జీకి ఇవ్వడానికి డబ్బులు వుండవు. తనకు లేకపోయినా ఇంట్లో అందరికి తెచ్చాడని తెలిసిపోతుంది. అంతలో సత్తార్ బావమరిది వచ్చి పండుగ కోసం వాళ్ళకు బట్టలు తేవడంతో పాటు, దర్జీ కూలీ కూడా ఇచ్చేసానని చెప్పడంతో తన "ఇజ్జత్" నిలబడిందని సత్తార్ సంతోషపడతాడు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు ఇవ్వడం పుణ్యకార్యంగా భావిస్తారు. ఆ సంవత్సరం ఆదాయంలో నుండి స్వచ్ఛందంగా తీసే పన్ను జకాత్. దాన్ని పేదలకు పంచాలి. నిజమైన పేదలను గుర్తించి ఆ డబ్బు ఇవ్వడం "ఆనవాళ్ళు" కథలో ఆసక్తికరంగా చిత్రీకరించారు. రంజాన్ పండుగకు తుడుం వాయించే సుబ్బయ్యకు, మాబూ సాహెబ్‌కు మధ్య వున్న స్నేహం కులాలకు, మతాలకు అతీతమైనదని "ఇనామ్" నిరూపిస్తుంది. గవర్నమెంట్ అడిషనల్ ఖాజీ గౌరవ వేతనం కూడా లేని వ్యక్తి. ఆ పట్టణంలో వున్న ఆరుగురు ఖాజీలతో పోటీగా పెళ్ళిళ్ళు జరిపిస్తేనే ఆయన ఇల్లు గడిచేది. దానికోసం ప్రింటింగ్ ప్రెస్‌వాళ్ళకు, తెలిసిన వాళ్ళకు చెప్పి వుంచుతాడు. అనుకోకుండా ఒక తమిళనాడు యువకుడికి ఆంగ్లంలో నిఖా జరిపినందుకు బోలెడు పారితోషికం అందుతుంది. ఆ పెళ్ళిలో ఆడవారికి మెహందీ పెట్టడానికి తన భార్య వచ్చిందని తెలిసి ఖాజీగారికి మింగుడు పడదు. ఆమె ఇంటి పరిస్థితి గమనించి గడప దాటిందనుకోవాలా? లేక తన అసమర్ధతను ఎత్తి చూపిస్తుందా? అర్ధంకాక తెల్లమొగం వేయడాన్ని "ముజఫర్"లో చూడవచ్చు. "వలీమా" పేరుతో జరిగే రిసెప్షన్‌లో మూడువంతుల మందికి ఆహ్వాన పత్రికలు పంచుతారు సత్తార్. వాళ్ళు చదివించే కట్నం డబ్బు పెళ్ళి ఖర్చులకు వస్తాయనుకుంటే అంతా వూరికే వచ్చి తినిపోతారు. అప్పులోడిలా వచ్చిన కటిక కరీంసాబ్ గొప్ప మనసు చివరకు తెలిసి మనసు ద్రవించిపోతుంది. ముస్లింలు పెండ్లి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. కాని వాళ్ళలో కూడా వరకట్నం ఒక సమస్యగానే తయారయింది. కట్నకానుకల కోసం ఆడపెళ్ళివారిని




పీడించడం ఎలా మామూలైపోయిందో "వాహేజ్" కథ వివరిస్తుంది. అలాగే "కంకర" కథలో కరీముల్లా చెల్లి పెళ్ళిలో రెండు తులాల బంగారం తక్కువయిందన్న మిషతో రాకపోకలు ఆగిపోతాయి. కరీముల్లా పెండ్లి చేసుకుంటే అతనికి వచ్చే కట్నంలో నుండి రెండు తులాలు రాబట్టాలనుకుంటారు. కాని కరీముల్లా కట్నం లేకుండా మేన సంబంధం చేసుకోవడం, అతని బీదస్థితిలో పాత కట్నం చెల్లించలేని పరిస్థితి. చివరకు కరీముల్లా తన మామ నుండి వసూలు చేసి చెల్లెలి కాపురం నిలబెట్టాలనుకుంటాడు. అది తెలిసిన తర్వాతే వాళ్ళు పెండ్లికి రావడానికి ఒప్పుకుంటారు. "నదీ కె పాద్" కథలో దోసచెట్ల సాగు కోసం పుట్టింటి కొచ్చిన కూతురి నగలను కుదువబెడతాడు మెదిన్ భాష. భర్త సౌదీకి పోవడంతో అత్తింటి వాళ్ళు నగలు అడగగా పుట్టింటికొస్తే, అక్కడ తండ్రి బాధ చూడలేక నగలిస్తుంది. పంట చేతికొస్తే నగలు విడిపిద్దామనుకుంటారు. తీరా వరదలు వచ్చి పంటంతా నాశనమైపోగా, గుండె బద్దలైన తండ్రి ఆ ప్రవాహంలోనే కొట్టుకుపోతాడు. అలాగే "అనుకూల శత్రువులు" కథలో సౌదీకి పోయిన కొడుకు కరీముల్లాపై ఎన్నో ఆశలతో, వాడి సంపాదనతో తండ్రి ఇద్దరి బిడ్డల పెళ్ళిళ్ళు చేస్తారు. కరీముల్లా పెళ్ళి చేసుకున్నా ఇటు అత్తింటివాళ్ళు, అటు పుట్టింటివాళ్ళు తమ కష్టాలు చెప్పుకుని కరీముల్లా భార్యతో ఖర్చు పెట్టిస్తుంటారు. ఇలా అయితే లాభం లేదని కరీముల్లా పంచాయతీ పెట్టి వేరు కాపురం పెట్టినా, ఎవరికేం వచ్చినా వారే చూడాల్సి రావడంతో కథ మొదటికే వస్తుంది. గుట్టుగా, గౌరవంగా పచారీ అంగడి నడుపుకునే చాంద్‌బాషా అంటే అందరికి గౌరవం. అతను ఒక పది రోజులుగా కనబడకుండా పోయేసరికి దివాళా ఎత్తాడని అంతా అనుమానిస్తారు. రియల్ ఎస్టేట్‌లో దిగి ఇరుక్కుపోయి అప్పుల పాలయిన చాంద్ బాషాను అతని అన్నదమ్ములు వచ్చి ఆదుకోవడంతో తిరిగి పాత జీవితాన్ని కొనసాగించడం "ఫరిష్తే"లో చూడవచ్చు. ఈ కథల ద్వారా ముస్లింల జీవన విధానాన్నే కాకుండా పండుగలు, పెళ్ళిళ్ళ ద్వారా వారి సాంస్కృతిక విశేషాలను కూడా రచయిత తెలియజేసిన విధానం చాలా బాగుంది.

ఈ సంపుటిలోని కథలను రచయిత 'బహిర్లోకం', 'అంతర్లోకం' అని రెండు విధాలుగా విభజించారు. బహిర్లోకం అంటే వాళ్ళ ముందున్న సమాజంలోని తెలుగువారి జీవితాలను, అంతర్లోకం అంటే ముస్లిం జీవితాలని వారి అభిప్రాయం. ఫ్యాక్షనిజం, కరువు, రాజకీయాలు, మానవ సంబంధాలు, అవకాశవాద ధోరణులు మానవ ప్రవర్తనను, జీవితాలను ఎలా అస్తవ్యస్తం చేస్తున్నాయో బహిర్లోకం కథలు తెలియజేస్తాయి. ముస్లిం మైనారిటీ జీవితాలలోని వేదనలను, సమస్యలను అంతర్లోకం కథలు తెలియజేస్తాయి. ఏ కథ రాసిన దాని గురించి సమగ్ర అధ్యయనం, అవగాహనలతో ఆ కథలను రక్తి కట్టించారు. వస్తువు తెలిసినదే అయినప్పటికీ దానిని వైవిధ్యభరితంగా తీర్చిదిద్దడంలో రచయిత చూపిన ప్రతిభ ప్రశంసనీయం.

## కవితలు

### పనిముట్టు

-డా॥ ఎన్.గోపి



జేబులోని పెన్ను
వేళ్ళ మధ్యకొచ్చింది
వేళ్ళలోని రక్తం పరవళ్ళకు
దాని వొళ్ళంతా ఆవేశంగా మారింది
రెండు కొండల మధ్య
అదొక అదొక
అదృశ్య జలపాతమై
లోకం నిండా
భావశీకరాలు వ్యాపించాయి.

వేళ్ళ మధ్యలోంచి పెన్ను
కాగితం పైకి దూకింది
భూమిలోని స్తబ్దతను చీల్చే
నాగలి కర్రులా
జీవకణాలను మేల్కొలిపింది.
సుడి గుండాల్లో చిక్కిన నావను
ఒడ్డుకు చేర్చే తెడ్డులా
ముందుకు కదిలింది.
కుమ్మరి చక్రాన్ని తిప్పే
కర్రలా
ఆకృతులను మలిచింది.

నీ చేతిలోని పెన్ను నీది కాదు
అది కోట్లాది నిరుపేదల
పనిముట్ల రూపాంతరం.
అవి చెమటలో తడిసిన మట్టిని
రొట్టెగా మారుస్తాయి.
చెట్టంత ప్రాణవాయువుతో
జీవిన సంగీతాన్ని వినిపిస్తాయి.

చేతిలో ఉన్నది
వొట్టి పెన్నే కావచ్చు
మరచిపోకు
అది అశేష జనవాహినికి
మొలిచిన కన్ను.

---

### పంతొమ్మిదవ పర్వం - పన్నెండవ ఆశ్వాసం !

డా. రాధేయ
9985171411

మనమిప్పుడు మనుషుల గురించి కాక
మానవ మృగాల గురించి
మాట్లాడుకుంటే బావుంటుంది !

ఒకానొక సందిగ్ధ క్షణంలో
భయం రెక్కల కింద
వొదిగి కూర్చున్న పిరికితనాన్ని గురించి
చర్చించుకుందామా !

ఖాండవ దహనానికి ముందే
పిట్టలు గూళ్ళను ఖాళీ చేసి
ఎగిరిపోయిన నిర్జన శూన్యంలో
గొంతు దిగని దుఃఖాన్ని గురించి
కలబోసుకుందామా !



గాలీ, నీరు కరువైన నేలమీద
గాయాలు తడుముకుంటూ
ఎంతకాలమని జీవిస్తాం చెప్పు ?

ఇతిహాసపు చీకటి కోణాలే కాదు
వర్తమాన వాస్తవదృశ్యాలన్నీ
రక్తసిక్త అనుభవాలే
గాయాల సలపరింతలే !

మెత్తగా తడిసిన పాదంలోకి
కసిగా దిగబడిన ముళ్ళు
సమస్త దేహాన్నీ వణికించినట్లు


ఒక అసహాయురాలి ఆక్రందన
ఢిల్లీనేకాదు యావద్భారతావనికే
సవాల్‌గా నిలిచింది

నాకిప్పుడు 'వందేమాతరం' అంటే
వందేళ్ళ అభద్రతాభావమై
కలవరపెడుతోంది
సారే జహాసే అచ్ఛా' అంటే
సామాజిక ఆర్తనాదంలా ధ్వనిస్తోంది
పద్దెనిమిది పర్వాలతో
పంచమవేదంగా భాసించిన మహాభారతంలో
పంతొమ్మిదో పర్వంగా అత్యాచారపర్వాన్ని చేర్చి
'మేరాభారత్‌మహాన్' అంటూ గర్వపడదామా !

వెదురు వనాలే తగలబడిపోతుంటే
వేణుగాన మాధుర్య మెవడిక్కావాలి !
కళ్ళముందే మానవతాశిఖరం కూలిపోతోంది
ఎవరికి వారు తమ భుజాన్నిచ్చి
ఆసరాగా నిలబెట్టుకుందాం రండి !
ఉగ్గబట్టుకున్న దుఃఖం
ఉప్పెనగా ఎగిసిపడుతున్నప్పుడు
దిగుళ్ళ ముళ్ళ పొదల్లోంచీ
ఆత్మ విశ్వాసం ఆయుధంగా
పదునెక్కకముందే మేల్కొందాం

ఆ కనురెప్పల పూరెమ్మలకు
కరవాలాలు పూయాలన్న
ఒక గొప్ప జీవనకాంక్షను
వాగ్దానం చేద్దాం !!

తెలుగు వెలుగు




# అంతర్జాలంలోని తెలుగు వెలుగులలో బాలల కోసం ప్రసరిస్తున్న కిరణాలు

పి.వి. లక్ష్మణరావు
9492043837

***చురకత్తిలాంటి చూపులతో మెలితిరిగిన కోరమీసంతో భుజాన భేతాళుడితో గంభీరంగా స్మశానంలో నుండి నడిచి వెళ్తున్న విక్రమార్కుడు ఒంటికన్ను రాక్షసుడు, అతనితో సాహసోపేతంగా యుద్ధం చేసి రాజకుమారిని ఆమె రాజ్యానికి తీసుకుని వస్తున్న సాహస వీరుడు మెలితిరిగిన తోకలతో చూడగానే భయపెట్టేలా కాక ముద్దుగా కనిపిస్తూ, చెడ్డ అత్తగారి భరతం పట్టి మంచి కోడలికి సహాయం చేసిన అందమైన దెయ్యాలు వీటిలో ఏ ఒక్కటి గుర్తున్నా వాళ్ళు చిన్నప్పుడు ఖచ్చితంగా ఏ చందమామనో, బొమ్మరిల్లునో పదిలంగా దాచుకుని చదివిన అదృష్టవంతులు అయ్యి ఉంటారు.***

**తె**లుగింటి ఆచారాలూ, సంప్రదాయాలు, చుట్టరికాలూ, బంధుత్వాలు, ఆటలు, పాటలు, వీటన్నింటినీ మేళవించిన తెలుగు సంస్కృతిని మన పిల్లలకు బాలసాహిత్యం ద్వారా అందించాలి. పూర్వం బాలల కోసం చందమామ, బాల మిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి ఇలా అనేక పత్రికలు వచ్చేవి. అందులో పిల్లలకోసం ఎన్నో కథలు, పాటలు, నాటికలు, పొడుపు కథలు సామెతలు ప్రచురించబడేవి. అవన్నీ కట్టుకథలు వట్టి కథలు కావు వాటి ద్వారా బాలలకు నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం, త్యాగం, దానం, ఎన్నెన్నో విషయాలు గురించి తెలిసేవి. అటువంటి బాలసాహిత్యాన్ని అందించేందుకు చేయితిరిగిన కవులు, పండితులు, రచయితలు ముందుకొచ్చేవారు.

చురకత్తిలాంటి చూపులతో మెలితిరిగిన కోరమీసంతో భుజాన భేతాళుడితో గంభీరంగా స్మశానంలో నుండి నడిచి వెళ్తున్న విక్రమార్కుడు ఒంటికన్ను రాక్షసుడు, అతనితో సాహసోపేతంగా యుద్ధం చేసి రాజకుమారిని ఆమె రాజ్యానికి తీసుకుని వస్తున్న సాహస వీరుడు మెలితిరిగిన తోకలతో చూడగానే భయపెట్టేలా కాక ముద్దుగా కనిపిస్తూ, చెడ్డ అత్తగారి భరతం పట్టి మంచి కోడలికి సహాయం చేసిన అందమైన దెయ్యాలు వీటిలో ఏ ఒక్కటి గుర్తున్నా వాళ్ళు చిన్నప్పుడు ఖచ్చితంగా ఏ చందమామనో, బొమ్మరిల్లునో పదిలంగా దాచుకుని చదివిన అదృష్టవంతులు అయ్యి ఉంటారు. మరి నేటితరం సంగతో ఇప్పటి పిల్లలకు బాల సాహిత్యం అంటే హ్యారీపోర్టర్, టింటిన్, సింద్రెల్లా మరోటో మరోటో మనది కాని సాహిత్యమే కానీ పాత రోజుల్లో పెద్దలు గ్రోలిన రుచులు వారికి అందుబాటులో లేవు.

అసలు మంచి దెయ్యాల గురించి, సాహస వీరుల గురించి, భేతాళుడి గురించి వారికి తెలిసే అవకాశం ఎంత ఉంది, ఆ అవకాశం వారికి మనం ఎంతవరకూ ఇస్తున్నామనేది ప్రశ్నార్థకం. ఇంగ్లీషులో చదివితే గ్లోబల్ మార్కెట్‌లో విలువ పెరుగుతుంది. నిజమే కానీ తెలుగులో అదీ వారి మాతృభాషలో అందమైన కథలున్నాయి వాటిలో నీతితో పాటు బ్రతుకు మార్గాలు ఉంటాయని కానీ అసలు తెలుగులో కథలు ఇంత బాగుంటాయన్న అనుభవం కానీ వారికి మిగిలించడం లేదు.

మాతృభాషలో మాట్లాడటమే మహాపరాధంగా భావించే తల్లితండ్రులు బడి యాజమాన్యాలు ఒకవైపైతే, మనసుని కట్టిపడేసే బాలసాహిత్యం అందుబాటులో లేకపోవటం మరొకవైపు. కాకపోతే ఇంతటి విషమ పరిస్థితుల్లోనూ ఒక ఆరోగ్యకరమైన విషయం ఏమిటంటే ఈ రోజుల్లో వస్తున్న దినవార, మాస పత్రికలు బాలలకోసం, బాల సాహిత్యం కోసం ఒక పేజీ కేటాయిస్తున్నాయి. అందులో పిల్లలు రాసిన కథలు, పాటలు, కవితలను ప్రచురిస్తూ వారికి తగిన పారితోషికం అందచేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నాయి తద్వారా బాలలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తున్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాల నుండి వేలమైళ్ల దూరం వెళ్ళిన తెలుగువాళ్ళు(వాళ్లంతా మన ఇళ్ల నుండి వెళ్లినవారే) వాటిని వదలకుండా తమ పిల్లలకు నేర్పుతున్నారు. శతక పద్యాలు, త్యాగరాజ కీర్తనలు, భరత నాట్యాలు, బాల సాహిత్యం, పసితనం నుండే శ్రద్ధగా నేర్పుతున్నారు. అక్కడ గుళ్ళు, గోపురాలు, సాహితీ సభలు, సంగీత కచేరీలు, బాలానంద సంఘాలు ఏర్పాటు చేసుకుంటూ అందమైన తెలుగు ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నారు.

అంతేకాక ఇప్పటితరానికి ఆ లోటుని పూడ్చటానికీ, ఆనాటి రుచులని అందించటానికి మొక్కవోని దీక్షతో, ఎలాంటి లాభాపేక్ష లేని నిష్కల్మషమైన బుద్ధితో కొన్ని అంతర్జాలంలోని వెబ్ పత్రికల, బ్లాగుల నిర్వాహకులు నడుం బిగించారు. తర్వాతి తరాల వారికి కల్తీ లేని వారసత్వ సంపదనూ అందుబాటులో ఉంచాలనే



తాపత్రయానికి తోడ్పాటుగా నేడు అంతర్జాలంలో తెలుగు భాషాభిమానులు ఎంతో కృషి చేస్తున్నారు. సాహిత్యంతో సాన్నిహిత్యం కోల్పోతున్న తెలుగు బిడ్డల్ని బాలసాహిత్యానికి చేరువ చేస్తున్న అంతర్జాలంలోని తెలుగు వెలుగులలో బాలల కోసం ప్రసరిస్తున్న కిరణాలను ఒకమారు పరికిద్దాం.

1. ఆన్ లైన్ చందమామ (telugu.Chandamama.com) : ఈ వెబ్‌సైట్‌ని ఇంగ్లీషు హిందీ, కన్నడ, మరాఠీ, సంస్కృతం, తమిళ, తెలుగు లాంటి ప్రాంతీయ భాషల్లో దర్శించవచ్చు. ఈ సైట్‌లోని కథల ఆర్కైవ్‌లు ద్వారా చందమామ పత్రిక గత సంచికలలోని ఇంగ్లీషు, హిందీ, కన్నడ, మరాఠీ, సంస్కృతం, తమిళం, మలయాళం, ఒరియా, బెంగాలీ, గుజరాతీ, అస్సామీ, తెలుగు భాషల్లో మనకు కావలసిన భాషలో, ఫలానా సంవత్సరం, ఫలానా నెల అని వివరాలు అందిస్తే చాలు వెనక్కు వెళ్లి వారి వారి అభిమాన కథలను మళ్లీ చదువుకోవచ్చు.

2. చందమామ చరిత్ర (తెలుగు జాతి సంస్కృతీ వైభవం) - http://blaagu.com/chandamamalu

తెలుగు జాతి సాంస్కృతిక సంపద అయిన చందమామను ఈనాటికీ తమ జ్ఞాపకాల దొంతరలలో పదిలపర్చుకుంటున్న చందమామ అభిమానుల గుండె చప్పుళ్లను ఓ చోట చేర్చి అందరికీ పంచిపెట్టాలనే చిరు కోరికే ఈ బ్లాగ్ రూప కల్పనకు మూలం జీవించడం కోసం ప్రపంచం నలుమూలలకు వలసపోయిన తెలుగు వారు చందమామ పత్రికతో తరతరాల అనుబంధాన్ని నేటికీ ఎలా కాపాడుకుంటూ వస్తున్నారో పరస్పరం చందమామతో తమ జ్ఞాపకాలను ఎలా పంచుకుంటున్నారో తెలిపే అమూల్యమైన వ్యాసాలు, లింకులు, తదితర సమాచారం ఈ బ్లాగులో అందుబాటులో ఉన్నది. చందమామ చరిత్ర చందమామ కథల సమీక్ష పరిచయం, వ్యక్తుల పరామర్శ తదితర చందమామ సంబంధిత సమాచారాన్ని ఈ బ్లాగులో అందరూ చూడవచ్చు.

3. చందమామ కథలు - http://chandamamakathalu.wordpress.com: మీరెంతో ఇష్టపడే చందమామ కథలు మీకోసం ఇక్కడ లభ్యం.

4. కొత్తపల్లి – తెలుగు పిల్లల ఈ –మాసపత్రిక - http://kottapalli.in : ఇది పిల్లల మాస పత్రిక, ఎంతో ఆసక్తికరమైన ప్రయోగం. ఈ పత్రిక పుస్తక రూపంలో కూడా లభ్యమవుతున్నది. పెద్దలూ, పిల్లలూ ఈ పత్రికకి రచనలు పంపవచ్చు. తెలుగు పిల్లలకు సంతోషాన్ని ఇచ్చేందుకు గాను మానవీయ స్పర్శ ఉన్న కథల్ని, ఆట పాటల్ని, విద్యా, విజ్ఞాన వినోదాల్నీ పిల్లల స్వీయ దృక్పథంలో, బేషరతుగా అందించే ఉద్దేశంతో "కొత్తపల్లి" ముందుకు సాగుతున్నది.

5. తెలుగు 4కిడ్స్ - http://telugu4kids.com, http://www.youtube.com/telugu4kids (kids channel in your tube): బాల్యంలో ఆడుతూ పాడుతూ భాష నేర్చుకోవడానికి ఆంగ్లం ఉన్నంత అనువుగా తెలుగులేదని, అలా తెలుగులో పిల్లల కోసం చెయ్యవచ్చు అని, చేసి చూపించాలని, భాష నేర్పించడమొక్కటే కాదు భాషను ఆనందించ గలిగేలా చెయ్యాలని, పిల్లలకు తెలుగు మీద ఆసక్తీ కుతూహలమూ పెంచడానికి ఈ వెబ్ సైట్ రూపొందించబడింది. అక్షరం మీద క్లిక్ చేస్తే పలికే విధానం ఈ సైట్ లో ఉన్నది ఇంకా కొన్ని సరదా మాటల్ని 'తార' అనే పాత్రతో చెప్పించారు.

ఈ వెబ్ సైట్ - http://www.youtube.com/telugu4kids : అనే ఈ లింకు ద్వారా తెలుగు 4 కిడ్స్ అనే యూట్యూబ్ ఛానల్‌ని నడుపుతున్నది. ఈ ఛానల్‌లో మొదటి పాటలు (Rhymes), ఆణిముత్యాలు (Favourites), Indian History, Telugu Links 4 Kids, Mythology and beliefs, Telugu4kids - Taara, Letters and Numbers, మాటలు (vocabulary) పొడుపు కథలు (Riddles), సామెత కథలు (Proverbs), interactive Activities, కథలు (stories), Telugu4Kids Plus (అదనపు ఆకర్షణలు), అభిలాషలు, ఆలోచనలు, పద్యాలు అనే విభాగాలున్నాయి.

5. 1. Telugu Links 4 Kids: ఎందరో ప్రవాసాంధ్రులు ప్రపంచంలోని పలు దేశాలలో ప్రముఖ స్థానాలలో నిలిచి మన పేరు ప్రఖ్యాతులను ఇనుమడింప చేస్తున్నారు తమవైన ప్రత్యేకతలను నిలుపుకుంటూనే తమ చుట్టూ ఉన్న వాతావరణంలో కలిసిపోతూ, తర్వాతి తరాల వారికి కల్తీ లేని వారసత్వ సంపదనూ అందుబాటులో ఉంచాలనే తాపత్రయానికి తోడ్పాటుగా నేడు అంతర్జాలంలో తెలుగు భాషాభిమానులు ఎంతో కృషి చేస్తున్నారు వారి కృషికి ప్రతిరూపాలే ఈ కింది సైట్లు.

5. 1. 1. ఆంధ్రభారతి సైట్ వారి బాలభాష - http://andhrabharati.com లోని "బాల" అనే విభాగమే కాక "శతకములు" అనే విభాగం కూడా ఆసక్తికరం. ఇక్కడ సంగ్రహం చాలా ఎక్కువ. ఇవన్నీ "పిల్లల కోసం" కాకపోయినప్పటికీ ఇన్ని పద్యాలు ఒకచోట లభ్యమైనప్పుడు అందులో పిల్లలకు తగినవి ఎంచుకుని నేర్పడం కొంచెం సులభమవుతుంది. ఇంకొక ఆసక్తికరమైన విషయం ఏంటంటే "దేశి", "కవితలు" విభాగాలలో కూడా వెతుక్కుంటే పిల్లలకు నచ్చేవి, నప్పేవి కనిపిస్తాయి.

5. 1. 2. మాగంటి - http://www.maganti.org: సేకరణలో ప్రముఖ స్థానం వీరిదీ. ఇక్కడ "చిన్నారులు" విభాగంలో ఎన్నో అమూల్యమైన పద్యాలు, పాటలు, కథలు, పొడుపు కథలు, ఇంకా ఎన్నెన్నో పోగు చేసి ఉంచారు. సాహిత్యంగా దొరికేవే కాక తరతరాలుగా పెద్ద వారి నుండి చిన్న వారికి ముఖతా అందిన ఆణిముత్యాల వంటి కథలు, పాటలు మన పిల్లలకు ఉపయోగపడడమే కాక, మనను, ఒక్కసారి మన బాల్యానికి తీసుకు వెళ్ళి జ్ఞాపకాల వీధులలో తిప్పుతాయి

5. 1. 3 స్తోత్రలహరి వారి బాలలహరి - http://www.stotralahari.com/: ఇక్కడ పిల్లల విభాగంలో పెద్దబాల శిక్ష ఉంది. కొన్ని సరళమైన ప్రార్థన పద్యాలు కూడా ఉన్నాయి.

5. 1. 4. బబ్లూ - http://www.babloo.com/: ఇక్కడ అచ్చులతో పదాలు, పళ్ళు, జంతువులు, వాహనాలు వంటి పదజాలం,




వాటితో చిన్న చిన్న వాక్యాలు, కొన్ని కథలు ఉన్నాయి. అన్నిటికీ బొమ్మలు, మాటలు ఉన్నాయి.

5.1.5. తెలుగుదనం -www.telugudanam.co.in: ఎక్కడెక్కడో ఉన్నా తెలుగుపై మక్కువ తీరని తెలుగు బిడ్డల కోసం, తమ పిల్లలకు తెలుగుభాష నేర్పించాలనుకునే తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తూ 'మన సంస్కృతినీ, సంప్రదాయాలను గుర్తుచేసుకుందాం, నలుగురితో పంచుకుందాం', అనుకునే వారి కోసం ఈ "తెలుగుదనం" అనే వెబ్‌సైట్ ఆవిష్కరించబడింది.

ఈ వెబ్‌సైట్ వారు చిన్న పిల్లల కోసం పాటలు, కథలు, పాఠాలు సమీకరిస్తున్నారు. ఇందులో పదజాలం అత్యంత ఉపయోగకరమైన అంశం. "చిన్నపిల్లల కోసం" అనే విభాగంలో నీతి కథలు, పిల్లల ఆటలు, పిల్లల పాటలు, రాష్ట్ర చిహ్నాలు, జాతీయ చిహ్నాలు, తెలుగు తల్లి ముద్దు బిడ్డలు భరతమాత ముద్దు బిడ్డలు మంచి అలవాట్లు అనే విషయాలున్నాయి.

పిల్లలకు నేర్పించవలసినవి అనే విభాగంలో అంకెలు, రంగులు, పక్షులు, కాయగూరలు, పండ్లు, పూలు, కీటకాలు, దిక్కులు, శరీర భాగాలు, ఋతువులు–కాలాలు, తెలుగు సంవత్సరాలు, దేశభక్తి గీతాలు, తరగతిలో, ఇంట్లో వాడుకునే వస్తువులు, జంతువులు, సంఖ్యాపర్వం అనే ఉప భాగాలున్నాయి.

5.1.6. సురస సంగీత నిలయం - http://www.surasa.net/: మా తెలుగు తల్లికి మల్లెపూదండ గురజాడ వారి దేశ భక్తిగీతం, బంగారు పాపాయి బహుమతులు పొందాలి వంటి పాటలు ఇక్కడ వినవచ్చు. ఇవన్నీ తెలుగులో పిల్లలకై ఉద్దేశించినవి కాకున్నా పిల్లలతో పాటు సందర్శించగలిగిన సైట్లు.

5.1.8. జోల పాటలు – "అమ్మ దొంగా, నిన్ను చూడకుంటే నాకు బెంగ" ఈ పాట గుర్తున్న వారు వెంటనే ఈ లంకె వైపు పరిగెత్తండి. ఈ పాట ఇప్పటి వరకూ విని ఉండకపోతే ఇప్పుడైనా తప్పనిసరిగా విని చూడండి.

5.1.9 తెలుగు వికీపీడియా : తెలుగు ప్రముఖుల నుంచి పల్లెటూళ్ల దాకా విశేషాలు, విషయాలూ ఇక్కడ తెలుసు కోవచ్చు.

ఈ విధంగా అనేక మంచి విషయాలతో పొందుపరచబడిన వెబ్‌సైట్ల వివరాలు ఈ సైట్‌లోని Telugu Links 4 Kids అనే విభాగం ద్వారా తెలియజేయబడ్డాయి.

6. For kids - http://forkids.in (Telugu Web Magazine For Children) :

చిన్నారులకు అవసరమైన ప్రతి ఒక్కటీ కూర్చి పెట్టాలనేదే లక్ష్యంగా "ఫర్ కిడ్స్" ఒక్కొక్కటిగా కొత్త హంగులను చేర్చుకుంటూ ముందుకు సాగుతున్నది. ఇక్కడి పిల్లలకి కథలు, కబుర్లు చెప్పడం చిట్టి పొట్టి పాటలు నేర్పడం, ఆటలతో వాళ్ళని ఉత్సాహపర్చడం వంటి వాటి వల్ల పిల్లల్లో మానసిక వికాసనం కలుగుతుంది. వారి ఎదుగుదలలో కథకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. లోకం పోకడలు తెలుస్తాయి ఊహాశక్తి, కల్పనా సామర్థ్యం పెరుగుతుంది. విచక్షణ, వ్యవహార దక్షత అలవర్చుకుంటారు. సాహిత్యంపై మక్కువ పెంచేది కథ. వ్యాక్యనిర్మాణం, పదజాలాభివృద్ధి కూడా మెరుగుపడతాయి. కాబట్టి చిన్నారుల కోసం ఆటపాటల్ని, కథల్నీ పోగేద్దాం... అంటూ ఈ వెబ్ సైట్ నిర్వాహకులు ఉత్సాహాన్ని పంచుతున్నారు.

7. బాలభారతి డాట్ కామ్ -http://balabharathi.com/:

మాతృభాషపై మమకారాన్ని ప్రోది చేసే దిశగా, తెలుగు భాష మీద సరైన అవగాహన లేని, సరిగా మాట్లాడలేని ప్రవాసంలో ఉన్న తెలుగు పిల్లలను ఉద్దేశించి రూపొందించబడి విదేశాలలో ఉన్న తెలుగు పిల్లలు చక్కగా తెలుగు నేర్చుకొని, మంచి సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన వాతావరణంలో పెరగాలనే లక్ష్యంతో కొనసాగుతూ, అక్షరచిత్రాలు, వీక్షకుల్ని ఆకట్టుకొనే వీనుల విందైన తెలుగు పలుకులు, అద్భుతాన్ని కల్గించే భాషా క్రీడలు, భాషపై అనురక్తిని పెంచే అనేక విన్యాసాలు ఇలా వినూత్న శైలితో, ఆసక్తికరమైన విశేషాలతో గుండె గుండెనా తెలుగు ముద్రను వేస్తున్న ఈ వెబ్‌సైట్‌కి నేడెంతో ఆదరణ ఉన్నది బాలల ప్రపంచంలో అయితే ఎప్పటికప్పుడు ఆదరణ పెరుగుతూనే ఉంది. ఈ వెబ్‌సైట్ ద్వారానే ప్రవాసాంధ్ర చిన్నారులకు తెలుగులో అభినివేశం కూడా కలుగుతున్నది.

దృశ్య శ్రవణ పద్ధతిలో వినూత్న భాషాక్రీడలతో తీర్చిదిద్దిన ఈ బాల భారతి డాట్.కామ్ నేడు తెలుగు భాషా బోధనకి చక్కని సోపానంగా మారిపోయింది. ఈ వెబ్‌సైట్ ద్వారా అక్షరాలు దిద్దడం, చిన్న చిన్న తెలుగు పదాలు నేర్చుకోవడం, చిన్ని చిన్న వాక్యాలు రాయడం, వ్యాకరణ సంబంధిత విషయాలు ఇలా అన్నీ రకాల విభిన్నమైన విషయాలను ప్రత్యేకంగా టీచర్స్ వచ్చి చెప్పాల్సిన అవసరం లేకుండా ఎవరికి వారే ఒక స్థాయి నుంచి వేరొక స్థాయికి వెళ్తూ చక్కగా తెలుగులో మాట్లాడటం అలవాటు చేసుకోవడం వీలవుతుంది.

ఈ వెబ్‌సైట్‌లో చదువు, కథలు, ఆటలు, చేసి చూద్దాం పండుగలు, పాటలు అనే 6 విభాగాలున్నాయి. తెలుగు నేర్చుకుందాం పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలో అక్షరాలు దిద్దడాన్ని ఉచ్చారణతో సహా వివరిస్తారు గుణింతాలలో ఏ అక్షరాన్ని తాకినా స్వరబద్ధంగా వెలిగేలా తీర్చిదిద్దారు నామవాచకం, సర్వనామం, క్రియ వంటి వ్యాకరణాంశాల్ని పరిచయం చేసే బోధనాపద్ధతులు, తెలుగు వాక్య నిర్మాణంపై అవగాహన కల్పించే పద విన్యాసం వంటి భాషా క్రీడలు, వినోదాలు బాలభారతి.డాట్.కామ్‌లో ప్రధాన ఆకర్షణలుగా నిలిచి చిన్నారుల బుద్ధి వికాసానికి తోడ్పడుతున్నాయి.

భక్తి తత్వానికి పెద్దపీట వేసే అనేక శ్లోకాలు రంగు రంగుల బొమ్మలతో తెరపై కన్పించే పంచతంత్రం కథలు ఇలా ఎన్నో ఆసక్తి కరమైన విషయాలతో ప్రోది చేయబడిన భాషా ప్రపంచంలో రోజు విహరించాలంటే స్వల్పరుసుం చెల్లించక తప్పదు. విదేశాల్లో ఉన్న తెలుగు పిల్లలకి మాత్రమే కాకుండా భారతదేశంలోని ఇక్కడ అక్కడ



అని లేకుండా తెలుగు వారెక్కడున్నా వారందరికి ముఖ్యంగా చిన్నారులకు బాగా ఉపయోగపడుతున్నది. ఇంటర్నెట్లో గేమ్స్ ఎలా ఆడుకుంటున్నారో ఈ వెబ్‌సైట్‌లో తెలుగు భాషను క్రీడాపద్ధతిలో ఆడుతూ నేర్చుకుంటూ ఆనందాన్ని, అవకాశాన్ని చేజిక్కించుకొంటున్నారు. భాషను మర్చిపోతున్న నేటి తరాన్ని భాష వైపు నడిపించడానికి ఈ వెబ్‌సైట్ చేస్తున్న సేవ ఎంతో గొప్పది

8. బాల కథా మాలిక -http://audisesháreddy.blogspot.in

కథలూ, కవితలూ ఓ వందకు పైగా రాసిన అనుభవం, టీచర్‌గా పాతికేళ్ళ అనుభవం గలిగిన ఈ బ్లాగు నిర్వాహకుడు తన బ్లాగు ద్వారా పిల్లల్ని ఎంతగానో అలరించే కథలను అందిస్తున్నారు.

9. బాల కళ – -http://baalakala.blogspot.in: నేటి బాలల సృజనే–రేపటి దేశపు రూపం

ఈ 'బాల కళ' బాల బాలికలలో నిబిడీకృతమైన సృజన శక్తిని వెలికి తీయడం కోసం ఏర్పాటు చేశారు మీ పిల్లలు ప్రదర్శించే కళలకు సంబంధించిన ఫోటోలు కానీ వీడియోలు కానీ ఈ బ్లాగు నిర్వాహకునికి మెయిల్ చేస్తే, ఈ బ్లాగులో పెట్టే అవకాశం కూడా వుంది ఇది పిల్లల బ్లాగు.

10. సంపుటి.కామ్– -http://samputi.com: సంపుటి ఒక స్వచ్ఛంద ప్రయత్నం. మనల్ని పెంచిన పద్ధతులను సంప్రదాయాలకి, సాహిత్యానికి ఒక గొడుగు పట్టాలనే చిన్న ప్రయత్నం.

11. కంఠస్థ భారతి

-http://kamthasthabharathi.wordpress.com (బాల బాలికల కంఠస్థయోగ్య పద్యసూక్తి రత్న మాలిక)

వేలాది సంవత్సరాలుగా జీవనదిలా ప్రవహిస్తూ వస్తూన్న మన భారతీయ సంస్కృతి మూలాలు సంస్కృతభాషలోనే వున్నాయి. అందుకనే సంస్కృత శ్లోకాలు సూక్తులు కూడ పిల్లలకు నేర్పించటం వారి మానసిక పరిణతికి అత్యవసరం. కంఠస్థం చేసే శక్తి. సమయం పరిమితం కనుక ప్రామాణిక గ్రంథాల నుంచి పిల్లలకు అవసరమైన అంశాలు మాత్రం సేకరించి అందించాలి. ఈ దిశగా పద్య గద్య రత్నములను సేకరించి, కూర్చి ఈ సైట్ ద్వారా "కంఠస్థ రత్న మాలిక"గా అందిస్తున్నారు.

12. జాబిల్లి బాలల డిజిటల్ పత్రిక -http://jabilli.in/: ఈ సైట్‌లో కథలు (అవ్వ చెప్పిన కథలు, బాలలు రాసిన కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, పంచతంత్రం, నసీరుద్దీన్ కథలు, విక్రమార్క కథలు) వ్యాసాలు (వివిధ, మీకు తెలుసా, నవ్వుల పువ్వులు, ఒక మంచి మాట) బాలశిక్ష, పాటలు, ఆటలు అనే విభాగాలున్నాయి.

1.3 edewcate (LEARN IT RIGHT HERE) http://www.edewcate.com : Edewcat Kids (Edewcate Telugu Nursery Rhymes)

1.3.1 Telugu Nursery Rhymes for kids : బుర్రు పిట్ట బుర్రు పిట్ట తుర్రుమన్నది, చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా, బావా బావా పన్నీరు, గుమ్మడి అమ్మా గుమ్మడి, చెట్టు మీద కాకి కావ్ చెల్ చెల్ గుర్రం, ఏనుగమ్మ ఏనుగు ఆ ఆ లు దిద్దుదాం చిట్టి చిట్టి మిరియాలు, తారంగం తారంగం, కాకి ఒకటి నీళ్ళకై, చీమ–పావురం

(kids Story) పొడుపు కథలు (Cartoon Riddles) వంటి విషయాలున్నాయి.

14. Prabhava ప్రభవ A different book store ! A book store with a difference !

"ఈనాటి పిల్లల అవసరాలకు అనుగుణమైన సాహిత్యాన్ని వారే సృజియించుకోగలిగితే...?" అన్న చిన్న ఆలోచన గట్టి నమ్మకమై పిల్లల కలాలకు ఒక చిరునామా కావాలనే భావనతో ఈ http://chandralata.blogspot.com/ అనే బ్లాగుని ప్రభవ చంద్రలత అనే వారు రూపొందించారు.

15. poornakumbham Telugu Rhymes in your Tube : యు ట్యూబ్ లో తెలుగు బాలశిక్ష, తెలుగు పద్యాలు అనే రెండు విభాగాలుగా మొత్తం 33 వీడియోలున్నాయి.

16. కథాసుధ (http://kadhasudha.blogspot.in) ఈ బ్లాగు నిర్వాహకురాలైన లక్ష్మీ శిరీష యూ ట్యూబులో http://www.youtube.com/shsireesha అనే అడ్రస్‌తో ఒక ఛానల్‌ని కూడా నడుపుతున్నారు.

ఈ ఛానల్‌లో పిల్లలకు బాల్యావస్థలో అందులో ముఖ్యంగా ప్రాథమిక విద్యాస్థాయి తెలుగు బోధనకు ఉపకరించే విధమైన చిట్టి చీమ పిసినారి సుల్తాన్ తెలివైన కోడిపుంజు, ఒక ద్వీపం–నలుగురు స్నేహితులు, సింహం–చిట్టెలుక అమ్మమ్మ – పట్టె మంచం కథ, బ్రాహ్మణుడు– ముంగిస, ఆవు–పులి, ఏనుగు – దర్జీ వాడు, నాన్న – పులి, స్నేహితులు – ఎంపిక, మంచమ్మ–చెడ్డమ్మ, దుప్పి–కొమ్ములు–కాళ్ళు, మంచి బామ్మ–చెడ్డ బామ్మ, అమ్మమ్మ–చిట్టి ఎలుక సూర్య దేవుడు–వాయుదేవుడు, నక్క–పిల్లి, గొప్పలు–తిప్పలు, తెలివైన బామ్మ–వింతైన డప్పు, కాకి–పాము ఇలా నీతిని బోధించే 1–7 అందమైన కథలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయి.

పిన్నలు, పెద్దలు చిన్న చిన్న మాటలతో కూడిన తియ్యని పాటలు, కథలతో నవనవలలాడే బాల సాహిత్యాన్ని తెలుగు భాషనీ నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో, మాతృభాషలో మాట్లాడేటమే మహాపరాధంగా భావించే తల్లిదండ్రులు, బడి యాజమాన్యాలున్న నేటి సమాజంలో బాలలను సాహిత్యం వైపు తిప్పాలి. బాల సాహిత్యం వల్ల పిల్లలకు పఠానా సక్తి, లోకజ్ఞానం కలుగుతుందని పెద్దలు గుర్తించి ఆయా విషయాల పట్ల వాళ్లకి ఆసక్తిని కలుగజేయాలి. వారిలో తత్సంబంధమైన ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించాలి. ఇలాంటి పరిస్థితుల్లో అంపశయ్య మీద ఉన్న బాలసాహిత్యాన్ని రక్షించే దిశగా ఎలాంటి లాభాపేక్ష లేని నిష్కల్మషమైన బుద్ధితో కొన్ని వెబ్ పత్రికల బ్లాగుల నిర్వాహకులు ఈ విధంగా నడుం బిగించడం ఎంతో ఆనందదాయకం.

## కవిత

# అగ్ని పర్వతాలు

ఝాన్సీ కె.వి. కుమారి
9010823014

నడిచే అగ్ని పర్వతాల్ని
నువ్వెప్పుడైనా చూశావా?
మరిగే లావా
సిరల్లోనూ, ధమనుల్లోనూ
పొగలు కక్కుతూ
ప్రవహిస్తుంటే
గుండె శిఖరాల్లో బంధించేసి
ఏమీ ఎరగనట్టు
హరితవర్ణ పత్రాలను ధరించి
రుధిర కాంతుల
సింధూర పుష్పాలతో
కళకళలాడే పూదోటలా
విరబూసి
విరులనవ్వుల్ని ప్రసరిస్తూ
... నడిచే అగ్ని పర్వతాల్ని
నువ్వెప్పుడైనా... చూశావా?
శీతల ఛాయలో పెరిగే మొక్కల్లాగే



కనిపిస్తాయ్
అలంకరణకు బోన్సాయిల్లా...
నిశీధిలో వెలిగే
నెలవంకలాగే దర్శనమిస్తాయ్
చిరునవ్వులు అతికించుకుని...
అవేమిటో వాటి పేరేమిటో
తెలుసా...?

కరిగిపోతూ
వెలుగులను పంచే
కదిలే గుండెల్లో నుండి
పరమార్థగానాన్ని పలికించే
ఒర్థి వెదురు పుల్లలు!

సూర్యుణ్ణి మెడలో
వేళ్ళాడేసుకుని
నిశిరాత్రిని గర్భాన ధరించి
మౌనంగా సాగిపోయే
మట్టిపరిమళాలను
పారిజాతాలని భ్రమించబోకు
అవి... నడిచే అగ్నిపర్వతాలే...
ఏ క్షణాన్నైనా బ్రద్ధలవొచ్చు
మరిగే లావా
నిన్ను దహించేయొచ్చు...

# కవిత్వమంటే.........

పొత్తూరి సుబ్బారావు
9490751681

కవిత్వమంటే
కళ్ళకు కనబడకున్నా
ఊహల్లో ఊసులాడే
ప్రకృతి అందచందాలను
అభివర్ణించటం కాదు
ఆ ప్రకృతిలో
కనుమరుగైపోతున్న
అన్యజీవుల అవసరాల్ని
అందరి ముందుంచాలి
కవిత్వమంటే
జలపాతాలు సృష్టించే
వన్నెచిన్నెలకు తబ్బిబ్బయి
అక్కడ జాలువారిన నీటితో
తన కవితాదాహాన్ని తీర్చుకోవటం కాదు
నీరు కరువై దప్పికతీరని
జనవాళి వ్యథలను చిత్రిస్తూ
బాటిల్స్‌లో నీరు నింపి అమ్ముకునే
బడాబాబుల దాష్టీకంపై
నిప్పులు చెరగాలి
కవిత్వమంటే
విరబూసిన పుష్పాల సౌరభాల్ని
వెదజల్లటం కాదు
ఆయా రుతువులందు
అలుపెరగక శ్రమించే రైతుకు
పంట అమ్ముకునే సమయానికి
ధరపలకక వాడిన పూలల్లే అగుపించే
వాళ్ళ ముఖారవిందాలతో
ముచ్చటించాలి
కవిత్వమంటే
అంగనల అందాలు వర్ణించటం కాదు
అగ్రరాజ్యపు ఒత్తిళ్ళతో
చిరు అంగళ్ళనగుపించకుండా చేసే
దుష్ట సంకల్పాన్ని
కలాలతో ఖండించాలి
కవిత్వమంటే
గతకాలపు చరిత్రతో మురిసిపోవటం
కాదు



వర్తమానంలో ఏర్పడ్డ దుస్థితికి
సతమతమయ్యే సమకాలీన సమాజానికి
నిరంతరం వెన్నుదన్నై వుండాలి.

కథ

# అమ్మా! నన్నూ ప్రేమించవూ !




ఎస్. జగదీశ్వరి

9490949523


**అది ఓ పెద్ద స్కూలు ఆవరణం. ఆ ఆవరణం అంతా చిన్న చిన్న మొక్కలతో, పద్ధతి ప్రకారం పెంచిన లాన్‌తో, అక్కడక్కడ నీడ నిచ్చే పెద్ద పెద్ద చెట్లతో ఎటు చూసినా పచ్చదనంతో ఆహ్లాదంగా ఉంది. ఓ వైపు చిన్న ప్లేగ్రౌండ్ అందులో అరుగులు, ఊయలలు, జారుడుబండ మొదలైనవి పిల్లలు ఆడుకొనేందుకు ఉన్నాయి. మరోవైపు ఇంక కొంచెం సేపటిలో అక్కడ మీటింగు ప్రారంభం కానుంది అన్నదానికి నిదర్శనంగా అక్కడ ఒక చిన్న టేబుల్, దాని వెనుక రెండు కుర్చీలు వేసి ఉన్నాయి. ముందు ఎర్రటి తివాచీ పరిచి ఉంది. పైన ఎండ తగులకుండా తెల్లటి షామియానా వేసి ఉంది. పచ్చదనం, ఎర్రదనం, తెల్లదనం కలబోసి నిండుదనంగా ఉంది అక్కడ వాతావరణం. అక్కడ తివాచీ మీద ఎందరో మాతృమూర్తులుకూర్చుని ఉన్నారు, వారి ఒడిలో పిల్లలు కూర్చుని ఉన్నారు. "ప్రతిచోటా తానే ఉండలేని దేముడు తనకు మారుగా తల్లిని సృష్టించాడు," అన్నదానికి నిదర్శనంగా ఉన్నారు అక్కడ ఉన్న మాతృమూర్తులు. క్రింద కూర్చొని కాగితాన్ని ముక్కలు ముక్కలు గా చేస్తున్న తన బిడ్డకు మళ్ళీ మళ్ళీ కాగితాన్ని అందిస్తున్న ఓ తల్లి,**

మెడ నిలపలేక ఒకవైపుకు వంచేస్తున్న తనబిడ్డకు తన హృదయాన్నే ఆసరాగా నిల్పిన ఓ తల్లి,

చొంగ కారుస్తున్న తన బిడ్డ నోటిని, తన చీర కొంగునేకర్చీఫ్‌గా మార్చుకొని తుడుస్తున్న ఓ మాతృమూర్తి,

పెద్ద-పెద్దగా అరస్తూ, కాళ్ళు చేతులు కొట్టుకుంటున్న తన బిడ్డ నోటికి ఇష్టంగా చాక్లేట్లు అందిస్తున్న ఓ తల్లి,

కర్ణుడికి కవచకుండలాలు ఉన్నట్లుగా తన బిడ్డ రెండు చెవులకు రెండు మిషన్లు ఉంటే, వాడు వాటిని విసుగ్గా తీసి విసిరికొడుతుంటే మళ్ళీ మళ్ళీ వాడి చెవిలో పెడుతున్న సహనశీలి ఇంకో తల్లి,

చూడడానికి ఎంతో బొద్దుగా-ముద్దుగా ఉన్నప్పటికి ఇహలోక స్పృహలేనట్లు ఎటో చూస్తున్న బిడ్డను జాగ్రత్తగా పట్టుకొని ఒడిలో కూర్చోపెట్టుకున్నది ఓ తల్లి.

క్షణం ఓ దగ్గర నిలవక అటు-ఇటు పరుగెడుతున్న బిడ్డ వెనుక వయస్సును మరిచి పరిగెడుతున్నది ఓ తల్లి,

ఇంత అందాలొలికే బిడ్డకు ఇంత లోపమా! అన్నట్లు, వినికిడిశక్తి పూర్తిగా లేని కేవలం సైగలతోనే జీవించ వలసిన తన కన్నబిడ్డ దుస్థితికి కుంగిపోతూ, బాధను బయటకు కనపడనీయకుండా నవ్వుతున్న ఓ మాతృమూర్తి. ఇలా ఎందరో మాతృమూర్తులు అక్కడ కూర్చుని ఉన్నారు.

అష్టలక్ష్ములంతా ఓ చోట చేరి భగవంతుడు సృష్టించిన ఈ చిన్నారులను తమ కరుణ, ప్రేమ వాత్సల్యాలతో సేదతీరుస్తున్నట్లుగా ఉంది అక్కడి వాతావరణం.

అప్పుడే, అక్కడికి స్కూల్ కరస్పాండెంట్ సుశీల గారితో పాటు సన్నగా నాజుగ్గా, అప్పుడే తోట నుండి కోసుకు వచ్చిన గులాబీలా ఉన్న ఓ అమ్మాయి కూడా వచ్చింది. నా ఆహ్వానాన్ని మన్నించి, ఇక్కడికి విచ్చేసిన మాతృమూర్తులందరికి వందనాలు, చిన్నారులందరికి ఆశీర్వాదాలు, అంటూ సుశీలా మేడం మీటింగు ప్రారంభించారు. ఈ అమ్మాయి పేరు రాధ. ఈమె ఈ రోజు నుండి ఈ స్కూలుకి ప్రిన్సిపాల్. నేను ఏ ఆశయంతో ఈ 'సేవ' స్కూలుని స్థాపించానో మీ అందరికి తెలుసు. నా ఆశయాన్ని నిలబెట్టి ఈ స్కూల్‌ని ముందుకు తీసుకువెళుతుందన్న నమ్మకంతోనే రాధ గారిని మన స్కూలుకి ప్రిన్సిపాల్‌గా నియమించాను. ఎం.ఎస్.సీ (స్పీచ్ థెరపీ) చదివి, హైదరాబాదులో ఇంతకంటే మంచి చోట పనిచేసే అవకాశం వచ్చినా వదులుకొని మన స్కూల్‌లో పనిచేయడానికి సహృదయంతో వచ్చింది అంటూ రాధని అక్కడున్న వారందరికి పరిచయం చేసింది. క్రొత్తగా వచ్చిన వారిని, ఇలా మీటింగు పెట్టి స్కూల్లో పనిచేస్తున్న 10 మంది టీచర్లకు, 8 మంది ఆయాలకు, 150 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పరిచయం చేయడం "సేవ" స్కూలు ఆనవాయితీ.



ప్రస్తుతం విద్యార్థులంతా ఇంజనీరింగ్ వైపు పరుగులు పెడుతుంటే నీవు ఈ కోర్స్ ఎందుకు చేశావో వీరందరికి వివరిస్తావా! అని సుశీలా మేడం రాధని అడిగింది.

అందరికి నమస్కారం. నేను ఈ ప్రశ్నకు సమాధానంగా నా జీవితంలో జరిగిన సంఘటనలను కొన్ని మీ ముందు ఉంచుతాను మీరంతా ఓపిగ్గా వింటానంటే అని రాధ తన ఉపన్యాసాన్ని ప్రారంభించింది. 'వింటాం' అంటూ తమ అంగీకారాన్ని కరతాళధ్వనుల ద్వారా తెలియచేశారు వారంతా.


నాకు 5 సంవత్సరాల వయస్సు. ఉన్నప్పుడు తమ్ముడు పుట్టాడు. బంగారు బొమ్మలా, దొండపండులా ఉన్నవాడ్ని చూస్తే నాకు చాలా ఆనందం వేసింది. ఆడుకోవడానికి తోడు దొరికాడని గంతులువేశాను. అప్పుడే ఇంట్లో అందరూ నాకు పెద్దరికాన్ని ఆపాదించారు. నువ్వు అక్కవి వాడ్ని బాగా చూసుకోవాలి అని చెప్పడం ప్రారంభించారు. కాని రెండు సంవత్సరాలు వచ్చినా వాడు అందరిలా నడవలేదు, ఎదగలేదు. ఎక్కువ అల్లరి చేసేవాడు. కోపంగా చేతిలోని వస్తువులన్ని విసిరి వేస్తూ గలాభా చేసేవాడు.

ఆరోజు ఆదివారం. ఉదయాన్నే వరండాలో కూర్చుని, ఎక్కాలు నేర్పిస్తూ నాకు జడ వేస్తుంది అమ్మ. ప్రక్కనే బొమ్మలతో ఆడుకుంటున్నాడు 'రాజ', అమ్మకి ఇష్టమైన పేరు రాజశేఖర్:. ఆ పేరే తమ్ముడికి పెట్టుకుంది. అప్పుడే నాన్న కూరలు తేవడానికి స్కూటర్‌పై మార్కెట్‌కి వెళుతున్నారు. అది గమనించిన రాజ నాన్న వెనుక పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. అది నాన్న గమనించలేదు. రాజ మాత్రం అలాగే రోడ్డు మీదకు పరిగెత్తుకుంటూ వెళుతున్నాడు. వెనుక నుండి మేమంతా ఎంత అరుస్తున్నా వినిపించుకోలేదు. వెనుక నుండి వస్తున్న లారీ హారను కూడా వాడు పట్టించుకోలేదు. అప్పుడే ఎదురుగా వస్తున్న అమ్మమ్మ వాడ్ని గట్టిగా పట్టుకుంది. అప్పుడు ఇంట్లో అందరికి వాడిపై అనుమానం వచ్చింది. వెంటనే ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి పరుగు పరుగు వెళ్ళారు. ఆయన వెంటనే ఇ.ఎన్.టికి రిఫర్ చేశారు. 'మీ రాజాకి పూర్తిగా రెండు చెవులు వినపడవు. కాబట్టి రెండు సంవత్సరములైనా మాటలు రాలేదు," అని ఇ.ఎన్.టి డాక్టర్ చెప్పిన మాటలు అందరి గుండెల్లో తూటాల్లా పేలాయి. ఇలా ఎందుకు వచ్చిందో కారణం మాత్రం చెప్పలేము. మీ ఇంట్లో ఎవరికి లేదన్నారు, మేనరికం కాదన్నారు, పుట్టగానే ఏడ్చాడా? జ్వరం ఏదైనా వచ్చిందా? మందులు ఏమైనా రియాక్షన్ ఇచ్చాయా? అని రకరకాల ప్రశ్నలను డాక్టర్ అడిగారు. వాటికన్నింటికి సమాధానంగా అమ్మ ఏడ్వడం ప్రారంభించింది. ఈ జన్మకు వీడితో అమ్మ అని పిలిపించుకోగలనా! అని ఏడ్వడం ప్రారంభించింది. ఓ వటవృక్షంలా నిలచి నాన్న అందరికి ధైర్యం చెప్పడం ప్రారంభించారు. దుఃఖపడటానికి ఆయనకు సమయమే లేదు. అందర్ని ఓదార్చడంతోనే సమయం సరిపోయింది. అప్పటిదాక ఆనందంగా ఉన్న మా ఇల్లు దుఃఖసాగరమైంది. తన దుఃఖాన్ని బయటకు రానీయకుండా, ధైర్యంగా కనపడడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్న అమ్మని చూసి నాన్న తల్లడిల్లిపోయారు. మేనరికం వద్దని, అందరిని ఎదిరించి, అమ్మని వివాహం చేసుకున్నాడు నాన్న. ఆయనకు నేనిచ్చే బహుమానం ఇదా! అని అమ్మ బాధపడడం నాకింకా గుర్తుంది.

అప్పటి నుండి ఇంట్లో వాతావరణమే మారిపోయింది. ఎలా వీడికి మాటలు రప్పించాలి. ఎలా వీడికి వినిపించాలి? అందరి మదిలో ఇదే ప్రశ్న. 15 సంవత్సరాల క్రితం నిపుణులైన డాక్టర్ల కొరత. స్పీచ్ థెరపీ ఇచ్చేవారు లేరు. అందరు సిటీ లోనే ఉండేవారు తమ్ముడ్ని చెన్నై, హైదరాబాదు, బెంగుళూరు అన్నీ ఊర్లు తిప్పారు. ఓ చిన్న కంపెనీలో పనిచేస్తున్న అమ్మనాన్నల సంపాదన అంతంత మాత్రమే, డబ్బులు మాత్రం చాల ఖర్చుపెట్టారు. ఎన్ని సమస్యలు ఎదురైనా వాళ్ళు పట్టువదలని విక్రమార్కుల్లా తమ పోరాటాన్ని ఆపలేదు.

డాక్టర్ సలహాప్రకారం రాజకు రెండు చెవులకు మిషన్లు పెట్టారు. మిషన్స్ పెట్టుకోవాలంటే వాడికి చాలా చాల విసుగు, చిరాకు, విసిరి కొట్టేవాడు. మిషన్లు అలవాటు చేయడమే ఓ పెద్ద యజ్ఞం. నా చెవిలో కూడా ఒక మిషను పెడితే కాని, వాడు పెట్టుకొనేవాడు కాదు. స్పీచ్ థెరపీ చెప్పేవారి కోసం చాలామందిని ఎంక్వయిరీ చేశారు. దగ్గరలో ఉన్న ఓ పల్లెలో గవర్నమెంట్ స్కూల్‌లో ఒక టీచర్‌కి తెరపీ ఎలా ఇవ్వాలో తెలుసు, అని తెలుసుకున్నారు. ఆయన దగ్గరకు వారానికి 4 రోజులు వాడిని తీసుకొని వెళ్ళేవారు. ఇంటినిండా శబ్దాలు చేసే రకరకాల బొమ్మలు ఇంట్లో పెద్ద అద్దం. దాని ముందు కూర్చోపెట్టి అక్షరాలు పలికించేవారు. మనం చాలా అవలీలగా, లెక్కలేకుండా ఏవేవో మాట్లాడేస్తాము. కాని "ఆమాటలు" రాకపోతే, వాటికోసం జీవితాన్ని ధారబోసి ప్రయత్నం చేయాలి అనేది అక్షర సత్యం.

అమ్మలోకమే మారిపోయింది. ఎంతసేపు తమ్ముడి గోలే. అప్పటి వరకు నన్ను వదలని అమ్మ నా గురించి పట్టించుకోవడం మానేసింది. నాకు అమ్మంటే ఎంతో ఇష్టం అమ్మ అన్నం పెడితేనే తినేదాన్ని, కథ చెపితే కాని నిద్రపోయేదాన్ని కాదు. కాని ఇప్పుడు నేనే తినాలి. కథలు కాదు కదా కనీసం కబుర్లుకూడా చెప్పడం లేదు. అప్పుడు అనిపించేది నాకు కూడా ఏదైనా లోపం ఉంటే ఎంత బాగుండేది. ఎంతసేపు అమ్మ ఒడిలోనే ఉండవచ్చుఅని.



అమ్మ ! ఈ లెక్క అర్థం కాలేదు చెప్పవా ! అంటే నాన్నని అడుగు అనేది. అమ్మ! జడవేయవా? అంటే పిన్నిని అడుగు అనేది. ఇలా ఎప్పుడూ అన్నింటికి నన్నే అడ్జస్ట్ అవమనేది. అప్పుడు మొదటిసారిగా నా కనుల నుండి కన్నీటి చుక్కలు రాలాయి. "అమ్మా ! నన్నూ ప్రేమించవూ! అని ఏడ్చేదాన్ని.

అలాగని అమ్మకు నేనంటే ప్రేమ లేదని కాదు. నేనంటే అమితమైన ఇష్టం, ప్రేమ. రోజూ రాత్రి పడుకొనే ముందు అమ్మ నాకు దుప్పటి కప్పి నా నుదిటి మీద ముద్దు పెట్టి కన్నీళ్ళతో నిండిన కళ్ళను తుడుచుకోవడం, నేను రోజూ చూసే అపురూప దృశ్యం. కళ్ళు తెరిస్తే ఎక్కడ అమ్మ కనుక్కుంటుందో అని కళ్ళు మూసుకొనే ఆ ఆనందాన్ని అనుభవించేదాన్ని. కాని మనసులో ఏదో తెలియని అవ్యక్తమైన బాధ. కాని మా అమ్మని మాత్రం నిరంతరం వదలకుండా ఉండేదాన్ని.

రాజాకి 4సం॥ల వయస్సులో మామూలు స్కూల్‌లో ఎల్‌కెజిలో చేర్పించారు. మొదట వాడి సమస్య విని వారు స్కూల్లో చేర్చుకోవడానికి ఒప్పుకోలేదు. కాని అమ్మవారిని ఒప్పించింది. కాని అక్కడ మరో సమస్య ఎదురైంది. మీ అబ్బాయి వల్ల పిల్లలందరు ఇంట్లో వింత వింతగా అరుస్తున్నారని పేరెంట్స్ అంతా కంప్లెయింట్ చేస్తున్నారు. అందుకని వాడిని స్కూల్‌కి పంపవద్దు అని హెచ్.ఎం చెపితే అమ్మ తల్లడిల్లిపోయింది. మాటలు రాని కారణంగా వాడు ఒక్కోసారి పెద్ద పెద్దగా అరిచేవాడు. అమ్మ ఒకరోజు స్కూల్‌ల్లో ఉండి, పిల్లలందరికి చాక్లేట్లు కొనిచ్చి రాజ మీ లాగ మాట్లాడాలంటే మీరందరు వాడితో మాట్లాడాలి, అంతేకాని మీరంతా ఇంటికి వెళ్ళి వాడిలా అరవకూడదు. అలా చేస్తే మీ మేడమ్ వాడ్ని స్కూల్‌కి రానివ్వదు కదా! అని వారిని బుజ్జగించింది. మీరందరు వాడి చెవిమిషను లాగకూడదు. వాడికి నొప్పి కదా అది లేకపోతే వాడికి వినపడదు కదా అని వారికి అర్థమయ్యేరీతిలో చెప్పింది. పేరెంట్స్ అందరిని అర్థించి, ఒప్పించింది. ప్రతిది పోరాటమే అలుపెరగని పోరాటం చేసింది అమ్మ వాడితో.

'అ' అన్న శబ్దం రావాలంటే 100 సార్లు పలికించాలి. మిషన్ పెట్టుకుంటే తొందరగా వస్తాయి. కొంతకాలానికి అమ్మ శ్రమ ఫలించింది. వాడు 'అమ్మ' అని మొదటిసారి పిలిచినప్పుడు మా ఇంట్లో దీపావళి పండుగ.

ఒకరోజు అమ్మకు జ్వరం వచ్చింది. లంచ్‌టైంకి స్కూల్‌కి వెళ్ళలేకపోయింది. అప్పుడు వాడి లంచ్ బాక్స్‌లోని అన్నం కుక్క తినేసింది. అది కూడా చెప్పలేని స్థితిలో వాడు సాయంత్రం వరకు ఉన్నాడు. వాడి నిస్సహాయత నన్ను కదిల్చివేసింది.

రాజ టివి బాగా చూస్తాడు. క్రికెట్ అంటే చాలా పిచ్చి. ఓసారి 7వ తరగతి పరీక్షలు అప్పుడు క్రికెట్ ఆడితేనే చదువుతాను అని మొండికి వేస్తే రాత్రి 10 గంటలకు అమ్మ వాడితో క్రికెట్ ఆడింది.

అప్పుడు నాకు 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. అదే సమయంలో చెన్నై నుండి ఒక డాక్టర్ వచ్చారు. 10 రోజుల్లో ఆయన దగ్గరికి రాజని థెరపికి తీసుకొని వెళ్ళాలి. ప్రక్క ఇంటి ఆంటీ వద్ద జడ వేయించుకొని ఎగ్జామ్స్‌కి వెళ్ళేదాన్ని. ఇలా చెప్పుకుంటూ పోతే హృదయాన్ని కదలించే, కరిగించే సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో అవన్నీ మీరు ప్రస్తుతం అనుభవిస్తున్నవే.


నాది ఇంటర్ పూర్తి అయి బి.టెక్‌లో చేరే సమయం ఆసన్నమయింది. అప్పుడు నేను ఇంజనీరింగు చదవనని మొండికి వేసి బిఎస్‌సి (ఐడియాలజీ & స్పీచ్‌థెరపీ) చేశాను. ఇంట్లో ఎవరూ నా నిర్ణయాన్ని హర్షించలేదు. ఇటువంటి పిల్లలమధ్య నీవు వద్దు, ఇంట్లో పడే బాధలు చాలు, అని అమ్మమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది.

కాని నిర్ణయాన్ని హర్షించిన ఒకే ఒక వ్యక్తి మా అమ్మ. నిపుణులైన థెరపిస్టులు లేక ఎంతో అవస్థపడింది. అమ్మ నాకు

## కవిత

# దోచుకుందాంరా !

**కొలనుపాక మురళీధరరావు**
**9247159203**



**ఏం** ఆశ్చర్యంగా ఉందా!
కంగారు గాబరాగా ఉందా!
స్వేఛ్ఛా భారతం
విచ్చలవిడితన పెత్తనం
ఏదో ఒక విధంగ ఎదగాలంటే
వీధి దాదాగిరి నుండి
గద్దె నెక్కెవరకు చేయాలి
ఏ రంగమైతేనేం?
వీరంగం ఆడటంలో నైపుణ్యం చూపాలి-
ఏదో ఒక ఝుండా
ఏజెండా ఏదైతేనేం ?
సిద్ధాంతాలు ఎవరిక్కావాలి
రాద్ధాంతాలు చేయవా మేలు
అందుకే 'జై' కొంత సడలింపులు
కొడుకైనా అల్లుడైనా
పుడమినేలే నేత అయితేచాలు
అంగబలం అర్ధబలం
మందబలం మందు బలం
ఉంటే కొండంత ఉత్సాహం
మాటజారినా పరవాలేదు
కోటలో పాగావేయి
దేశమంటే మట్టికాదని తెలుసు
దేశమంటే ఓట్లు, కాసులని మరి తెలుసు
పదండి ముందుకు పదండి
తోసుకుంటూ తొక్కుకుంటూ
పక్క వాడు ఏడిస్తే ఏడవనీ
ఎదుటివాడు చస్తే చావనీ
అవకాశం కోసం ఎదురు చూడక
అందినకాడికి దోచుకోవడం
అంటూ నేటి మేటి రాజకీయ సిద్ధాంతం-

---

ఒకప్పుడు చెప్పిన మాటలు నా మనస్సులో చెరగని ముద్రవేశాయి. ఇలాంటి కొడుకుగా నాకు వీడు పుట్టాడు, నీకు తమ్ముడిగా, అమ్మమ్మకు మనవడుగా వీడున్నాడు. అందుకని వీడి బాధ్యత అందరిమీద ఉంది. వీడు బాగుంటే అందరం ఆనందంగా ఉండేవాళ్ళము. కాని వీడ్ని తీర్చిదిద్దడంలోనే మనం ఆనందాన్ని అనుభవించాలి తప్పదు. నీవు ప్రక్క ఇంట్లో అక్క తమ్ముడు ఆడుకుంటుంటే ఆశగా చూడడం నేను ఎన్నోసార్లు చూశాను. నీవు వాడి దగ్గరికి వెళ్ళగానే వాడు నిన్ను కొట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి. తల్లిగా నేను ఏమి చేయగలను? బాధ్యతగా, ప్రేమగా తీర్చిదిద్దడం తప్ప. నా ఆశయానికి మీరంతా, భగవంతుడు కూడా సహకరించాలి.



అప్పుడే నా మనస్సులో ఇలాంటి పిల్లలకు సేవచేయాలి అన్న ఆశయం ఏర్పడింది. అమ్మా! నన్ను ప్రేమించవూ! అని మూగగా రోదించిన నాకు నాకన్న తల్లే రోల్ మోడల్. నా తల్లి పడ్డ ఆవేదన, తపన, ఆరాటం, పోరాటం కళ్ళారా చూశాను. ఈ కోర్స్ చదివి జ్ఞానాన్ని తెచ్చుకొని మీ అందరికి సేవ చేయడానికి మీ ముందుకు వచ్చాను. అవయువ లోపంతో పుట్టినా మనోబలంతో, ఆత్మస్థైర్యంతో విజేతలుగా నిలిచిన వారెందరో ఉన్నారు. మీరందరు మీ పిల్లల్ని అంతటివారుగా తీర్చిదిద్దుతారని నా అభిలాష.

ఇప్పటివరకు ఓపిగ్గా విన్నందుకు ధన్యవాదాలు. చివరగా, ఒక్క మాట సృష్టికర్త తన సృష్టికి తానే సిగ్గుపడి నూతనంగా జన్మించబోయే ఈ బిడ్డలకు, తమ తల్లులను తామే వెతుక్కొని, నిర్ణయించుకొనే వరమిస్తాడు. అప్పుడు ఆ బిడ్డలు సహనశీలురును, త్యాగమూర్తులు, ప్రేమామయులను తల్లులుగా ఎన్నుకుంటారు. అటువంటి మాతృమూర్తులే మీరు. మీ అందరికి శిరస్సువంచి పాదాభివందనం చేస్తున్నాను అంటూ తన ఉపన్యాసాన్ని ముగించింది రాధ.

అక్కడ ఉన్న వారందరు అశ్రునయనాలతో, రాధని మనస్ఫూర్తిగా దీవించారు. వారందరిని ప్రేమించే తల్లి దొరికిందని ఆనందపడ్డారు.

**అవయవాల లోపంతో పుట్టినా అద్భుత విజయాలను సాధించిన ఎందరో మహానుభావులకు నాయీ చిన్నకథ అంకితం.**

## నిష్ఠుర నిజం


ఆర్. దుర్గా ప్రసన్న
27070370



అమ్మాయిల కోసం
ప్రత్యేక పాఠశాలలు
అక్కడక్కడ మహిళా కళాశాలలు
ఎక్కడో ఒకచోట
ఏకంగా మహిళామణులకి విశ్వవిద్యాలయాలు
ఎక్కడ చూసినా
పురుషులతో పోటీ పడే మహిళలు...
నాకెంతో ఆనందాన్నీ-
కన్నుల పండుగనీ-
చేసే దృశ్యాలివి
కానీ
ఆడపిల్లల సంఖ్య నానాటికీ
తరిగిపోతున్న చేదునిజం
ఆనోటా ఈ నోటా విన్నా
ఆ పేపర్లలో ఈ-పేపర్లలో చూసినా
దృశ్య శ్రవణ మాధ్యమాల్లో
గొంతెత్తి గోల చేసినా నాకర్థం కాలేదిన్నాళ్ళూ
సరదాగానే సందర్శించినా
'వివాహ పరిచయ వేదిక'
నన్ను ఆలోచనలో పడవేసింది
అక్కడి వధూవరుల గణాంకాలు
నన్ను ఆవేదనలోకి లాగేస్తున్నాయి
కాదు...కాదు....నాలో భయం
మొదలైంది
ఆడపిల్ల కోసం ఎదురు చూసి చూసి
మూడు కాన్పుల్లో పుట్టిన
నా ముగ్గురు కొడుకులకు వధువులు దొరక్క
నా గుండెల మీద కుంపట్లు
అయిపోతారేమోనని !!
ఎంతమంది పెళ్ళిళ్ళ పేరయ్యలను సంప్రదించినా
అంతర్జాలంలో ఎంతెంత శోధించినా
తరిగిపోతూన్న అమ్మాయిల జాబితా
జనాభా లెక్కల్లో అమ్మాయిల నిష్పత్తి అనే
కఠిన వాస్తవాల్ని కళ్ళకు కడ్తున్నది
ఇదంతా స్వయం కృతమే అనే
కఠోర వాస్తవం కళ్ళముందే వెక్కిరిస్తూంది.

## నిస్తేజం

కేతవరపు రాజ్యశ్రీ
8500121990



ఒకప్పుడు
రైతు ఆత్మహత్య చేసుకున్నాడని
స్త్రీలపై అత్యాచారం జరిగిందని
కిరసనాయిలు పోసి భార్యకు నిప్పంటించాడని
భ్రూణహత్యకు పాల్పడ్డారని
పిల్లల్ని కిడ్నాప్ చేశారని
వార్తలు చదవగానే
మనసు వికలమై,
విలవిల్లాడి, కన్నీరు ధారగాకారేది
ఏమిటీ అరాచకం
ఎక్కడికి పోతున్నాం మనం అన్న
ఆలోచనలతో నిద్రపట్టక
ఆవేదనగా అశాంతిగా వుండేది
కానీ ! అదేమిటో !
ఇప్పుడు ఏడుపురావడం లేదు
ఎందుకంటే
వార్తా పత్రికలు తెరవగానే
మొదటి నుంచి తుదివరకూ
అన్నీ అరాచకాల కథనాలే !
బాధపడీ పడీ
గుండె బండబారిపోయింది
కళ్ళు పొడారిపోయాయి
మస్తిష్కం నిస్తేజంగా మారింది
స్పందించటం మానేసింది.

## న్యూఢిల్లీ 5వ ఆర్ట్‌ఫెయిర్



# కళాభిమానులకు కన్నుల విందు

**గుడిపూడి విజయరావు**

చిత్రకళకు ఎంత వేగంగా ఆదరణ పెరుగుతున్నదని అనుకున్నా హైదరాబాదు లాంటి నగరాలలో అనేక గ్యాలరీలు ఎన్నెన్నో షోలు నిర్వహిస్తున్నా ఒక్క ఎంఎఫ్ హుస్సేన్ ఒరిజినల్ చూడటం, లేదా ఒక్క జామిని రాయ్ పెయింటింగ్ చూడటం ఎంతో గొప్పగా ఉంటుంది. కాని ఒకే చోట ఎంఎఫ్ హుస్సేన్, ఎస్‌హెచ్ రజా, ఎఫ్ ఎన్ డి సౌజా, అక్బర్‌పదమ్‌సీ, సోమనాథ్ హోరే లాంటి ఆర్టిస్టుల ఒరిజినల్ వర్క్స్ చూడటం ఎంత ఆశ్చర్యం ఆనందం కల్గిస్తుందో తేలిగ్గానే వూహించుకోవచ్చు. ఇలాంటి అరుదైన అవకాశాన్ని న్యూఢిల్లీలో 2013 ఫిబ్రవరి 1–3 తేదీల్లో జరిగిన ఇండియా ఆర్ట్‌ఫెయిర్ కల్గించింది. కేవలం పైన పేర్కొన్న లాంటి లబ్దప్రతిష్టులైన వారి చిత్రాలే కాదు, తమదైన ముద్రవేసుకోగలిగిన యువ, మధ్యవయస్కులైన ఆర్టిస్టుల చిత్రాలను, సంపూర్ణమైన నవ్యతను, తాజాదనాన్ని వెదజల్లే యువ చిత్రకారుల కళాసృష్టిని పుష్కలంగా ప్రదర్శించింది ఈ ఫెయిర్.

అంతేకాదు, ఈ ఫెయిర్‌లో పికాసో, సాల్వెడార్ డాలి, చాగల్, వారోల్, డామియన్ హిర్స్ట్ లాంటి ప్రఖ్యాత విదేశీ ఆర్టిస్టుల వర్క్సునూ చూసే అవకాశం లభించింది. పైగా అధిక సంఖ్యలో విదేశీ గ్యాలరీలు ఈ ఉత్సవంలో పాల్గొన్నాయి. అయితే, ఈ విదేశీ గ్యాలరీలు సైతం భారతీయ చిత్రకారుల చిత్రాలను ఎక్కువగా అమ్మకాలకు ఉంచడం విశేషం. ఈ బృహత్తర కార్యక్రమం అంతటికీ సూత్రధారి 32 ఏళ్ల నేహా కిర్‌పాల్ అంటే మరింత ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి ఈ కార్యక్రమాన్ని ఆమె ఐదేళ్ల క్రితమే అంటే కేవలం 28 ఏళ్ల వయస్సులోనే ఆరంభించారు. ఇండియా ఆర్ట్‌సమ్మిట్ పేరుతో మొదలై అంతకంతకూ కొత్తపుంతలు తొక్కుతూ ప్రతి ఏటా అప్రతిహతంగా కొనసాగుతున్నది. ఐదేళ్ల క్రితం 34 గ్యాలరీలు పాల్గొంటే ఇప్పుడు 104 గ్యాలరీలు పాల్గొనడం వాటిలో 45 విదేశీ గ్యాలరీలు కావడమే దీనికి నిదర్శనం.

ఎన్‌ఎస్‌ఐసి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఫెయిర్ ప్రాంగణంలోకి అడుగుపెట్టడంతోనే వాతావరణం మారిపోతుంది. ఆ ప్రాంతమంతా కళాత్మకత ఉట్టిపడుతుంది. ఆరుబయట ఏర్పాటు చేసిన శిల్పాలు, ఇన్‌స్టాలేషన్లు స్వాగతం పలుకుతాయి. ఓ వైపున ఆర్ట్ బుక్ ఎగ్జిబిషన్ ఉంటుంది. ఆర్ట్‌గ్రంథాలు ప్రచురించే మార్గ్,





ఢిల్లీఆర్ట్‌గ్యాలరీలాంటి సంస్థలు స్టాళ్లు ఏర్పాటుచేశాయి. ఆర్ట్ ఇండియా మేగజైన్, ఆర్ట్ డీల్, టేక్ ఆన్ ఆర్ట్ తదితర మేగజైన్లు ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేశాయి. బ్రష్షులు, కలర్లు, పేపర్లు, కేన్వాసులు తదితర ఆర్ట్‌సరంజామా విక్రయించే స్టాలు యువ కళాకారులతో కిక్కిరిసి పోయింది. ఈ వైపునే ఒక హాల్లో ఉపన్యాసాలు, సెమినార్లు నిరంతరం





కొనసాగాయి. అనేక మంది దేశ విదేశీ ఆర్టిస్టులు, ఆర్ట్ క్రిటిక్స్, కలెక్టర్లు ఉపన్యాసాలు ఇచ్చారు, చర్చల్లో పాల్గొన్నారు.

అసలు ప్రదర్శన అంతా తాత్కాలికంగా నిర్మించిన ఓ పెద్ద హాలులో ఉంది. అనేక విభాగాలుగా విభజించబడిన ఈ హాల్లో ఆయా గ్యాలరీలు గ్రూపు షోలను, సోలో షోలను ఏర్పాటు చేశాయి. ఈ హాల్లోకి ప్రవేశించి కొన్ని అడుగులు వేయడంతోనే విపరీతంగా ఆకట్టుకునేది ఢిల్లీ ఆర్ట్‌గ్యాలరీ ప్రదర్శన. ఎంఎఫ్ హుసేన్ నుండి మొదలు పెట్టి దేశంలోని వివిధ ప్రాంతాల ఉద్దండ కళాకారుల చిత్రాలను, శిల్పాలను ఈ గ్యాలరీ ప్రదర్శించింది. ఒక్కో ఐటం వద్ద దాన్ని రూపొందించిన కళాకారుని గురించి, ఆ కళాకృతి గురించి వివరించే అందమైన బ్రోచర్లను ఉంచడంతో ప్రత్యేకంగా వాటిని వివరించాల్సిన అవసరం లేకుండా సరిపోయింది. కాని ఇలాంటి ఏర్పాటుకాని, లేదంటే వివరించే నైపుణ్యం కలిగిన వ్యక్తులు కాని దాదాపు ఏ గ్యాలరీలోను కనిపించక పోవడం లోపమే. ఆయా గ్యాలరీల వద్ద కేవలం కేర్‌టేకర్లు మాత్రమే ఉన్నారు. కళ గురించి, చిత్రాల గురించి ఎంతో కొంత తెలిసిన వారికి అది అంతగా ఇబ్బంది కల్గించకపోయినప్పటికీ ఆసక్తిగా కళ గురించి తెలుసుకుని ఆస్వాదిద్దామని అసంఖ్యాకంగా వచ్చిన యువతీయువకులకు ఇది తీవ్ర నిరాశను కలుగ చేసింది.

ఫెయిర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి అనేకం ఉన్నాయి. ఉదాహరణకు బెంగాల్ చిత్రకారుడు, శిల్పి సోమనాథ్ హోరే ప్రదర్శన గురించి. కోల్‌కటాకు చెందిన ఆకార్‌ప్రకార్ గ్యాలరీ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన హోరే కళాసృష్టిలోని అన్ని పార్శ్వాలను ఆవిష్కరించింది. బెంగాల్ కరువు గురించి చిత్తప్రసాద్ చిత్రాలను మాత్రమే గీస్తే, చిత్రాన్ని చూసే ప్రేక్షకునిపై ఆ బీభత్సాన్ని మరింత బలంగా ముద్రవేసేలా చిత్రాలు, ప్రింట్లు, శిల్పాలు ఆయన తయారు చేశారు. ఈ ఆర్ట్ ఫెయిర్‌లో చూసిన ఒరిజినల్ చిత్రాల ఫోటోలను అనేకం మనం ఇంతకు ముందే చూసి ఉంటాము. కాని వాటిలోని గొప్పదనం ప్రత్యక్షంగా చూస్తే తప్ప అర్థం కాదు. ప్రత్యేకించి కలర్ కాని, ఆ కలర్ తీవ్రత కాని, టెక్స్‌చర్ కాని నేరుగా చూస్తే తప్ప తెలియదు. ఈ ఫెయిర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవలసిన మరో ప్రదర్శన ఇండియన్ మాస్టర్స్ లైన్స్. ఎంఎఫ్ హుసేన్, ఎస్‌హెచ్ రజా, అక్బర్‌పదమ్‌సీ తదితర మాస్టర్స్ లైన్ డ్రాయింగులను ఈ ప్రదర్శనలో ఉంచారు. వాటిలో అనేకం ప్రసిద్ధమైన పెయింటింగ్సుకు ఆధారాలు.

కేవలం చిత్రాలే కాకుండా, అనేక ఇన్‌స్టాలేషన్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిలో అనేకం పర్యావరణ, సామాజిక, రాజకీయ అభిప్రాయాలను బలంగా వెల్లడించేవిగా ఉండటం విశేషం. ఉదాహరణకు, ఓ వాల్‌పై నేలను దున్ని విత్తడానికి సిద్ధంగా ఉన్న చిత్రం ఉంటుంది. దాని క్రిందనే రెండు మూడు బస్తాలలో పెద్ద సైజులో మట్టి గోళీలు ఉంటాయి. అయితే









ఒక్కోదానిలోపల ఒక్కో రకం విత్తనం ఉంటుంది. ఆ చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరు ఒక్కో గోలీని తీసుకెళ్లి మొలకెత్తడానికి అనువుగా ఉన్న నేలలో వేయాలన్న విజ్ఞప్తి కూడ అక్కడ దర్శనమిస్తుంది. పచ్చదనాన్నిపెంచాల్సిన ఆవశ్యకతను ఈ విధంగా వ్యక్తం చేస్తాడు ఆ కళాకారుడు. మరో ఇన్‌స్టాలేషన్‌లో మహాత్మాగాంధీ ప్రతిమ పూర్తిగా ముసుగు వేయబడి ఉంటుంది. అదో ఉప్పు గుట్టపై ఉంటుంది. సమాజంలో పెచ్చరిల్లిన అవినీతి, అనైతికతలపై ఉప్పుసత్యాగ్రహం మాదిరి మరోసారి పోరాటం చేయాలన్నది ఆ కళాకారుని ఉద్దేశం. ఆ ఇన్‌స్టాలేషన్ సందర్శించిన ప్రతి ఒక్కరికి ఆ సందేశం గుర్తుండేలా చిన్న సీసాలో ఉప్పును ఇచ్చారు. అప్పారావు గ్యాలరీ ప్రదర్శించిన ఓ శిల్పం బలమైన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నది. రెండు కమ్మోడ్‌లలో ఒక దానిలో ముగ్గురు రాజకీయనేతలను, మరో దానిలో ఇద్దరు రాజకీయనేతలను ఉంచి, ఒక దానికి లోక్‌సభ అని మరో దానికి రాజ్యసభ అని పేరుపెట్టారు.

పట్టణాలకు వలస గురించి చెప్పే ఓ బృహత్తర శిల్పం ఎంతగానో ఆకట్టుకుంటుంది. ముంబాయి నగరంలో ఆకాశహర్మ్యాలు, వాటి మధ్యనే అతి పెద్ద మురికివాడలు, ఇరుకు రహదారులు– వీటన్నింటిని రేకులు, ప్లాస్టిక్ ముక్కలు మొదలైన వాటితో వాస్తవాన్ని ఎంతో బలంగా వ్యక్తీకరించే రీతిలో రూపొందించారు. మరో ఇన్‌స్టాలేషన్ ఓ పెద్ద సాలెగూడు. ఈ సాలెగూడును దగ్గరకు వెళ్లి పరిశీలిస్తే తప్ప దేనితో తయారు చేశారో తెలియదు. అదంతా ప్లాస్టిక్ ఫైన్‌టాగ్స్‌తో తయారు చేశారు. దాన్ని చేయడానికి ఆరు మాసాలు పట్టిందట. ఆ పక్కనే విశేషంగా ఆకట్టుకుంటున్నాయి వివిధ భంగిమల్లో జీవం ఉట్టిపడే చిన్నారుల శిల్పాలు. వాటిని తయారు చేసింది గుండుసూదులతో, ఇనుపతీగల బ్రష్‌లతో అని తెలుసుకున్న ప్రతి ఒక్కరు విపరీతంగా ఆశ్చర్యపోయారు.

చివరిగానే తప్పనిసరిగా చెప్పుకోవలసింది, ఈ ఫెయిర్‌లో తెలుగువారి గురించి. హైదరాబాదుకు చెందిన సృష్టి ఆర్ట్‌గ్యాలరీ రెండేళ్లుగా పాల్గొంటున్నది. అంతా తెలుగు చిత్రకారుల వర్క్సునే ప్రదర్శించింది. అంతేకాకుండా పలు దేశ విదేశీ గ్యాలరీలు లక్ష్మాగౌడ్, వైకుంఠం, రమేష్ గోర్జాలా తదితర ఆర్టిస్టుల చిత్రాలను ప్రదర్శించడం ఎంతో సంతోషం కలిగిస్తుంది. తెలుగు చిత్రకారులూ మొత్తం ప్రదర్శనలో గణనీయంగా కనిపించడం సంతృప్తిని కలిగించే అంశం.

ఈ సారి ఫెయిర్‌లో అమ్మకాలూ బాగానే ఉన్నాయని అన్నారు. ఫెయిర్ నిర్వాహకులు స్టాళ్లకు అద్దెమాత్రమే తీసుకుంటారు. అమ్మకాలపై ఎలాంటి కమిషన్ తీసుకోరు. అందుచేత అమ్మకాలు గ్యాలరీలకు ఆకర్షణీయంగానే ఉంటాయని చెప్పవచ్చు. ఏదో ఒకటి రెండు చిత్రాలు అతి పెద్ద మొత్తాలకు అమ్ముడు పోయే పరిస్థితి కాకుండా, పెద్ద సంఖ్యలో మధ్యశ్రేణి, సాధారణ స్థాయి ధరలు కలిగిన చిత్రాలు బాగా అమ్ముడయినట్లు చెప్పారు. సందర్శకుల్లో కూడ చిత్రాలను సొంతం చేసుకోవాలని వచ్చినవారు ఎక్కువగానే ఉన్నారు. మొత్తంగా ఆర్ట్ మార్కెట్ స్తబ్దతలో కొనసాగుతున్న సమయంలో ఒక ఇన్వెస్ట్‌మెంట్‌మాదిరిగా కలెక్ట్ చేసేవారు తక్కువగానే ఉన్నారు. కొనుగోళ్ల ఎక్కువ భాగం వక్తిగతంగా అలంకరణ కోసమే. మొత్తం ప్రపంచ ఆర్ట్‌మార్కెట్ వార్షిక టర్నోవర్ 6,000 కోట్ల డాలర్లు ఉంటే, దానిలో భారత దేశం వాటా ఒక శాతం కన్నా కూడ తక్కువే అంటే ఒకింత అసంతృప్తి కలుగుతుంది. ఏదేమయినప్పటికీ ఈ ఆర్ట్ ఫెయిర్ దేశవ్యాపిత చిత్రాలను, రీతులను అర్థం చేసుకోవడానికి ఓ చక్కటి అవకాశం అనడంలో సందేహం లేదు.



## కవిత

# ఆ తలంపు

- ఎన్వీ. రఘువీర్ ప్రతాప్,
9440551552




నాకడుపాకలి
అమ్మ గుండెల్లో గంటయి మ్రోగేది
ఆటల్లోపడి అన్నీ మరిచేనాకు
అమ్మ పిలుపే ఆకల్ని తెలిపేది
ఊరంతా బలాదూర్‌గా తిరిగాక
అమ్మను చేరంగానే అలసట తీరేది
కాస్తంత సుస్తీ చేసినా
అమ్మ ప్రాణం తల్లడిల్లేది
కంటికి రెప్పయి కాపాడేది
సకల సపర్యలు చేసి దిష్టితీసేది
కన్పించిన ప్రతిదేవునికి ముడుపుకట్టేది
అమ్మపాట జోలగా విన్పిస్తుంటే
చెలిమలోని చందమామనయి
నిద్రమ్మ ఒడిలోకి నిశ్చింతగా జారే వాడిని
అమ్మ అనంతాల్లోకి వెళ్ళిపోయాక
బాల్యం చేజారిపోయింది
చిన్నప్పుడమ్మ చెప్పిన కమ్మని కథల్ని
ఆనాటి ఉగ్గుపాల ఊసుల్ని
జోల పాటల రాసుల్ని తిరిగి
నెమరేసుకుంటుంటాను
బతుకుబాటలో మబ్బులు
అలుముకొన్నప్పుడు
అమ్మ జ్ఞాపకాల్ని ఆలింగనం
చేసుకుంటుంటాను
సమస్యల సమూహాలు
నన్ను చుట్టు ముట్టినప్పుడు
అమ్మ అనంతాల్లోంచి
దేవతలా దిగివచ్చేది
చెమ్మగిల్లిన నా కళ్లను చూసి
చీర కొంగుతో కన్నీళ్ళు తుడిచేది
అనురాగపు హస్తాల్తో తలనిమిరేది
ఆర్ద్రత చెదిరిపోయేది
మనసు మమతలతో నిండిపోయేది
అమ్మే కాదు. ఆమె తలంపు కూడా
అమృతమయమే, ఆనంద నిలయమే
అందుకే మళ్ళీ ఒక్కసారి
పసివాడినై పోవాలన్పిస్తుంది
అమ్మ ఒడిలో తలదాచుకోవాలన్పిస్తుంది
ఆనాటి బాల్యాన్ని హత్తుకోవాలన్పిస్తుంది.

---

# అగ్నిశిఖ జ్యోతిసింగ్ !

- మద్దెర్ల రమేశ్
9985135771



ఢిల్లీ నడివీధుల్లో
ఎక్కడెక్కడ నీ నెత్తుటి బొట్లు రాలాయో..
ఎక్కడెక్కడ నీ ఆర్తారావాలు
నింగికెగిసాయో ..
ఆ నెత్తుటి మరకల్లో
ఆ వాయు సంలీననాల్లో
నీ పోరాట ముద్రికలు
అగ్ని కెరటాలై చిగురించాయి !
నరకయాతనల్లో సైతం
బతికి తీరాలన్న నీ ఆకాంక్ష
పదమూడు రోజుల్లో ఆవిరైపోయినా
వేల వేల కొవ్వొత్తుల కాంతుల్లో
ఊరూరా వికసించింది నీ ప్రాణ కి'రణమే' !
మృగత్వం మనిషి రూపెత్తి
లగ్జరీ బస్సులో రాక్షస క్రీడైంది
సుతిమెత్తని నీ పొత్తిళ్ళలో
ఇనుప చువ్వల వికృత నృత్యమైంది
మనిషి తనానికే మచ్చె గుచ్చుకుంది !
పంచభూతాల ఆచ్ఛేదనతో
చేతనాచేతనమైన నీదేహంముందు
కళ్ళప్పగించిన లోకం
దిక్కులన్నీ మూసుకున్న మానవత్వమైంది !
నీ ప్రాణాలు గాలిలో లీనమైనా
నీ పోరాట జ్వలితాణువులు
జాతి జీవనాడుల్లోకి ప్రవహించాయి
నీ రోదనలు మూగబోయినా
నీ ఆక్రందనలు జనం గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయ్ !
దేశం లోని అణువణువు
కదిలించడానికేనేమో
నిర్భయంగా జ్వలించావు !
సాల్యూట్ అగ్నిశిఖా !
సాల్యూట్ ! సాల్యూట్ !
అగ్నిశిఖ జ్యోతిసింగ్ పాండే !
సాల్యూట్ !

కథ

# చిన్ని



ఇనుగంటి జానకి

"ఎందు నీకు ఫోన్!"

సూపర్‌వైజర్ పెట్టిన కేక విని చేతిలో ఉన్న పేపర్ కట్టకింద పడేసి వచ్చి రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు ఎండోడు. అటునుండి --

"నాయనా ఈ శెనారం ఊరికి వత్తవేటి?" అని అడిగాడు ఎండోడి తండ్రి దాలయ్య."వత్తా" అన్నాడు ఎండోడు. దాలయ్య ఉత్సాహంగా "నాయనా మనురూ కొండ పై సెల్ టవరు ఎట్టినారురా. ఈ పాలి వచ్చినప్పుడు నాకు సెల్ కొని ఒట్టుకురా, మనూరులో అంతా సెల్ కొనుక్కున్నారురా. రూపాయి ఫోన్ డొక్కీలు తీకేసినారురా. నాను పెద్ద రోడ్డు కాడకి వచ్చి నీకు ఫోన్ సేస్తున్నానురా," అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఏటో అయ్య వరస నా జీతం ఎంత తను అడిగినవన్నీ కొనెట్టటానికి. తను రూపాయికి మించి ఖర్చు అయిపోతాది అనుకోని నాయనా బాగున్నావా! అని కూడా అడగడు. ఆనాడు నన్ను సదివిత్తే నాను ఈ మిల్లిలో పేపర్ కట్టలు మోసేపని సేసేవాడిని కాదు. అనుకుంటూ మనసులో బాధపడుతూ మళ్ళీ పని ప్రారంభించాడు.

ఇంటికి వచ్చిన కొడుకును చూసి "నాను సెపుతా నాను సెపుతా!!" అని ఏదో చెప్పటానికి ఎండోడి తల్లీ తండ్రి వంతులాడుకుంటున్నారు. అవి ఏవీ పట్టించుకోక వీపున ఉన్న బేగుని తీసి పాగా కొయ్యకి తగిలించి ఇంటి నుండి బయటపడ్డాడు. "ఏటో ఈడి పోగరు," అంటూ కోపంగా అన్నాడు దాలయ్య "పొగరు కాదు ఆడు అంతే;" అంటూ సర్ది చెప్పింది తల్లి. ఊరులో చిన్న బడ్డి పెట్టుకోని నిత్యవసారాల సామానులు అమ్ముకునేవాడు జగన్నాధం. ఎండోడిని చూసి "కుర్రాడికి పెల్లి అంటే ఏం ఆశ, నిన్న ఆలు ఇల్లు సూపులకి వచ్చినారు, ఈ రోజు ఈడు వచ్చేసినాడు," అంటూ ఎగతాళి చెయ్యటం ప్రారంభించాడు. "ఏంటిరా నీవు అనేది? నాకు అస్సలేటి తెల్దు" అన్నాడు ఎండోడు. కాసేపు ఆట పట్టించి తనకి నిజంగానే ఏవి తెలియదు అని నమ్మి చెప్పటం ప్రారంభించాడు జగన్నాధం --

"నీకు సెయ్యవల్సిన పిల్ల పేరు సిన్ని, పెద్ద రోడ్డు కాడా. పచ్చబస్సు ఎక్కి కుంటినవలస రోడ్డుపై దిగి రెండు ఫర్లాంగులు నడిస్తే సిన్నివాల ఊరు వత్తాది. ఆ ఊరుకి ప్రేసిడెంట సిన్ని వాల్ల నాయనే. కలిగిన కుటుంబమే నీవు ఉద్యోగం సేస్తున్నావని నీకు పిల్లని ఇత్తానంటున్నారు. పిల్ల సాలా బాగుంటాది కాని సాలా గయ్యాలి. తనకి సదు సెప్పిన మాట్టారునే పోలీసులకి అప్పసెప్పినాది." జగన్నాధం చెప్పిన మాటలు ఎండోడిలో కుతుహలం పెంచాయి. ఎండోడు చిన్ని విషయం వివరంగా చెప్పమని జగన్నాథాన్ని బతిమాలుకున్నాడు. చిన్ని వయసు గల అమ్మాయిలు తలపై పేడతట్ట పెట్టుకొని పేడకో లేక పొయ్యలోకి పుల్లలకో వెళుతూ ఉంటే చిన్ని మాత్రం శుభ్రంగా తయ్యారు అయి బడికి వెళ్ళేది. ఐదో తరగతి పాసయ్యాక చిన్ని చదువు ఆగిపోయింది, కారణం చిన్ని చదివిన బడిలో ఆపై తరగతి చదువుకోటానికి లేదు. చిన్నికి చదువుచెప్పే మాష్టారు బదిలి అయి వెళ్ళిపోయాడు. ఆ స్థానంలో పాఠశాలకి వచ్చిన మాష్టారు చిన్ని ఇంటికి వచ్చి చిన్నిని మళ్ళి బడికి పంపమని తను స్వయంగా ఆరు-ఏడు తరగతుల పాఠాలు బోధించి హైస్కూల్‌కి తీసుకువెళ్లి పరీక్ష రాయిస్తానని చెప్పాడు. అప్పటికే చిన్ని చదువు మానేసి రెండేళ్ళు గడిసిపోయాయి. వయసు వస్తున్న పిల్లని అంతదూరం పంపవద్దు అని చిన్ని తాత, పిల్ల చదువుకోవాలని చిన్ని తండ్రి వాదించుకున్నారు. చిన్ని తల్లి భయపడి పిల్లకి జాగ్రత్తలు బోధపర్చి బడికి పంపేది. ఒక చిన్నినే కాదు మాష్టారు చాలా మంది పిల్లల్ని ప్రోత్సహించి చదువుచెప్పేవాడు, కనకా ఊరులో జనాలకి ఆ మాష్టారు అంటే గౌరవం. చిన్ని కూడా చురుకుగా చదువుకోవటం ప్రారంభించింది. అంతా బాగానే ఉన్నా ఒక్కొకనాడు మాష్టారు ప్రవర్తన చిన్ని కి నచేది కాదు మాష్టారు చిన్ని బుగ్గలు నిమరటం, పాఠం బోధిస్తూ భుజాలపె చేయివేసి తనని తన దగ్గరకి తీసుకోవటం. బడి నుండి తన వెంట తన ఇంటికి తీసుకుపోయి గిన్నెలు తోవించటం, ఇల్లు ఊడవమనటం వంటి పనులు చేయించేవాడు. ఒకరోజు చిన్ని మాష్టారు తన చే ఇంటి పనులు కూడా చేయిస్తాడు. అన్న విషయం తండ్రికి చెప్పింది. మాష్టారు కుటుంబం పట్టణంలో ఉన్నారు, మొగాడు ఇంటి పని చేసుకోలేక పిల్లల చే ఇంటి పనులు చేయించుకుంటున్నాడు. ఆ మాత్రం గురు సేవ చేస్తే తప్పు లేదు. అని చిన్ని తండ్రి సమర్ధించాడు. అసలు విషయం చెప్పాలని ఉన్నా చిన్ని తండ్రికి చెప్పలేక పోయింది. పరీక్షలు దగ్గరపడటంతో చిన్ని మరేవి ఆలోచించకుండా దృష్టి చదుకు పై మళ్ళించింది. ఒరోజు మాష్టారు "చిన్ని ఈరోజు నీ పుట్టినరోజు," అని చెప్పి స్వీట్ తినమని ఇచ్చాడు. "నా పుట్టిన రోజు మీకు ఎలా తెలిసింది?" అని సందేహంగా చిన్ని అడిగినప్పుడు తన సర్టిఫికేట్‌లో చూసానని చెప్పాడు. "చిన్ని పాఠశాలకి వచ్చిన పిల్లలకి ప్రభుత్వం గణవేశాలు ఇస్తున్నారు. నేను నీకోసం సలవార్ కుర్తా కుట్టించాను ఇదిగో వేసుకో," అని చెప్పి చిన్నికి ఇచ్చాడు. చిన్ని మరోగదిలోకి వెళ్లి దుస్తులు మార్చుకుంటున్నాది.



మాష్టారు ఆ గదిలోకి వచ్చేసాడు "మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని చిన్ని అడిగింది. "నీవు చిన్నపిల్లవి సలవార్ వేసుకోవటం చేతకాదని సాయం చెద్దమని వచ్చా,"నని చెప్పి అక్కడ నేలపై కూర్చొని చిన్నిని పట్టుకోబోయాడు. చిన్ని పరుగున మరో గదిలోకి వచ్చి గబ గబా దుస్తులు సరిచేసుకుని పరుగులు పెట్టింది. ఇంటిలో చెపితే తండ్రికి తాతకి వాదన వస్తుందని తమ ఊరిలో ఉన్న పోలీసు జవానికి చెప్పింది. ఆ విషయం తెలిసేక మాష్టారు చాలాసార్లు పిల్లలతో ఈ విధమైన తప్పుగా ప్రవర్తించాడని వారు భయపడి ఏ ఒక్కరితో చెప్పలేకపోయారని చెప్పుకున్నారు.

అంతా విన్నాక ఎండోడికి తనని అడగకుండా ఇటువంటి పిల్లతో తనకి పెళ్లిమాటలు. ఆడుతున్నందకు అమ్మ, అయ్యపై చాలా కోపం వచ్చింది. ఎండోడు గబగబ ఇంటికి వచ్చాడు. తండ్రి చేతిలో సెల్ ఫోను ఉన్నది. తను ఎవ్వరితోనో మాటలాడుతున్నాడు. ఎండోడు చాలా కోపంగా ఉన్న విషయం గమనించి, దాలయ్య "నాయన ఈ ఏడు దిగో వలసలో బాగా పుట్టకొక్కు పేలినాదిరా, నాను వరసాగా నాలుగు రోజులు ఏరుకు వస్సి టౌనుకు పోయి అమ్మినానురా, రెండు వేలు వచ్చినాయిరా అందులో రెండొందలు కలిపి ఈ సెల్ కొనినానురా. నీకు ముచ్చటగా ఉంటే ఓట్టుకు పో," అని అన్నాడు. తండ్రి మాటలు పట్టించుకోలేదు ఎండోడు తల్లి వద్దకు వచ్చి "ఏటి నాకు పెల్లా?" అని అడిగాడు. "అదే నాను మీ అయ్య నీకు సెపుతుంటే నీవు వినుకోనేదు," అన్నాది రావులమ్మ. "నాను పెల్లి సేసుకోను," అన్నాడు ఎండోడు" ఎంది సేసుకోవు? నిలదీసింది రావులమ్మ. "ఆ పిల్ల సాలా గయ్యాలి" అన్నాడు. ఏ తలమాసినోడు అప్పుడే నీకు ఏటి సెప్పిసినాడు రా," అంటూ గై మంది రావులమ్మ "తెల్దేదేటి!" అంటూ ఎదురు తిరిగాడు ఎండోడు.

"తెలుత్తాదిరా-- తెలుత్తాది. ప్రతి దొంగెదవా సేసిన ఎదవ పని దాసుకుబతుకుతేనే ఆడది. నాను సెపుతా ఆ పిల్ల ఆడిని బాగానే ఎదిరించినాది. నేకపోతే ఆడు ఇంకా మంచోడిలా తిరుగుతూ నోరెరగని పిల్లని మాపేవాడు." పొయ్యిదగ్గర కూర్చొని పుల్లలు ఏగేస్తూ ఇంకా ఏవేవో వర్ణిస్తున్నాది రాములమ్మ.

ఎండోడు గదిలోకి వెళ్లి పాగా కొయ్యపై ఇందాకల వెలెసిన బేగు తీసి అందులో ఉన్న డబ్బు బియ్యం పోసుకునే గూన మీద పెట్టేసి బేగు వీపుకు సద్దుకోని ఇంటి నుండి బయటకి బయలుదేరాడు. "ఎందిరా ఎల్లిపోతున్నావు?" అంటూ గైమంది రావులమ్మ. ఎండోడు సమాధానం చెప్పలేదు నడుస్తూనే ఉన్నాడు. గబగబా వచ్చి వాడి చెయ్యపట్టుకొని ఆపటానికి ప్రయత్నం చేసింది. ఎండోడు తల్లిచేయి విసిరి వదిలించుకు నడుస్తూనే ఉన్నాడు. రాములమ్మ అక్కడే చతికిల బడి కూర్చొని ఏడుపు ప్రారంభించింది. ఏడుపు విని ఇరుగు పొరుగు వచ్చి జరిగిన విషయం

తెల్సుకుంటున్నారు. ఎండోడు ఏ ఒక్కరినీ పట్టించుకొకక నడుస్తూనే ఉన్నాడు. దాలయ్య ఎండోడి వెంట పరుగు పెట్టి "నాయనా నా మాట ఇనుకో నాను మాట ఇచ్చినాను రా," అంటూ కొడుకుని బతిమాలుతూ వాడి వెంట పడ్డాడు. తండ్రిని కూడా ఎండోడి పట్టించుకోలేదు. పెద్ద రోడ్డు వద్దకి వచ్చి వస్తున్న బస్సు చెయిఎత్తి ఆపించుకుని బస్సు ఎక్కెసాడు. అయ్య రోడ్డుపై నిలబడి ఏవేవో అరుస్తున్నాడు ఎండోడుకి అవి ఏవీ వినపడలేదు.

మాట ఇచ్చినాడుట, వట్టి అడవి మనుసులు కొడుకుపై అధికారం ఎరుగును – కొడుకు మనసు ఎరగరు. అనుకుంటూ కోపంతో రగిలిపోతున్నడు. "టికెట్––టికెట్! అందరూ టికెట్ తీసుకోవాలి!! చెకింగ్ ఉంది జాగ్రత్తా." బస్ కండెక్టర్ అంటున్న మాటలు చెవిలో పడి వర్తమానంలోకి వచ్చాడు ఎండోడు. టికెట్ కొన్నాడు. బస్సు కన్నావేగంగా మనసులో ఏవేవో ఆలోచిస్తూ బాధా పడుతూనే ఉన్నాడు. బస్సు దిగి రూంకి వచ్చి వీపుపై బేగువిప్పి పడేసి మంచంపై వాలిపోయాడు. రాత్రి ఎనిమిది గంటలకి తెలివి వచ్చింది. తనకి ఈ రోజు నైట్ షిఫ్టు ఉన్న విషయం జ్ఞాపకం వచ్చి లేచి ముఖం కడుక్కొని ఫేక్ట్రీ కీ వచ్చేసాడు. ఫేక్ట్రీ కాంపౌండ్‌లో అంతా గుమిగూడి ఉన్నారు. ఏవి జరిగిందా అని తను దగ్గరికి వెళ్లి పోంచి చూసాడు. దాలయ్యని చుట్టుముట్టి తను చెవుతున్నవి వింటున్నారు అంతా, ఎండోడిని దాలయ్య చూసి, "ఇదిగో బాబు ఈడే నా కొడుకు ! కొడుకు పెల్లి జరగాలా అని అయ్యకి ఆశ ఉంటాదానేదా సెపండి బాబు." అన్నాడు అక్కడ ఉన్నవారు దాలయ్యని విడిచి ఎండోడిని చుట్టుముటి ఏవేవో బోధపర్చటం ప్రారంభించారు.



ఎండోడు వాళ్లని వద్దులు చుకోవటానికి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టి "నాను మా అయ్య సెప్పినట్టు సేస్తాను! సాలా యింకేదేనా సెపుతారా?" అన్నాడు. దాలయ్య అక్కడి నుండి ఇంటికి తిరిగి వచ్చేసాడు.

ఎండోడు కళ్లల్లో నీళ్లు తిరిగాయి, ఏ ఒక్కరూ చూడకుండా గబగబా ఫేక్ట్రీ లోపలకి వెళ్లిపోయాడు దాలయ్య వారం వారం వచ్చి పెళ్ళికి ఏవేవి ఏర్పాటులు జరుగుతున్నాయో ఎండోడితో చెపుతూ వేళకి ఇంటికి రమ్మని చెప్పేవాడు.

* * *

చేతిలో కొబ్బరి బొండం తల నిండా పువ్వులు లిస్టర్ పట్టుచీర ముఖాన పసుపు నుదుట కళ్యాణంబొట్టు తల వంచుకొని మెల్లగా నడుస్తు వస్తున్న చిన్నిని పెళ్లిపీటల మీద కూర్చోని ఉన్న ఎండోడు చూసి ఆశ్చర్య పోయాడు. పెళ్లికూతురు సాలా అందంగా ఉన్నాదే! నాను అమ్మా అయ్యతో తగాదా ఎట్టుకున్నానే, అనుకున్నాడు. పెళ్ళి తర్వాత చిన్నితో కలసి మూడు రాత్రులు కూడా గడపలేదు చిన్ని తల్లి చిన్నిని పుట్టింటికి తీసుకుపోవటానికి వచ్చేసింది, "అమ్మా సిన్నిని పంపకే," అన్నాడు, "ఇది ఆవిటనేల అత్తా కోడలు ఓ ఇంటి గడప దాటకూడదు," అని చెప్పింది రాములమ్మ. చిన్ని వెళ్లిపోయాకా ఫేక్టరీకి వచ్చేసాడు ఎండోడు. వస్తున్నప్పుడు అమ్మ పొట్లం కట్టి ఇచ్చిన మిఠాయి, ఫేక్ట్రీలో తనతో ఉద్యోగం చేస్తున్న స్నేహితులకి పంచేసాడు. ఇంటి నుండి వచ్చినప్పటి నుండి రాత్రి పగలు చిన్ని జ్ఞాపకాలే. టౌన్‌లో ఫేశన్‌గా దుస్తులు వేసుకున్న ఏ అమ్మాయిని చూసినా ఈ డ్రెస్ చిన్ని వేసుకుంటే ఎలా కనబడుతుంది అని ఆలోచన. తను వచ్చి వారం రోజులైంది ఓ సారి చిన్నినీ చూసి వచ్చేద్దాం అనుకొని బయలు దేరాడు. ఇంటికి వచ్చినప్పటికి పగలు పదుకుండు గంటలైంది అమ్మ అయ్య ఇంటిలో లేరు పొలానికి వెళ్లారు. ఎండోడు చిన్ని వాళ్ల ఊరుకి బయలుదేరాడు. చిన్ని ఊరు పొలిమేర అడుగు ఎట్టేటప్పటికి మధ్యానం రెండు అయింది. ఎంఢేడిని చూసి ఓ చిన్న కుర్రాడు "నీవు చిన్ని బావవి కదు," అని అడిగాడు. ఎండోడు "ఆ" అన్నట్టు తల ఊపాడు. పిల్లడు గిర్రున పరుగు పెట్టాడు. కాసేపటికి చిన్ని పరుగు పరుగున వచ్చింది. సంతోషంతో చిన్ని ముఖం వెలిగిపోతున్నాది. చిన్నిని చూసి "బాగున్నావా సిన్ని" అని అడిగాడు. "నీవే ఊరు నుండి వచ్చావు నిన్ను నాను పలకరించాలా" అని అన్నాది. ఎండోడు అక్కడే పొలం గట్టుపై కూర్చొని సిన్ని ఏం సేస్తున్నావు?" అని అడిగాడు. "సేకునార తీతకి ఎల్లినాను బావా నీవు వచ్చినావని తెల్సి వచ్చినాను," అని సమాధానం చెప్పింది. ఎండోడు చిన్ని చెయి పట్టుకూ "సిన్ని సేకు నార తీతకి ఎల్లకే సేతులు పులిసిపోతాయి," అని అన్నాడు. "ఎం కాదునే రాతిరి ఓ కిరసనూని సుక్క రాసుకుంటా" అంటూ ఎండోడి చేతులనుండి చెయి విడిపించుకున్నాది. చిన్ని కళ్లు మరి కాస్తా పెద్దవి చేసుకు చేతులు ఆడిస్తూ సమాధానం చెప్పటం ఎండోడికి చాలా ముద్దు అనిపించింది. "సిన్ని రా ఇక్కడ కూకో అన్నాడు," చిన్ని ఇటు అటూ ఎవరైనా చూస్తున్నారేమో నని చూసిందే తప్పా వచ్చి కూర్చొలేదు. "సిన్ని ఎప్పుడైనా సినిమా సూసావా?" అని అడిగాడు. "మా సిన్నయ్య ఇంటిలో టి.విలో సూసాను అన్నది. "సినిమా హాలులో సూడలేదా?" అని అడిగాడు. "ఊ సూసాను, మనురుకి ఐదు మైలు దూరం సినిమాహాలులో సూసాను," అని సమాధానం చెప్పింది. ఆ "హాలు టిన్ను రేకులతో కట్టినారు," అన్నాడు ఎండోడు. ఆ–––అంటూ సిన్ని ఎండోడు వీపుపై ఓ చిన్న దెబ్బ వేసింది. "సిన్ని నాతో వత్తావా?" అన్నాడు. ఎక్కడికి అన్నట్లు ఎండోడి వేపు చూసింది. "విశాఖలో నీకు ఎయర్ కండీషనల్ హాలులో సినిమా సూపిస్తాను," అన్నాడు చిన్ని ఏవి అనలేదు, సంతోషంగా ఎండోడి పక్కన వచ్చికూర్చున్నాది. ఎండోడు చిన్నిని దగ్గరగా తీసుకు బుగ్గపై ముద్దు పెట్టుకోబోయాడు. "ఓలమ్మో ఇప్పుడు ఇక్కడా?" అంటూ చెంగున లేడి పిల్లలా లేచి ఓ గెంతేసి పరుగు తీసింది. వెళ్లిపోతూ "బావా ఇది అవీట నేల నీవు మా ఇంటికి రాకూడదు, నాను సారి ఒట్టుకు

వచ్చినప్పుడు నీవు మీ ఇంటికాడే ఉండు.'' అని అరిచి చెప్పి వెళ్లిపోయింది. చిన్ని కాళ్లకు పెట్టుకున్న మువ్వల పట్టాలు సవ్వడి వినబడే వరకు ఎండోడు అక్కడే కూర్చొని తిరిగి ఇంటికి వచ్చేసాడు. "ఇంటికి వచ్చిన కొడుకును చూసి నాయనా ఎప్పుడు తిన్నావో ఏటో రా కూకో తిను" అని వడ్డించింది తల్లి, ఎండోడు కూర్చొని తింటున్నప్పుడు దాలయ్యా ఇంటికి వచ్చాడు. కొడుకుని చూసి "ఈ ఏడు బాగా వానలు కురిసాయి కోడలు ఇంటికి వచ్చిన ఏళా ఇసేసం బాగుంది," అన్నాడు. ఎండోడు గర్వంగా తండ్రి వేపు చూసాడు. "నాయనా కోడలు సారి ఒట్టుకు వస్సి నప్పుడు ఉందువుగాని ఇప్పుడు ఉద్యోగానికి ఎల్లిపో," అన్నాది రావులమ్మ.

"బావ నీకు పంచదార అరిసె ఇట్టం అని మా అమ్మ సేసినాది తిను," అంటూ కొసిరి కొసిరి మరి పెట్టింది ఎండోడికి చిన్ని. బావ ఆరోజూ ఏటో సినిమా అన్నావు? అది ఎలా ఉంటాది ఏటి?" అని అడిగింది." అది ఎయిర్ కండీషనర్ అంతా బయట ఎండగా ఉన్నా సినిమా నడుస్తుంటే సల్లగా ఉంటాది, సిన్ని ఎలుదామా?" అడిగాడు ఎండోడు. చిన్ని సమాధానం చెప్పలేదు రాములమ్మ వేపు చూసి ఊరుకుంది. "అమ్మా! సిన్నిని నాతో పంపవే'' అని అడిగాడు. ''అదెలా కుదురుతాదిరా ఉడుపులు ఏళా నీవు నేక సిన్ని నేక పొలానా పని ఎవరు సేస్తారురా?" అంది. ఎండోడు అమ్మా, "ఈ ఒక్కరోజుకి పంపవే;" అంటూ పదే పదే తల్లిని బతిమాలాడు. "సరే" అని ఒప్పుకున్నాది. బస్సు దిగి ఆటోలో ఇంటికి వెళ్లుతున్న చిన్ని దారిలో "అదేటి బావా ఇక్కడ ఆడాలు పాంటు ఏసుకు బండి తోలుతున్నారు?' అని అడిగింది. "బండి తోలడం రావాలే గాని ఆడేటి మోగేటి," అని సమాధానం చెప్పాడు. గది తాళం తీస్తు "ఇదిగొ ఇదే మన ఇల్లు," అన్నాడు ఎండోడు. గదంతా తిరిగి చూసి ఇదేటి బావా మన ఊరులో గింజా గిటుకు ఓసుకున్న నందపాటి గదినేదు" అన్నాది చిన్ని. "ఏటనుకున్నావు ఇది టౌను మన ఊరు అనుకున్నావా ఏటి తాతలనాటి జాగాలో మనకి నస్సినంత జాగా మట్టి గోడ ఎట్టి తాటాకులు కప్పుఏసిటానికి;" అన్నాడు. చిన్ని గది నుండి బయటకి వచ్చి పక్క గదిలో పోంచి చూసి "బావా ఏటి ఈ గదిలో ఇద్దరు ఆడాలే ఉన్నారు?" "ఏ ఇలారా," అని గసిరి. "ఆలు టూడెంటులు నీలాగా నారతీతకు ఎల్లే కూలీలు అనుకున్నావా ఏటి,"అన్నాడు "ఎందుకు బావా కూలీలు అంటే నీకు సులకన! కూలీలు నేకపోతే ఈ డబ్బు ఉన్నోలు గతి ఏటో?" అన్నాది ఎండోడికి సమాధానం తోచలేదు. ఎండోడు గదిలో సినిమా నటీల అర్ధనగ్న చిత్రాలు గోడకి అంటించి ఉన్నాయి. "ఏటి బావా ఇదంతా?" అంటూ చిత్రాలు పర పరా చింపేసి పారేసింది. ఎండోడు తను పడుకున్న పరుపు కింద దాచిన పేకెట్ తీసి చిన్నికి అందిస్తూ "సిన్ని పాంటు ఏసుకుంటావా?" అంటూ అడిగాడు. "ఏటేటి నాను పాంటు ఏసుకోవాలా" ఆశ్చర్యపోతూ అడిగింది. చిన్న ముఖంలో



ఆ భావం చూసిన ఎండోడికి చిన్ని చాలా ముద్దు వచ్చింది. ఎండోడు చిన్నిని తన వడిలో లాగేసుకు ముద్దులలో ముంచేసాడు.

సాయంకాలం ఇద్దరు సినిమాకి బయలు దేరారు. "సిన్ని ఇది 70 ఎమ్.ఎమ్ ఎయర్ కండీశనల్ హాలు," అని చెప్పాడు ఎండోడు. చిన్నికి ఏమి అర్ధం కాలేదు ఊరుకుంది. "ఇక్కడ ఓ టిక్కట్ ధర 60 రూపాయల నుండి ఉన్నాయి తెలుసా," అన్నాడు "బావా నీకు బోలెడు జీతం కదూ?" అని అన్నాది ఎండోడు గర్వంగా చిన్నివేపు చూసాడు. ఎండోడు టికట్ తీసే కిటకి వద్దకు వెళ్లి లైన్‌లో నిలబడ్డాడు. చిన్ని ఇటు అటూ చూస్తూ నిలబడ్డాది. చిన్ని గబగబా ఎండోడి వద్దకు వచ్చి "బావా అటూ సూడు సింకి సొక్కా ఏసుకు వస్సినాడే ఆడు మా ఊరి సత్తిగాడు. ఆడు ఇంటి నుండి పారిపోయి వచ్చినాడు. ఆడు గాని నన్ను సూసినాంటే పారిపోతాడు. నీవు పోయి ఆడిని ఒట్టుకో," అని చెప్పింది. "ఏ పోతే పోనిఏ, అమ్మ ఇంత బెగి మల్లి నిన్ను పంపదు," చికాగుగా ముఖం పెట్టి అన్నాడు ఎండోడు. చిన్ని అటు నడిచింది. సత్తిగాడు చిన్నిని చూసి తప్పుకోబోయాడు. "ఆడిని ఒట్టుకోండి" అంటూ చిన్ని కేక పెట్టింది. ఇద్దరు యువకులు పరుగున వెళ్లి వాడిని పట్టుకున్నారు. "ఏరా ఏం చేసావు అంటూ ఓలెంపకాయ లాగించారు." వద్దు ఆడిని కొట్టకండి అని చిన్ని సత్తిగాడి వద్దకు వెళ్లి ''ఏరా ఇంటి నుండి పారిపోయి వచ్చినావు మీ అయ్యి పిచ్చోడిలా ఊరురూ నిన్ను ఎతుకుంటూ తిరుగుతున్నాడే. మీ అమ్మ పచ్చి మంచినీలు ముట్టక మంచాన పడిందే అది గాని సస్తే నోరెరగని నీ సెల్లిని ఎవరు చూస్తారురా?" అంటూ పెద్ద నోరు పెట్టి ఇంకా ఏవేవో అంటున్నాది. అక్కడ ఉన్న వారు చిన్నిని సత్తి గాడిని చుట్టుముట్టారు. ఎండోడు ఆ దృశ్యం చూసి "సిన్ని ఆడిని ఒగ్గి అంతా నిన్నే సూస్తున్నారు," "నీవు ఉండు బావా," అని ఎండోడిని కసిరి, మల్లి సత్తి గాడిని ఏవో అంటున్నాది. "సిన్ని" అంటూ కేక పెట్టి చిన్నిని వారించాడు ఎండోడు. "ఉండు" అని చెప్పి చిన్ని ఇంకా ఏవో అంటూనే ఉన్నాది. ఎండోడు పట్టరాని కోపంతో చిన్ని చెంప చెళ్లు మనిపించాడు. "ఏటి బావా మనకి ఎంత జీతం ఐతే! మనము ఊరు ఒగ్గి టౌనుకు వచ్చిస్తే మనూరు ఆలని ఆరి కట్ట సుఖాలని మరచి పోతామా ఏటి?" అంటూ ఏడుపు ప్రారంభించింది. ఎండోడు చిన్ని చెయి పట్టుకు ఇంటికి తిరిగివచ్చేసాడు. ఎంత బతిమాలినా చిన్ని ఏడుపు మాన లేదు చిన్ని అలకతీర లేదు. చేసేది లేక ఎండోడు తెల్లవారేసరికి చిన్నిని తీసుకు ఫస్టబస్ ఎక్కి ఇంటికి తిరిగి వచ్చేసాడు. తను వచ్చేసరికి ఎండోడి ఇంటి ముందు జనాలు గమ్మిగూడి ఉన్నారు, వారిలో సత్తిగాడు వాడి అమ్మ అయ్యా ఉన్నారు. వాళ్ళు ఎండోడిని చూసిన వెంటనే ఎండోడి వద్దకు వచ్చి "నాయనా నీ ఋణం ఈ జన్మలో తీరుసుకోనేము నీవు ఈడికి బాగా బుద్ధి సెప్పినావు" అంటూ ఏవేవో అంటున్నారు. ఎండోడు  చిన్ని వేపు చూసాడు, చిన్ని నవ్వుతున్నాది.

**కవిత**

# గచ్చపొదల్లో సూరీడు

**-డా॥ కత్తి పద్మారావు**
**9849741695**

గచ్చపొదల్లో సూరీడు
వంటినిండా గాయాలతో
మూలుగుతున్నాడు
రాత్రిని జయిస్తున్న
ఉత్తేజం ఒకప్రక్క
పగటిని కోల్పోతున్న నిస్తేజం మరోప్రక్క
అందరూ సంతోషంగా వుండాలని
ప్రయత్నిస్తున్నారు
అంటే దుఃఖం లేదని కాదు
పిల్లోడి నోటి కాడ బడినీలాగేసి
కూటి కోసం వలస వెళుతున్న
బాబు అమ్మలగోడు
పచ్చ పంటపొలాలు
ధాన్యాగారాలు,
గాయపడిన కోకిలలే కాదు
దహించబడ్డ కాకుల గుంపులూ వున్నాయి



ఎందుకు వీరు
ప్రేమికుల మధ్యలో
కులం చిచ్చురగిలిస్తున్నారు
పెరియార్ రామస్వామి
రగిలించిన
కులవ్యతిరేక పోరాటానికి
ధర్మవరం గృహదహనాలు
సంకేతమా!
ఏమి విధ్వంసం అవుతున్నాయి
ఏమి పునరుజ్జీవనం అవుతున్నాయి
మానవ విలువలు మృగ్యం అవుతున్నాయి
మానవుని లోని కరుణ, ప్రేమ
రాను రాను నశిస్తున్నాయి
మెదడులో పేరుకు పోతున్న
బూజును తొలగించలేక
స్వాములు, బాబాలకు
అధీనులవుతున్నారు.
ఎన్ని పార్కులు, బృందావనాలు
నిర్మించుకొన్నా
కులం ముళ్ళ పొదలు మెదడుల్లో,
విశాల ప్రపంచాన్ని చూస్తున్న
సంకుచిత మానవస్వరూపం,
ప్రపంచం దగ్గరవుతున్న మాటనిజం
మనుషులు ఒకరికొకరు
దూరం అవుతున్న మాట నిజం
ఎత్తైన కట్టడాలు
మనసు ఇరుకైన గోడల్లో
వ్యక్తినిష్టం అవుతుంది.
పాత కట్టడాలు, కోటలు
దేనికి గుర్తుగా మిగిలాయి
నిర్బంధం అవుతున్న ప్రతి అంశం
స్వేచ్ఛ కోసం పోరాటం చేస్తుంది.
అమ్మాయిలూ, అబ్బాయిలు
అర్ధరాతిరిలో చిందులువేస్తే
తాగి, సిగార్లు కాలిస్తే
ఆనందం వస్తుందా!
ఆనందం నిజంగా ఎక్కడుంది?
వ్యక్తీకరణలోని తీవ్రతలో వుందా!
ఆత్మీయ అనుబంధాల్లో వుందా!
వీరు ఎవరిని ప్రేమిస్తున్నారు?
ఏమి కోరుకొంటున్నారు?
నిందిస్తున్న అంశాలనే
వీరు ఆహ్వానిస్తున్నారు
మనిషిని శరీర పరంగా చూసి
వ్యామోహపడే ఈ మృగరాయుళ్ళు
పగలు గొడుతున్న బూరలు ఎన్ని?
వివేచనను చంపడమే వినోదమా?
విద్యంటే తెగబలిసిన వికృతమా?
ధనం గడించడమంటే
వాటిని నిప్పుకణికలుగా మార్చుకొని
నెత్తిన పోసుకోవడమా?
గుర్తులన్ని గాయాలయితే
చరిత్రకు మిగిలేది నెత్తుటిగాథే గదా!
మనిషి నిద్రించడానికి ఒక యుద్ధం
మనిషి మేలుకోవడానికి యుద్ధం
సహజమైన ప్రకృతులన్నీ
ఘర్షణలోనే వున్నాయి
ముందు కొత్తయేరును
పారనివ్వండి,
దాన్ని జీవితానికి అన్వయించుకొని
కొత్త పంటలు పండిద్దాం

# సమాజానికి కావాల్సిన 'ఊతకర్రలు'




## చాతుర్య

గిరిజనుల బ్రతుకులు అల్లకల్లోల మవడం వల్ల ఏర్పడే రకరకాల పరిణామాల్నీ, అందుకు గల కారణాల్నీ మూలాల్నుంచీ ఎత్తిచూపడం శిరంశెట్టి కాంతారావు రచనల్లోని ప్రత్యేకత. కాంతారావు ఇప్పటివరకూ రాసిన 90 కథల్లో 30 కథలు గిరిజనుల జీవనశైలుల నేపథ్యంలో వారి బ్రతుకు వెతల్ని వ్యక్తపరుస్తూ రాసినవే. అలాగే ప్రపంచీకరణ ప్రభావంతో మార్పు వచ్చిన చేతివృత్తుల వారి వ్యథలను కూడా కథలుగా కళ్ళకు కట్టినట్టు చూపించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. శిరంశెట్టి కాంతారావు నాల్గవ కథా సంపుటి 'ఊతకర్రలు'లో 18 కథలున్నాయి. ప్రతీ కథా నడిచిన విధానం, నడిపిన తీరు ప్రశంసనీయం.

'నాన్న పోయింతర్వాత' కథ వదులయి కుదేలవుతున్న మానవ సంబంధాల్ని తేటతెల్లం చేస్తుంది. ఇందులో కొడుక్కి తల్లిదండ్రుల మీద ప్రేమ ఉన్నా దాన్ని వ్యక్తం చేయలేని పరిస్థితులు నాన్న చనిపోయిన తర్వాత అమ్మను వాళ్ళ ఊరికే వెళ్ళేలా చేస్తాయి. కథ ఇంతటితో అయిపోలేదు. తన కాళ్ళ మీద తను నిలబడటమే కాకుండా తనలాంటి వాళ్ళకు ధైర్యాన్ని ఇచ్చి వారి జీవితాలకో దీపం చూపెట్టిందామె.

'ప్రయాస' కథలో కుమ్మరి వృత్తి జీవనోపాధి కల్పించకపోయినా అయోధ్య దాన్ని విడవలేనంటాడు. కొడుకు వీరన్న మాత్రం స్వతంత్రంగా బొప్పాయి తోటల్ని సాగుచేసుకుంటూ అందులో నిష్ణాతుడయ్యి తండ్రికి మార్గదర్శకత్వాన్ని నిర్దేశిస్తాడు. కథ మధ్య మధ్యలో అయోధ్య సలహాలూ, సూచనలూ వీరన్నకు ముందుకు పోవడానికి శక్తి నిస్తుంటే, వీరన్న తెలివితేటలు అయోధ్యకు నమ్మకాన్ని కల్గిస్తాయి. కూటికి గతిలేని వాడు కళ్ళముందే అంచెలంచెలుగా ఎదిగితే భూస్వాములు ఎలా ఓర్వలేరో ఎల్లా గౌడ్ పాత్ర ద్వారా వివరించారు. చివర్లో అయోధ్య ఇచ్చిన ధైర్యం అనుభవానికీ, వీరన్న కసి పట్టుదలకీ సూచనలై కథను ముగించాయి. ఎన్ని కష్టాలు పడ్డా ఎవరో ఒకరి దాష్టీకానికి బలవ్వాల్సిందేనా? అంటే 'కాదు' అని వీరన్న పాత్ర ద్వారా అన్యాపదేశంగా సూచించారు.

సంపుటంలో మరో శక్తిమంతమైన కథ 'సమిధలు' తమ బ్రతుకేదో తాము బ్రతక్కుండాచేయడానికి సమాజంలో విచ్ఛిన్నకరశక్తులు ఎలా ప్రబలుతుంటాయో సాల్వాజుడుం సభ్యులు, పోలీసుల రూపంలో వివరించారు. 'గిరిజనులవ్వడమే తాము చేసుకున్న పాపమా?' అని అనుకోవడానికి కూడా వారికి సమయముండదు. 'అడవి జంతువులతోనే కాదు జంతువుల్లాంటి మనుష్యులతో కూడా అనుక్షణం యుద్ధమే' అనే భావన వారి నరనరాల్లోనూ పాకిపోయింది. కిర్మా, దుక్కే ఎంత ఆత్మవిశ్వాసంతో జీవిద్దామని అనుకున్నా యుద్ధం నుండి వేరుచేయలేని మనుగడ వారిని తిరిగి ప్రశాంతత లేని పరిస్థితుల్లోకి నెట్టేసాయి. అది ఎలా జరిగిందో యాసగడ్డల నేపథ్యంలో కథగా మలిచారు.

'అంతులేని పయనం' కథలో స్మశానికి వాచ్‌మేన్‌గా వుమెన్ సీతమ్మ కనపడటం, చివరికి విద్యుద్దహనవాటిక ప్రభావంతో సీతమ్మలాంటి చిన్న క్రిమికి ఆ ఉపాధి కూడా పోవడం, ఆఖర్లో ఒక హాస్పటల్లో ఆమె స్వీపర్‌గా మారడం... అన్ని ప్రపంచీకరణ పెనుభూతం శ్మశానాన్ని కూడా వదల్లేదా? అనిపించేలా చేస్తుంది. ఎటొచ్చీ ఆ భూతం దెబ్బకు బిత్తరపోయి బెదురుచూపులు చూసేది సామాన్య ప్రజానీకమే కదా!

'మూగజీవాలు' కథ జంతువుల కథ కాదు. నోరుండీ జరిగిందేమిటో చెబుతున్నా ఒప్పుని తప్పుచేసి నోళ్లని కూడా కుట్టివేసి మూగజీవాల్ని చేసిన నరజంతువుడి కథ ఇది. ధనంతో, మద్యంతో మనుష్యుల మానాల్ని వశపర్చుకుని అమాయకుల్ని ఎలా వంచింపచేయవచ్చో పున్నారావు పాత్ర ద్వారా స్పష్టంగా చూపారీ కథలో. దాంతోపాటూ టేకుచెట్లు మాయం చేయడమనే ప్రహసనమూ సమాంతరంగా నడుస్తుంది.

వయసు మళ్ళిన ఇద్దరు ఆలుమగల మధ్య 'బంధం' బీటలు వారకుండా అనుబంధమనే సంకెళ్ళు తొడిగి కథానాయకుడయ్యాడు కథలోని ఎస్సై పాత్రధారి. ఫ్లాష్‌బాక్ టెక్నిక్‌కు

# ఇవాళే అంకురిద్దాం


సూరారం శంకర్
9948963141

ఔను–
అక్కడ రాళ్ళు రవళించడం నిజం
సుత్తె తాలుకు స్పర్శకు
అక్కడ రాళ్ళు రవళించడమే కాదు
నర్తించడాన్ని సైతం నేను చూశాను
అలలు అలలుగా
శిల్పి మనోనేత్రం ముందు కదలాడే
సైద్ధాంతిక స్వప్నాల్ని
ఓ కలం కావ్యీకరించడాన్ని
నేను స్వయంగా సందర్శించాను.

* * *

అదిగో–
నూతన శకారంభ సూచనగా
ఓ కెరటం
చెదిరిపడ్డ దిక్కుల్ని జాగృతం చేస్తోంది

* * *



తప్పదు–
ఆ గ్రంథం ఆవిష్కరించబడాల్సిందే !
కోటి సూర్య ప్రభాసంజనితమైన
ఆ కవితాస్త్రం ప్రయోగింపబడటాన్ని
యావత్ ప్రపంచం హర్షించాల్సిందే !

* * *

ఓ పువ్వు నవ్వై పరిమళించటానికి
ఓ మేఘం పచ్చపచ్చగా
భూమాత గుండెలపై విస్తరించటానికి
నేనే కాదు –
నువ్వూ కారణం అవ్వాల్సి వుంది
లే...!
కనుకొలుకుల్లోని విషాదం
హృదయకలశం నిండా నింపుకున్న నా ప్రియ నేస్తమా !
మన జీవితాలని అలుముకున్న చీకట్లను త్రుంచటానికి
ఇవాళే అంకురిద్దాం !!

---

వెళ్ళకుండా కథను పాత్రల ఆలోచనలతో కొనసాగించడం కథకు నిండుదనాన్ని తీసుకొచ్చింది. ఒకరి ఆలోచన ముగిసిన తర్వాత వారి ఆలోచనను గ్రహించినట్టు దానికి కొనసాగింపుగా ఇంకొకరు ఆలోచన చేయడం అనే క్రియ చాలా బావుంది.

'ఊతకర్రలు' మానవత్వం మర్చిపోయిన మనుష్యుల పోకడల్ని చూపిస్తూనే, వాటికి ఎదురొడ్డి పోరాడిన వికలాంగుడు రజియాబేగంకు ఎలా ఊతకర్రగా నిలిచాడో చెప్పే కథ.

ఔషధ ప్రయోగ సంస్థలు గిరిజనుల జీవితాల్తో ఎలా ఆడుకుంటాయో 'గంధపు చెక్కలు' కథ చెప్తే, బాంక్ బాకీకి రెండు ఎద్దులూ కోల్పోవాల్సిన అంజమ్మ దయనీయగాథని 'కాడెద్లు– ఎకరం నేల'లో ప్రతిభావంతంగా చూపించారు.

ఇసుక ఆక్రమణల నేపథ్యంలో 'గట్టు తెగిన ఊరు' ఉద్యమిస్తే, కొడుకులు తల్లితండ్రులను పట్టించుకోకుండా వదిలేస్తే తానే వారికి దిక్కయ్యి. వారు మరణించాక పిండ ప్రధానానికి గయా వెళ్ళిన మల్లమ్మ అభ్యుదయానికి ప్రతీక అయ్యింది. 'కొత్తదారి' చూపింది.

భార్య చనిపోయినా బాధ్యతగా ఇద్దరు కొడుకుల్నీ, కూతుర్నీ పెంచి పెద్దచేస్తే, చివరికి వారే తండ్రిని అపార్థం చేసుకొనే పరిస్థితులు కల్పించినా అవి పెంటయ్యకు చివరి దశలో మంచే చేసాయి. స్వరాజ్యం రూపంలో, ' ఆ తలుపు లెప్పుడూ తెరిచే ఉంటాయి' కథలో.

కన్న కొడుకు విషయంలో 'పూసుగూడెం రాజులు' చేసిన త్యాగం విలువ కథ చదివితే తెలుస్తుంది. కార్పోరేట్ కళాశాల నేపథ్యంలో రాసిన మరో కథ 'ఒక్కడే చాలు'.

పొట్టు కుప్ప చేరవేసే పనితో జీవిస్తున్న యాకూబలీ పొట్టుపొయ్యిలు పోయి ఇంధన పొయ్యిలు వచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మరో వృత్తికి బదిలీ కావడంతో 'జీవితం మళ్ళీ మొదలయ్యింది.

దర్జీ పని ఉపాధి కల్పించలేని తరుణంలో స్వంత ఊరు ఫణిగిరి నుండి నగరానికి వచ్చి అద్దె ఇళ్ళల్లో పడేపాట్లు, ఖర్చులకు చాలీచాలని సంపాదన చివరికి స్వంత ఇంటి కోసం ప్రయత్నిస్తే అక్కడ పోలీసుల నుండి ఎదురైన వ్యతిరేకత బుగ్గయ్య గుంపునంతటినీ ఉద్యమించేలా చేసిన కథ 'ప్రవాహం'

ఆత్మవిశ్వాసం ఉంటే ఎన్ని అవాంతరాలైన అవలీలగా దాటవచ్చుని భీమక్క కోయాత్తూర్ బాటలో చేరింది. గిరిజనులను అక్షరాస్యుల్ని చేసేందుకు కోయభాషలో పుస్తకాల్ని రాసింది. వారి జీవితాల్లో వెలుగు నింపింది. ఇదీ 'కోయత్తూర్ బాట' కథ.

స్థూలంగా ఇవి కథలు. తనక్కావలసిన వస్తువు కోసం ఏ మారుమూల ప్రాంతానికైనా, అడవికైనా వెళ్ళి తిరిగి వెంటాడి వేటాడి సాధించుకుని కథా శిల్పాన్ని తనదైన శైలిలో చెక్కే నిరంతర కష్టజీవి – శిరంశెట్టి కాంతారావు. ఏ కథ తీసుకున్నా అందులో ఏదో ఒక సంఘటనగానీ, వర్ణన గానీ నిజజీవిత నేపథ్యంలోంచే తీసుకుని చిత్రించినట్టుగా కనపడతాయి కాంతారావు కథలు చదవితే.


'అలల తలలను చెరువుకట్ట డాల్ రాళ్ళకేసి బాదుకుంటుంది' లాంటి ఆకర్షణీయమైన వాక్యాలు, సిమిలీలు ఈ కథల సంపుటిలో చాలా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇవన్నీ నూతనత్వంతో కూడిన మానవత్వం ఉన్న మంచి కథలు. తప్పక చదివి తీరాల్సిన జీవితాలు.

## కవిత

# తలుపులు తెరిచి..


బివివి ప్రసాద్

9032075415

*1*

వెలుతురు కిరణాలని పూలరేకులుగా మలిచి
ఏ నీడలకీ వాడిపోకుండా అరచేతులలో కాపాడుకొన్నట్లు
ఆమెని పెంచారు ఆ అమాయక ప్రేమికులు ఆమె తల్లిదండ్రులు
మెరిసే కత్తిమొనకీ, మంచు బిందువుకీ భేదం తెలియని ఆమె
భ్రమలు చూపిన చీకటి స్వర్గంలోకి తటాలున జారిపోయింది
ఆమె తల్లిదండ్రులని చూసాను
అప్పటి నుండి చూస్తూనే ఉన్నాను
కాంతిలేని చూపులూ, ఉత్సవంలేని నవ్వులూ
ఎవరితో ఏమి మాట్లాడుతున్నా
ఆ మాటలన్నిటి వెనుకా ఆమెకోసం తెంపులేని వెదుకులాటా
ప్రతిదినమూ తెలియని వెలితిని నింపుకొనే దుఃఖమయ విఫలయత్నమూ
ఇప్పుడు వాళ్ళు మృత్యువు వెనుక నడుస్తుంటే
జీవితం దయగా వాళ్ళని అనుసరిస్తోంది
తమని తాము తప్పించుకొని దాక్కోవాలని
విరామంలేని పనుల్లోకి వాళ్ళని ఒంపుకొంటూనే ఉన్నారు
ఇవాళ ఎక్కడో పనిచేస్తున్న ఆమెని చూసాను
ఈ పగటి ఎండనిండా దుమ్మూ, జీవనవ్యాకులతల రొదా
పగటిలో సారాన్నీ, తాజాదనాన్నీ పోగొట్టుకొంటూ ఆమె
ఎన్నడూ లేనిది ఆమెపై కాస్తంత దయ కలిగింది

*2*

ఈ కథ ఏ మలుపు తిరగనుందో
కథ చివర ఎలాంటి చిరునవ్వులు ఉంటాయో మనకు తెలియదు
కానీ, పిల్లలు గొప్ప స్వర్గాన్ని రుచి చూపిస్తున్నపుడు
కాస్తంత జాగ్రత్తగా ఉండాలి
గొప్ప నరకం దానిని కాపలా కాస్తుందనే మెలకువ ఉండాలి
లోకంలో బలంగా వేళ్ళూనుకోవద్దు
కాస్తంత తేలికగా నీటిమీద నడిచినట్లు వెళ్ళిపోతూ ఉండాలని
మిత్రులకి చెప్పే నెపంతో నాకు చెప్పుకొంటాను చాలాసార్లు
పిల్లలు కావచ్చు, ప్రియమైనవి ఏమైనా కావచ్చు
వాటిని రానివ్వటానికి విశాలంగా తెరిచిన తలుపుల్ని
పోనివ్వటానికి కూడా విశాలంగా తెరిచే ఉంచాలనుకొంటాను
బహుశా, సుఖం వాళ్ళు రావటంలోనూ, దుఃఖం వాళ్ళు వెళ్ళటంలోనూ లేవేమో
తలుపులు తెరిస్తే లోనికి వచ్చిన వెలుతురునీ, సుఖాన్నీ
తలుపులు మూసి దాచుకోవాలని చూస్తున్నామేమో
బహుశా, మనల్ని వెలుతురు కిరణాలుగా మలుచుకొన్న జీవితం
మన అనుమతి లేకుండా తలుపులు తెరిచి
దాచుకోవటమే దుఃఖమనీ, తెరుచుకోవటమే సుఖమనీ మనచెవిలో
చెప్పబోతుందేమో

---



# రెక్కలు


బండి ప్రసాదరావు


**బూ**జు కర్ర
దులపలేదు
ఒంటికి
పట్టించుకుంది-
విప్లవఫలం
స్వార్థంహస్తగతం

**మొ**రగడం
వదిలింది
నాగరికత ముదిరి
పిలుస్తుంది -
హద్దులు మీరింది
నవలోకం...

**జీ**వితం
స్వల్పం
పరిమళం
అనంతం-
పూవువోలె
పరిమళించాలి

**ఉ**పాధులు
ఉద్దీపనలు
అర్థం
గ్రద్దల చేతుల్లో-
ప్రగతిపథంలో
పేదరికం పదిలం.

**త**క్కువ
మాట్లాడు
ఎక్కువ
పాటుపడు-
పలుకులు వ్యర్థం
చేతలే పరమార్థం

**వె**దకందే
దొరకదు
అడగందే
ఇవ్వబడదు-
సాధన, ప్రార్థనతో
వేదన దూరం.

వర్తమానం

# ప్రైవేటుకు దాసోహం ప్రజలకు కరెంటు భారం

**రాబోయే ఆర్థిక సంవత్సరంలో కరెంటు ఛార్జీలు 42 శాతం పెరగబోతున్నాయి. ఇది రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని పరిణామం 1998లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రారంభించినప్పుడు ప్రపంచబ్యాంకు సూచించిన కరెంటు ఛార్జీల పెంపు 15 శాతం. 2000 మే నెలలో 20 శాతం ఛార్జీలు పెంచారు. 2013-14 సంవత్సరంలో -1,03,535 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రంలోని వినియోగదారులకు అందించడానికి రూ. 49,189 కోట్లు అవసరమని డిస్కమ్‌ల అంచనా. ప్రస్తుతం అమలులో ఉన్న కరెంటు ఛార్జీల ద్వారా రూ. 30,582 కోట్లు వసూలవుతాయి. ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చే రూ. 5,882 కోట్లు పోగా మిగిలిన రూ. 12,725 కోట్లను కరెంటు ఛార్జీలను పెంచడం ద్వారా రాబట్టుకోవాలని ప్రతిపాదన.**



**ఎం. తిమ్మారెడ్డి**

ప్రధాని మన్మోహన్‌సింగ్ సమయం దొరికిన ప్రతిసారీ మన దేశంలో ఇంధనం ధరలు, వాటితోపాటు కరెంట్ ఛార్జీలను పెంచవలసిన అవసరాన్ని వక్కాణిస్తూనే ఉన్నారు. డిసెంబర్‌లో జరిగిన జాతీయ అభివృద్ధి మండలి (ఎన్‌డిసి) సమావేశంలోనూ, జనవరి 7న కొచ్చిన్‌లో పెట్రోలియం రిఫైనరీని ప్రారంభించే సందర్భంలోనూ ప్రధాని ఇదే చెప్పారు. అంతర్జాతీయ ధరలతో పోల్చితే మనదేశంలో బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు ధరలు తక్కువగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిసి ప్రజలలో అవగాహన పెంపొందించి ఇంధనాల ధరలు పెరిగేటట్టు, దానితో పాటు ప్రభుత్వాలపై సబ్సిడీల భారం తగ్గేటట్టు చూడాలన్నారు. మీరు కరెంటు చార్జీలను పెంచండి మిగతా విషయాలు నేను చూసుకుంటానని కరెంటు అధికారులకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అభయహస్తాన్ని అందించారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా!

రాబోయే ఆర్థిక సంవత్సరంలో కరెంటు ఛార్జీలు 42 శాతం పెరగబోతున్నాయి. ఇది రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని పరిణామం 1998లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రారంభించినప్పుడు ప్రపంచబ్యాంకు సూచించిన కరెంటు ఛార్జీల పెంపు 15 శాతం. 2000 మే నెలలో 20 శాతం ఛార్జీలు పెంచారు. 2013-14 సంవత్సరంలో - 1,03,535 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రంలోని వినియోగదారులకు అందించడానికి రూ. 49,189 కోట్లు అవసరమని డిస్కమ్‌ల అంచనా. ప్రస్తుతం అమలులో ఉన్న కరెంటు ఛార్జీల ద్వారా రూ. 30,582 కోట్లు వసూలవుతాయి. ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చే రూ. 5,882 కోట్లు పోగా మిగిలిన రూ. 12,725 కోట్లను కరెంటు ఛార్జీలను పెంచడం ద్వారా రాబట్టుకోవాలని ప్రతిపాదన. 2012-13 సంవత్సరానికి కరెంటు ఛార్జీలను 15 శాతం పెంచి రూ. 4,420 కోట్లు అదనపు ఆదాయం పొందేందుకు ఎపిఇఆర్‌సి అనుమతినిచ్చింది. దీనితోపాటు మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి ఎఫ్ఎస్ఎ రూపంలో దాదాపు రూ. 12,000 కోట్లు వినియోగదారుల నుంచి రాబట్టుకోవడానికి ఎపిఇఆర్‌సి ఇప్పటికే అనుమతులనిచ్చింది.. రాబోయే సంవత్సరానికి 42 శాతం ఛార్జీల పెంపు మూలిగే నక్కపై తాటిపండు పడడమే!

ఇంతకూ కరెంటు ఛార్జీలను పెంచవలసిన అవసరముందా? క్షుణ్ణంగా పరిశీలిస్తే లేదనే చెప్పాలి. అది ఎట్లంటే... పెరుగుతున్న ఛార్జీల భారం ముఖ్యంగా పెరుగుతున్న విద్యుత్ కొనుగోలు ఖర్చుల వలన ఉత్పన్నమవుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో విద్యుత్ కొనుగోలు ఖర్చు యూనిట్‌కు రూ 3.10 కాగా రాబోయే సంవత్సరంలో ఇది రూ. 4.07కు పెరగనున్నది. కెజి బేసిన్‌లో సహజవాయువు ఉత్పత్తి తగ్గి దిగుమతి చేసుకుంటున్న ఎల్ఎన్‌జి

మీద ఆధారపడడం వలన, దేశంలో తవ్వి తీస్తున్న బొగ్గు ధరలు పెరగడంతోపాటు ఖరీదుతో కూడిన విదేశీ బొగ్గు మీద ఎక్కువగా ఆధారపడడం వలన, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో రెగ్యులేటరీ కమిషన్ ప్రవేటు పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుండడం వలన విద్యుత్ కొనుగోలు ఖర్చులు పెరుగుతాయి. పెరుగుతున్న ఇంధనపుఖర్చుతో కరెంటు ఛార్జీలు పెను భారమవుతున్నాయి. డిస్కమ్‌లకు అవసరమైన రూ. 49,189 కోట్లలో రూ. 42,138 కోట్లు విద్యుత్ కొనుగోలుకే ఖర్చవుతుంది. ఇందులో రూ. 32,076 కోట్లు చర ఖర్చులు అంటే ఇంధన కొనుగోలు ఖర్చులు. ప్రభుత్వ విధానాల వలన ఇంధనం (బొగ్గు, సహజవాయువు) ధరలు పైపైకి పోతున్నాయి. జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రస్తుత సంవత్సరంలో చెల్లిస్తున్న ధరలను రాబోయే సంవత్సరంలో చెల్లించబోయే ధరలను పోల్చితే ఇది తేటతెల్లమవుతుంది.

పైన పేర్కొన్న జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన బొగ్గు సింగరేణి, కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఒరిస్సాలోని మహానది బొగ్గు క్షేత్రాల నుంచి సరఫరా అవుతుంది. ఈ కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ విధానాల వలన కొంత బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. విటిపిఎస్ ఇంధనం ఖర్చులు యూనిట్‌కు 30 శాతం పెరగగా ఆర్‌టిపిపి ఇంధనం ఖర్చులు 70 శాతం పెరగబోతున్నాయి.

దేశంలోని బొగ్గు కంపెనీల ఆర్థిక పరిస్థితి చూస్తే బొగ్గు ధరలను పెంచవలసిన అవసరం కనిపించదు. అయితే బొగ్గు డిమాండ్, లభ్యత మధ్యనున్న వ్యత్యాసాన్ని తగ్గించాలని, దేశంలోని బొగ్గు ధరలు అంతర్జాతీయ ధరలతో సమానంగా ఉంచాలని, బొగ్గు త్రవ్వకంలో కూడా ప్రైవేటు పెట్టుబడిని ఆహ్వానించాలని, ప్రస్తుతపు బొగ్గు ధరలు వారికి ఆకర్షణీయంగా లేవు కాబట్టి ఈ ధరలను పెంచక తప్పదని కేంద్ర ప్రభుత్వం ఈ విధాన నిర్ణయానికి వచ్చింది. గత కొద్ది కాలంలో బొగ్గు ధరలను 25 నుంచి 40 శాతం వరకూ పెంచారు. ధరలు పెంచడం వలన కోల్ ఇండియాకు 2011-12లో లాభాలు 64 శాతం పెరిగాయి. ఈ సంస్థ 2012-13 రెండవ త్రైమాసికంలో రూ. 3,078 కోట్ల లాభాలను ఆర్జించింది. గత సంవత్సరం ఇదే సమయంలో సంస్థ లాభాలు రూ. 2,593 కోట్లు. ఈ కాలంలో బొగ్గు ఉత్పత్తి 11 శాతం పెరగగా లాభాలు 19 శాతం పెరిగాయి. ఇదే విధంగా సింగరేణి కంపెనీ కూడా ప్రతి సంవత్సరం వందల కోట్ల లాభాలను ఆర్జిస్తున్నది. వీటి లాభాలను రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు పెరుగుతున్న కరెంట్ ఛార్జీల రూపంలో భరించవలసివస్తున్నది.

దేశంలో బొగ్గు కొరత ఉందన్న మిషతో కేంద్ర ప్రభుత్వం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గు వాడకాన్ని తప్పనిసరి చేసింది. దేశీయ బొగ్గుతో పోల్చితే దిగుమతి చేసుకున్న బొగ్గులో 80 శాతం ఎక్కువ నాణ్యత (మండించే గుణం) ఉంటుందని చెబుతుంటారు. అయితే దీని ధర స్వదేశీ ధర కంటే 300 శాతం అధికంగా ఉంటుంది. స్వదేశీ బొగ్గు ఒక టన్ను రూ. 3,000 కంటే తక్కువగా లభ్యం కాగా విదేశీ బొగ్గు ఒక టన్నుకు రూ. 9,000 వరకూ వెచ్చిస్తున్నారు. విదేశీ బొగ్గు వాడకం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరు, ఉత్పత్తి గణనీయంగా పెరిగిన సూచనలు కూడా లేవు. విదేశీ బొగ్గు దిగుమతి రాజకీయ నాయకుల జేబులు నింపడానికేనంటున్నారు.

*********************

**దేశంలో బొగ్గు కొరత ఉందన్న మిషతో కేంద్ర ప్రభుత్వం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గు వాడకాన్ని తప్పనిసరి చేసింది. దేశీయ బొగ్గుతో పోల్చితే దిగుమతి చేసుకున్న బొగ్గులో 80 శాతం ఎక్కువ నాణ్యత (మండించే గుణం) ఉంటుందని చెబుతుంటారు. అయితే దీని ధర స్వదేశీ ధర కంటే 300 శాతం అధికంగా ఉంటుంది. స్వదేశీ బొగ్గు ఒక టన్ను రూ. 3,000 కంటే తక్కువగా లభ్యం కాగా విదేశీ బొగ్గు ఒక టన్నుకు రూ. 9,000 వరకూ వెచ్చిస్తున్నారు. విదేశీ బొగ్గు వాడకం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరు, ఉత్పత్తి గణనీయంగా పెరిగిన సూచనలు కూడా లేవు. విదేశీ బొగ్గు దిగుమతి రాజకీయ నాయకుల జేబులు నింపడానికేనంటున్నారు.**

***********************

ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు నిక్షేపాలున్న దేశాలలో భారత్ ఒకటి. అయినా ఇక్కడ బొగ్గు ఉత్పత్తిని అదేపనిగా తొక్కి పెడుతున్నారు. 1997 నుంచి బొగ్గు గనులను ప్రైవేటు కంపెనీలకు కేటాయిస్తున్నారు. కోల్ ఇండియా సంస్థకు 60 బిలియన్ టన్నుల నిక్షేపాలు గల బొగ్గు గనులను కేటాయించగా అది ప్రతి సంవత్సరం 400 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నది. ప్రైవేటు కంపెనీలకు 40 బిలియన్ టన్నుల నిక్షేపాలు గల బొగ్గు గనులను కేటాయించగా వాటి ఉత్పత్తి 40 మిలియన్ టన్నులలోనే ఉంది. మన రాష్ట్రంలోని జెన్‌కోకు కేంద్ర బొగ్గు గనుల శాఖ 2005లోనే అనిసెట్టి పల్లి, పెనుకుల చిల్క, పెన్‌గడప, తాడిచెర్ల అనే నాలుగు బొగ్గు క్షేత్రాలను దాని స్వంత ఉపయోగానికై కేటాయించింది. సాధారణంగా 2008లోనే ఇక్కడ బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావలసి ఉంది. ఏడు సంవత్సరాల తరువాత కూడా ఎటువంటి పురోగతీ లేకపోవడం వలన కేంద్రం మొదటి మూడు క్షేత్రాలకిచ్చిన అనుమతులను రద్దు చేసింది. తాడిచెర్లకు సంబంధించి జెన్‌కోకు షోకాజ్ నోటీసును జారీ చేసింది.

సహజ వాయువుకు సంబంధించి కూడా ఇదే పరిస్థితి. రిలయన్స్ సంస్థ తాను కెజి బేసిన్‌లో ఉత్పత్తి చేస్తున్న

సహజవాయువును ఎక్కువ ధర సాధించడానికై ఇక్కడ ఉత్పత్తిని అదే పనిగా తగ్గిస్తూ వస్తున్నది. రెండు సంవత్సరాల క్రితం 60 ఎంసిఎండి సహజవాయువు ఉత్పత్తి కాగా అది ఇప్పుడు 25 ఎంసిఎండిలకు దిగజారింది. ప్రణాళికలననుసరించి ఈ ఉత్పత్తి యదార్థంగా 80 ఎంసిఎండిలకు చేరవలసి ఉంది. కొద్దికాలం క్రితమే ఈ ధరను ఒక ఎంబిటియుకు 2.5 డాలర్ల నుంచి 4.2 డాలర్లకు పెంచారు. అయినా ఇది రిలయన్స్ సంస్థను సంతృప్తి పరచలేదు. ఈ సంస్థ ఒప్పందం ప్రకారం త్రవ్వవలసిన సహజవాయువు ఆధారిత ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా ఇందులో 1,000 మెగావాట్లు కూడా పనిచేయడం లేదు. దీనివలన ఉత్పన్నమైన కొరతను తీర్చడానికి ఒక్కొక్క యూనిట్ రూ. 10 వరకు వెచ్చించి రూ. 6,008 కోట్ల ఖర్చుతో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆర్ఎల్ఎన్‌జితో విద్యుత్ ఉత్పత్తి చేయాలని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. కెజి బేసిన్‌లో సహజవాయువు ఉత్పత్తి తగ్గడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ చూపుతున్న కారణాలు నమ్మదగ్గవి కాదని కేంద్ర ప్రభుత్వ పెట్రోలియమ్ శాఖ, డైరెక్టర్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఏకంగా కేంద్ర ప్రభుత్వాన్ని కెజి బేసిన్ క్షేత్రాలను జాతీయం చేయాలని సూచించింది. ఇంత నష్టం వాటిల్లుతున్నా మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కరెంటు ఛార్జీల పెంపుతో ప్రజలపై భారం మోపడానికే తయారైంది. కానీ రిలయన్స్ నాటకంపై పల్లెత్తుమాట అనడం లేదు.

బొగ్గు, సహజవాయువుల లభ్యత, ధరల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తే ధరలను ఇంకా తగ్గించవచ్చు. ఇంధనపు ఖర్చులతో పాటు మన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) నిర్వాకం వలన స్థిర ఖర్చులు / పెట్టుబడి ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో కుదుర్చుకున్న లోపభూయిష్ట కరెంటు కొనుగోలు ఒప్పందాల (పిపిఎ) వలన ప్రతి సంవత్సరం మూడు నాలుగు వందల కోట్ల రూపాయల అదనపు భారం వినియోగదారుల మీద పడుతున్నది. దీనితోపాటు జెన్‌కోలో కొత్తగా నిర్మించిన యూనిట్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలూ ఛార్జీల పెంపునకు కారణమవుతాయి. విటిపిఎస్, ఆర్‌టిపిపి, కాకతీయ కొత్త యూనిట్లకు సంబంధించి కాగ్ జరిపిన పరిశీలనలో రూ 1,213 కోట్లు అదనంగా, అనవసరంగా ఖర్చు పెట్టినట్టు తేలింది. ఈ యూనిట్లకు సంబంధించిన పిపిఎలను మూడు సంవత్సరాల క్రితమే ఎపిఇఆర్‌సి అనుమతుల కొరకు సమర్పించారు. అయితే కమిషన్‌కు వాటివైపు చూసే తీరిక దొరకడం లేదు. అదే సమయంలో పవన విద్యుత్ ఉత్పత్తిదారులకు అనుకూలంగా రేటు నిర్ణయించడానికి తాము రూపొందించిన నిబంధనలనే తుంగలో తొక్కడానికి దానికి ఎటువంటి వెరపూ లేదు. ఇంతకుముందు పవన విద్యుత్ రేట్లను నిర్ణయిస్తూ 2009 మార్చి 31వ తేదీన కమిషన్ విడుదల చేసిన ఉత్తర్వులను పునః పరిశీలించమని కోరుతూ పవన విద్యుత్ ఉత్పత్తి దారుల సంఘం 2012 జనవరి 31వ తేదీన ఒక రివ్యూ పిటిషన్‌ను కమిషన్‌కు సమర్పించింది. కమిషన్ బిజినెస్ రూల్స్ ప్రకారం కమిషన్ ఉత్తర్వులిచ్చిన 90 రోజులలో రివ్యూ పిటిషన్ సమర్పించాలి. కొన్ని వందల రోజుల తరువాత సమర్పించిన పైరివ్యూ పిటిషన్‌ను స్వీకరించడమే కాక కమిషన్ వారు ఉత్పత్తి దారులకు అనుకూలంగా పవన విద్యుత్ ధరలను ఒక యూనిట్‌కు రూ. 3.50 నుంచి రూ. 4.70కు పెంచుతూ సరికొత్త ఆదేశాలను జారీ చేశారు. ఇక్కడ ఇంకా జుగుప్సాకరమైన విషయమేమంటే పవన విద్యుత్ ఉత్పత్తి సంఘం 2008లో ఏ సమాచారం సమర్పించిందో అదే సమాచారాన్ని 2012 లోనూ సమర్పించింది. ఒకే సమాచారం ఆధారంగా కమిషన్ ఒకసారి ఒక రేటును ఇంకోసారి వేరొక రేటును నిర్ణయించింది. ఇంతకు దిగజారిన కమిషన్ నుంచి రాష్ట్ర ప్రజలు న్యాయం ఆశించడం దుస్సాహసమే !

ఆంధ్రప్రదేశ్‌కు అందుబాటులో ఉన్న వనరుల నేపథ్యంలో డిస్కమ్‌లు ప్రతిపాదించిన 42 శాతం కరెంటు ఛార్జీల పెంపు అనవసరం కిరణ్‌కుమార్‌ల వంటి వారితో కూడిన మన్మోహన్ గణాల విధానాలే ప్రజలపై వచ్చి పడుతున్న పెను భారాలన్నింటికీ కారణం.

**(వ్యాసకర్త పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కన్వీనర్)**


| (చర ఖర్చులు (యూనిట్‌కు రూపాయిల్లో) | | |
|---|---|---|
| జెన్‌కో కేంద్రం | 2012-13 | 2013-14 |
| విటిపిఎస్-4 | 2.65 | 3.44 |
| ఆర్‌టిపిపి | 2.18 | 3.71 |
| కెటిపిఎస్-6 | 1.76 | 2.53 |
| కాకతీయ-1 | 1.75 | 1.86 |



**కవిత**

# పేపర్ బాయ్

ఎ.ఎ. నాగేంద్ర
9949358301



**మ**త్తులో ముంచిన నిద్రను ప్రక్కకు తన్నేసి
సమాచార శ్రామికుడిగా పైకి లేస్తాడు వాడు
సుఖదుఃఖాలు రంగరించిన
అక్షరసైన్యాన్ని వెంట బెట్టుకొని
అలసి నొప్పులతో ఉన్న సైకిల్ సహవాసంతో
తొలిపొద్దు తెరలు చీల్చుకుంటూ
అక్షర సుగంధాన్ని వీధుల గుండా
వెదజల్లుకుంటూ వెళుతాడు
కునుకు తీస్తున్న మా కాంపౌండులోకి
రబ్బరు రెక్కలు తొడిగిన పేపర్‌ను సంధించి
ముసుగు తీయని ముగ్గులతో ముచ్చట్లాడించేది వాడే
ఉన్న ఊరు విశేషాలేకాక, కనిపించని
ప్రపంచ వింతలు గురించి నాకుతెలియ జేయడమే కాక
వంటింట్లో వున్న మా ఆవిడకు
నోరూరించే వంటకాలతో పాటు
నోటిఫికేషన్లు గురించి తెలియజేసేది వాడే
దిండు కింద నుండి చూస్తున్న మా బుజ్జోన్ని
హాయ్‌బుజ్జీ అంటూ పలకరించి సోఫాలో ఉన్న నాన్నకి
వేడి వేడి రాజకీయ రుచిని అందించేది వాడే
మా ఇంటిల్లిపాదికీ కావలసిన సమాచారాన్ని
మోసుకువచ్చే విజ్ఞానపు గనివాడు
నా మస్తిష్కానికి అక్షరలేపనం చేసి
నన్ను జ్ఞానవంతున్ని చేసే బోధిసత్వుడు వాడు
ఇంతటి సమాచారాన్ని నాదరికి చేర్చే
పేపర్‌బాయ్ బిల్లుకోసం ఇంటికొస్తే
మాడిపోతున్న ఉప్మాను కలియబెడుతూ
మళ్ళీరమ్మంటుంది మా ఆవిడ
ఎన్నిసార్లు వెనక్కి పంపినా
అలసట చెందని అభాగ్యుడు వాడు
మౌనమేకాని, మాటలు కురిపించని
మా సీమ మేఘంలాంటి వాడు వాడు
బుద్దెప్పుడో బాగున్నప్పుడు బిల్లు చెల్లిస్తే
ఆనందంతో స్వీకరించే సహనవంతుడు వాడు.


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**

**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**



ప్రత్యేక తగ్గింపు!

అయిదేళ్లకు : రు. 500 /-
పదేళ్లకు : రు. 1000/-
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-



ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి!!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20

వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

# కొత్త పుస్తకాలు

## సమాంతర ఛాయలు



**ముప్వా శ్రీనివాసరావు కవిత్వం**

**వెల : రూ.200/- పేజీలు : 275**

**ప్రతులకు : 9948099900**

క్రాంతి అతికొద్ది కాలంలో కేవలం రెండు మూడు నెలల వ్యవధిలోనే పదునయిన వాక్యాల రహస్యం తెలుగుకొని, కవిత్వంలోకి చాలా వేగవంతమయిన అడుగులు వేశాడని చాలామంది కవిమిత్రులు విస్మయపడిపోతున్నారు. ఇప్పుడు – కవిత్వం గుట్టుమట్లు తెలియడానికి అనేక సంవత్సరాల శిక్షణా, పఠనమూ, అనేక పరిచయాల సమ్మేళనమూ అవసరమని భావించే విమర్శకులకు కూడా క్రాంతి వొక ఛాలెంజ్.

**-అఫ్సర్**

## మన విజయవాడ




**కవితా సంకలనం**

**చలపాక ప్రకాష్**

**వెల : రూ.50/- పేజీలు : 121**

**ప్రతులకు : రమ్యభారతి త్రైమాస పత్రిక**

మరి ఈనాటి కవులు మహానగరంగా అవతరిస్తున్న ఈ విజయవాడ పట్టణంపై ఏవిధంగా స్పదిస్తున్నారు? ఇక్కడే పుట్టి పెరిగి జీవనం సాగిస్తున్నవారు... ఇతర ప్రాంతాల నుండి వలసవచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్న కవులు ఈ నగరం గురించి అసలు ఏమనుకుంటున్నారు? నగరంపై వారికిగల అభిప్రాయం ఏమిటి? కవితల రూపంలో నేటితరానికి అందించడంతోపాటు.. రేపటి తరానికి ఈనాటి విజయవాడ నగర సామాజిక, రాజకీయ, ఆర్థిక సాహిత్య సాంస్కృతికరంగ ప్రగతిశీల ఉద్యమ పరిస్థితులను కవితా చిత్ర రూపంలో అందించాలనే ఆలోచనతో ఈ 'మన విజయవాడ' రూపకల్పనకి శ్రీకారం చుట్టడం జరిగినది. **- చలపాక ప్రకాష్**

## అలుగు




**కవిత్వం**

**పిట్టల శ్రీనివాస్**

**వెల : రూ.30/- పేజీలు : 56**

**9848968238**

ఎన్ని యుగాలు శ్రమించారో...?
ఎన్ని రాత్రులు నిద్రల్ని త్యజించారో...?
కాలే కడుపు వడికిన ఆకలి కేకల్ని అల్లికగా జేసి,
నగ్న దేహాల్ని కాపాడేందుకు మీరో వస్త్రంగా మారిపోయారు..
ఎన్ని ప్రయాసల కోర్చారో...?
ఎన్నెన్ని ప్రళయాలు చవిచూశారో గానీ...?
కొండంత జీవిత భారాన్ని కలిగి కూడా...
అగ్గిపెట్టెల్లో దూరే అద్భుత నైపుణ్యాన్ని సొంతం చేసుకొన్నారు.**పి. శ్రీనివాస్**

## రెండు రెమ్మలు




**కవిత్వంలో కథలు**

**ఎస్.ఆర్. పృథ్వి**


**వెల : రూ.40/- పేజీలు : 40**

**ప్రతులకు :** 9989223245

ఇందులో రెండు కథలు వున్నాయి. మొదటిది 2009 ఎలక్షన్ల సమయంలో వ్రాసింది. ఎన్నికలు సందర్భంగా చేతులు మారే నల్లధనాన్ని వస్తువుగా ఎంచుకుని వ్రాసిన కథ యిది. రెండవది మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఒకానొక అంశం కథా వస్తువుగా నిలిచింది. ఇది చాలా కాలం క్రిందట వ్రాసిందే. రెండు కథలూ ఊహాత్మకమే.

**- ఎస్.ఆర్. పృథ్వి**

## బాలగోపాల్




**అతడి అసలు పేరు స్వేచ్ఛ**

**చెరుకుమల్లి సింగా**


**వెల : రూ.10/- పేజీలు : 16**

**ప్రతులకు : 9177174389**

ప్రజాస్వామిక విలువలనూ తన భావజాలంలో భాగంగా చేసుకుని పాత అవగాహనను ఎప్పటికప్పుడు విస్తృత పరుచుకుంటూ వాటిని సామాజిక ఆచరణలోకి తెచ్చి మానవహక్కుల ఉద్యమంలో భాగంగా చేసిన వాడు బాలగోపాల్. సిద్ధాంత ఛాందసత్వం లేకుండా అన్ని రకాల ప్రజాస్వామిక విలువలకూ మనసు ద్వారాలను చివరి వరకూ తెరచి వుంచిన అసామాన్య సామాన్యుడు బాలగోపాల్.

**– జి.యస్. నాగేశ్వరరావు**

## కవిత్వం ఓ సామాజిక సంస్కారం




**ఆధునిక కవిత్వంలో వస్తు, వైవిధ్య విశ్లేషణ**

**డాక్టర్ రాధేయ**

**వెల : రూ.120/- పేజీలు : 216**

**ప్రతులకు : 27630013**

తెలుగులో నిస్సందేహంగా ఇటువంటి ప్రయత్నం ఇంతకుముందు జరగలేదు. ఒక వస్తువు మీద వేర్వేరు స్పందనను కొలుస్తూ పత్రికల్లో అప్పుడప్పుడు వ్యాసాలు రావడం మొదటి నుంచీ ఉంది కానీ, దాన్నొక నియమంగా పెట్టుకొని వీలైనన్ని ఇతివృత్తాల మీద తెలుగు కవుల స్పందనను పరంపరగా, వ్యాసాలుగా రాసి అచ్చువేయడం ఇదే మొదటిసారి. ఈ ప్రయత్నం తొలిసారి చేస్తున్న రాధేయను అభినందించాలి.

**- కొప్పర్తి**



*

# కొత్త పుస్తకాలు

## పూదోట

(గేయ, వచన కవితా సంపుటి)

చీపెల్లి బాపు

వెల : రూ.80/- పేజీలు : 154

ప్రతులకు : 9849863034




ఒక భూమికను పట్టుకొని పయనిస్తూ ఉనికిని చాటుకోవాలనే ఉత్సాహం ఈ కవికి లేదు. ఎవరో ఏమో అనుకుంటారనే భయము లేదు.తాను ఏమి చెప్పాలనుకున్నాడో దానిని నిర్భయంగా చెప్పాడు. మనిషి చేసే మొత్తం జీవన ప్రయాణంలో స్పృశించే ప్రతి ఒక అంశాన్ని తన కవితా వస్తువుగా స్వీకరించాడు, దాన్ని ప్రేమించాడు, లాలించాడు.

**- మునిమడుగుల రాజారావు**

## పని పాటలు

పిల్లల కోసం

డా॥ వి.ఆర్. రాసాని

వెల : రూ.60/- పేజీలు : 60

ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్




పనిపాటలు కొన్ని, పనిచేస్తూ శ్రమించేటప్పుడు పాడేవి కాబట్టి వీటిని శ్రామిక గేయాలుగా కూడా పిలుస్తారు. వ్యవసాయ రంగంలో వివిధ రకాలైన పనులు చేసేటప్పుడు, బరువులెత్తేటప్పుడు, చాపలు బుట్టలు అల్లేటప్పుడు, బట్టలు ఉతికేటప్పుడు రకరకాల పాటలు పాడుకుంటారు. ఇవన్నీ పని పాటలే. వాటిలో కొన్నింటిని గురించి ఈ పుస్తకంలో చదువుకొంటారు. ఈ పాటలు తెలుగుజాతి జీవనం అంతా కళ్లకు గట్టేట్లుగా చూపుతాయి.

– ప్రచురణకర్త

## నోముల పురస్కార కథలు

డాక్టర్ ఎన్.ఎస్. రాహుల్

వెల : రూ.80/- పేజీలు : 134

ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ




నోముల సత్యనారాయణ పేరున కథా పురస్కారాలు అందించాలన్న లక్ష్యంతో ఆయన కుటుంబసభ్యులం నోముల సాహిత్య సమితిని 2010లో ఏర్పాటు చేసినాము. ప్రతి ఏటా ఐదు తెలుగు ఉత్తమ కథలకు నగదు, పురస్కారం అందించాలని తలపెట్టినాము. ప్రతి రెండేండ్లకు పురస్కార కథలను పుస్తకంగా వెలవరించాలని కూడా అనుకున్నాము. అనుకున్నట్లుగానే 2010, 2011లో పురస్కారాలను అందించినాము. ఈ రెండేండ్ల కథలను 'నోముల పురస్కార కథలు' పేరుతో పుస్తకంగా ముద్రించి 2012 కథాపురస్కార ప్రధాన సభలో ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాము.

**- ఎలికట్టె శంకర్‌రావు**

## గుడు గుడు కుంచం...

(బాలల గేయాలు)

వేటూరి ప్రభాకరశాస్త్రి

వెల : రూ.75/- పేజీలు : 75

ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్




మన జానపద గేయాల్లో పిల్లలకు ఆటలకు తగ్గ పాటలెన్నో మరుగునపడి ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తెలుగు భాషా పరిశోధకులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి త్రవ్వితీశారు. ఎన్నడో మరుగున పడిపోయిన ఆ పుస్తకం ఇప్పుడు మళ్ళీ వెలుగు చూస్తున్నది. ఈ పాటలలో మంచి మంచి తెలుగు పలుకుబడులున్నాయి. తెలుగువాళ్ళ సంస్కృతిని తెలిపే విశేషాలున్నాయి. సంగీత పద్ధతులున్నాయి. నీతి నిధులున్నాయి. సంగీత పద్ధతులున్నాయి. సాహిత్యపు పరిమళాలున్నాయి. విజ్ఞాన కాంతులున్నాయి.

– ప్రచురణకర్తలు

## ఊతకర్రలు

శిరంశెట్టి కాంతారావు కథలు

శిరంశెట్టి కాంతారావు

వెల : రూ.125/- పేజీలు : 196

ప్రతులకు : 9849890322




కథను సాకుగా తీసుకుని ఇతరేతర విషయాలు, తనకు తెలిసిన, తను చెప్పదల్చుకున్న విషయాలు చెప్పకుండా నిగ్రహం పాటించారు. పాత్ర వృత్తిని ప్రవృత్తిని చాలా వాస్తవికంగా వర్ణించారు. పాఠకుల సానుభూతి సంపాదించటానికి అనవసర ప్రయాస పడలేదు. పాఠకులను ప్రయాస పెట్టలేదు. భాష విషయంలోనూ రచయితను అభినందించాలి. మాండలికాన్ని పాత్రలకు వాడుతూ, అన్ని ప్రాంతాలవారికి తేలికగా ఉండే భాషలో కథ నడుపుతూ మంచి వ్యూహాన్నే ఎంచుకున్నారు.

## నా చిన్నతనంలో ...

మోహన్‌దాస్ కరంచంద్ గాంధి

తెలుగు అనువాదం : బద్దెపూడి రాధాకృష్ణమూర్తి

వెల : రూ.60/- పేజీలు : 67

ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్




భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనకు దిశానిర్దేశం చేసిన మహాత్మాగాంధి. దురలవాట్లు మంచిది కాదని గ్రహించి ఎలా తప్పును సవరించుకున్నాడు? హరిశ్చంద్రుని వలె అందరూ సత్యసంధులుగా ఉండాలని ఎందుకు కోరుకున్నాడు? అహింసా ధర్మం గురించి ఎలా గ్రహించగలిగాడు? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానమే ఈ అమూల్యమైన పుస్తకం.

**- ప్రచురణకర్త**




**- ఓల్గా**

## కవితలు

### మాతృ హరితం

సాహిత్య ప్రకాశ్

9492530542




నిన్న మొన్నటిదాకా
ముద్దులొలికే పాపాయి బోసి నవ్వులా
మొక్కవోని ఆత్మవిశ్వాసంలా
పరిమళాల పూలగుత్తులతో
వేనవేల పత్రహరితాలతో
అలరారిన ఆకుపచ్చని చెట్టులా నేను
కానీ నేడు ?!
రెక్కలన్నీ విరిగిపోయి
డొక్కలన్నీ ఎండిపోయి
పెదాలపై మాయమైన నవ్వుతో
చిక్కిశల్యమైన శరీరంతో
అనుభూతి ఆకుల్ని రాల్చేసుకుంటూ
మోడువారిన చెట్టునయ్యాను
కారణం చెబితే
కారుణ్యంతో కన్నీళ్ళు పెట్టుకుంటారో
కాఠిన్యంతో తేలిగ్గా కొట్టి పడేస్తారో -
మీరెలా అనుకున్నా నేను చెప్పి తీరాలి
నా గుండె బరువు దించుకోవాలి
అమ్మను కోల్పోవడం జరిగాకే
నేను నేనుగా వుండలేకపోయాను
నన్ను నేనుగా ఓదార్చుకోలేకపోయాను
అమ్మ విలువ, పోగొట్టుకున్నాకే తెలిసొచ్చింది
పంచభూతాలకు ప్రతిరూపం అమ్మ !
పంచామృతాల మాధుర్యం అమ్మ !
అమ్మంటే - పాలకుండ, వెండికొండ
అమ్మంటే -
ప్రాణవాయువు, ప్రేమఆయువు
కట్టుకున్న భార్య, కన్నబిడ్డలూ
అంతులేని మమకారం పంచుతున్నా,
అమ్మగోరు ముద్దల కమ్మదనం
ఆమె ప్రేమచూపుల చల్లదనం
ఎవ్వరూ అందించలేరు
అమ్మంటే-
దేవతామూర్తి ఆకారం, నిలువెత్తు నిర్మల ప్రాకారం !
మిత్రులారా !
లేక్కలేని తనంతో, నిర్లక్ష్యంతో
వృద్ధాప్యంలో అమ్మని ఒక పనికిరాని వస్తువులా
మూలనపడేయకుండా
అప్పుడప్పుడైన పలకరించకుండా
ఆమెను దుఃఖనదిని చేయకండి
బతికుండగానే బతుకమ్మలాంటి అమ్మ మనసును
తూటాల్లాంటి మాటలతో తూట్లుపొడవకండి
మాతృహరితపు పుత్రలోకంలో
మీకు మీరే చరిత్ర హీనులుగా మిగిలిపోకండి.

---

### రెక్కలు

గోపాలుని వెంకటేశ్వర్లు

9247234991



తప్పు చేస్తే
అంతరాత్మ
నిరంతరంగా
ప్రశ్నిస్తూనే ఉంటుంది-

నీవు ఒకరు కాదు
ఇద్దరు

ఒత్తిళ్ళు
ఆటుపోట్లు
పెనుతుఫానులు
గాఢాంధకారాలు-

క్షణాలు
కదిలే కాలనాగులు

అంతులేని
సంఘర్షణలతోనే
బతుకు
రాలిపోతుంది-

జీవితం
ఎండుటాకుల చెట్టు

ముసలి వాళ్ళ
మోహాల్లో
ముడతలుగా
ఇమిడిన అనుభవాలు.

మారే ఆకారం
అనుభవాలకు సూచిక

సమస్యలు
ఒంటరిగా కాదు
గుంపులుగా వచ్చి
మీద పడొచ్చు-

జీవితం అంటే
విషాదం కాదు పోరాటం

దుఃఖ నేత్రాలతో
ప్రపంచాన్ని సందర్శించడం కాదు
చిరునవ్వుల పువ్వుల్ని
రువ్వుతునే ఉండాలి-

రోజూ ఏడుస్తూ
బతికే బతుకు బతికేనా ?

నిరాశా
ఊబిలోకి
జారిపోకుండా ఉండాలంటే
ఏమరు పాటుగా ఉండాల్సిందే-

దుఃఖసాగరం లోతులతో
ఈదగలమా!

నిప్పునల
మాటేమోగాని
దిగమింగే పాములు
ఖచ్చితంగా ఉంటాయి-

జీవితం
సర్పలోయ

## డైరీ

# సామాన్యుల చైతన్యానికి చోదకశక్తి

సామాన్యుల చైతన్యానికి చోదకశక్తిగా ముప్వా శ్రీనివాసరావు కవిత్వం ఉపయోగపడుతుందని సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఫిబ్రవరి 6న కవి సీతారాం అధ్యక్షతన ముప్వా శ్రీనివాసరావు రాసిన సమాంతర ఛాయలు పుస్తకావిష్కరణ సభ జరిగింది. స్థానిక ఎమ్మెల్యే తుమ్మల



**ఖమ్మంలో ముప్వా శ్రీనివాసరావు కవితా సంపుటి 'సమాంతర ఛాయలు' పుస్తకావిష్కరణ దృశ్యం**

నాగేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ-పుస్తకాన్ని మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు. అనంతరం ముప్వా శ్రీనివాసరావు తన తల్లిదండ్రులైన ముప్వా శ్రీ రంగయ్య, పద్మావతిలకు తొలి ప్రతులను అందజేశారు. పద్యాలు రాయించిన గురువులు గంగాధర్‌రావు, ప్రసాద్‌రావు పులిచర్ల వసంతంను ఈ సందర్భంగా సన్మానించారు. సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ ఎక్కడ బలమైన ఉద్యమాలుంటాయో అక్కడే బలమైన కవిత్వం కూడా వస్తుందన్నారు. భౌగోళికంగా, రాజకీయంగా ఖమ్మజిల్లా ఉద్యమాల జిల్లా కావడంతో ఈ గడ్డపై బలమైన కవులు, కవిత్వం నిరంతరంగా వస్తుందన్నారు. శ్రీనులో మొదటి నుండి కవిత్వం సమాంతరపాయగా అంతర్లీనంగా వచ్చిందని, అది ఇప్పుడు బయట పడిందని అన్నారు. మున్ముందు మరింత ప్రజా కవిత్వాన్ని తీసుకురావాల్సిన అవసరముందన్నారు. శ్రీశ్రీ ప్రేరణతో కవి కావాలని ఆకాంక్షించిన వ్యక్తి ముప్వా శ్రీనివాసరావు అని తెలుగు విశ్వ విద్యాలయం ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అన్నారు. కవులను మరిచిపోతున్న కాలంలో, సాహిత్యం అంటే సినిమా పాటలే అనుకునే ఈ రోజుల్లో ఇలాంటి కవిత్వం రావడం గర్వించదగిందన్నారు. మానవ సంబంధాలను కాపాడుకునే ప్రయత్నమే సమాంతర ఛాయలు అన్నారు. రచయిత రావులపాటి సీతారామరావు మాట్లాడుతూ క్రాంతి నుండి కవితలు జాతి జనులు పాడుకునే విధంగా రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ జాతి సిగ్గుపడే విధంగా తయారైన మృగాల గురించి ప్రశ్నించారని, తన అనుభవాలకు అనుభూతులకు అక్షర రూపం ఇచ్చారని అన్నారు. కవి, గాయకుడు జయరాజు మనస్సు పడుతున్న ఇబ్బందులను తన పాట ద్వారా వినిపించారు. గొరటి వెంకన్న మాట్లాడుతూ ఎర్రజెండాను నమ్మిన శ్రీను తన కవిత్వాన్ని అనుభూతితో రాశాడన్నారు. ఎం.ఎల్.ఏ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముప్వా శ్రీనివాసరావు ఏ రంగంలో ఉన్నా తనదైన పద్ధతిలో ఆ రంగాలను అధిరోహించారన్నారు. నష్టాలను, కష్టాలను ఎదుర్కొని కవులు ముందుకు పోవాలన్నారు. మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టు అయిన ప్రతివాదూ మానవతావాది అయి తీరాలన్నారు. ఖమ్మం ఉద్యమాల గడ్డ అని, అందుకే శ్రీను ఉద్యమ సంప్రదాయలను తన కవితల ద్వారా చెప్పాడని అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రవిమారుత్, కవులు ఖాదర్ మొహియుద్దీన్, 10 టీవి సిఇవో అరుణ్‌సాగర్, కె. ఆనందాచారి, జి ప్రసేన్, యాకూబ్, బివివి ప్రసాద్, చేకూరి కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్గబట్టిన హృదయ స్పందన 'సమాంతర ఛాయలు'

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు కె. ఆనందాచారి అధ్యక్షతన 'సమాంతర ఛాయలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కవి కె. శివారెడ్డి 'సమాంతర ఛాయలు' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ పుస్తక రచయిత ముప్వా శ్రీనివాసరావు మనసులో గూడు కట్టుకున్న 93 కవితలు 200 పేజీల్లో పరుచుకున్నాయని, అందులోని ఒక్కో కవిత ఒక్కో అంశాన్ని



**హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'సమాంతర ఛాయలు' పుస్తకావిష్కరణ సభ**

స్ఫురింపజేస్తుందని తెలిపారు. 1975 నుంచి నేటి వరకు సమాజంలో పరుచుకున్న కాలాన్ని కవిత్వంగా ఆయన చెప్పిన తీరు ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. సాహిత్యప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాంతర ఛాయల్లో కఠోర జీవిత సత్యాలున్నాయని,... ఆశయ బలం ఉందని చెప్పారు. ఒక్క పిడికిట్లో నగరాన్ని.. పల్లెను పట్టుకున్న కవిత్వం ముప్వా కవిత్వమని కొనియాడారు. సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ మనిషిని మనిషికి దగ్గర చేయడం, జీవితాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళిన కవిత్వం సమాంతర ఛాయల్లో ఉందని కొనియాడారు. 10టీవీ సిఇఒ, కవి అరుణ్‌సాగర్ మాట్లాడుతూ సమాంతర ఛాయలు కవిత్వం జీవిత చిత్రాలను చూపిస్తోందన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం మాట్లాడుతూ గుర్తింపు రాజకీయాలు ఆగిపోయిన చోట క్రాంతి శ్రీనివాసరావు కవిత్వం ప్రారంభమయ్యిందని అన్నారు. కవి యాకూబ్ మాట్లాడుతూ ల్యాప్‌టాప్‌లో కవిత్వం రాస్తున్న క్రాంతి శ్రీనివాసరావుకు ఆన్‌లైన్‌లో కవిసంగమం వేదిక లభించిందని అన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి వొరప్రసాద్ స్వాగతం పలుకగా, తంగిరాల చక్రవర్తి వందన సమర్పణం చేశారు. నాగశిరీష ఆలపించిన లలితగీతం సభికులను అలరించింది. కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## జనఘోష కవిసమ్మేళనం

కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెజనం బాధల ఘోష అనీ, అది కార్మికుల సమస్యలపైనే కాదు, దేశ పరిరక్షణ కోసం జరుగుతున్న చారిత్రాత్మక సమ్మెగా చూడాలనీ సాహితీవేత్త ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాశ్చ్య కళాశాల మాజీ ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయ సంఘం నేత మోతుకూరి నరహరి అన్నారు. ఫిబ్రవరి 18న సాహితీ స్రవంతి హైదరాబాద్ నగర కమిటి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయాబుల్లాఖాన్ హాలులో జి. నరేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో నరహరి మాట్లాడారు. ప్రజాస్వామిక ప్రేమికులు, పురోగామి సెక్యులర్ శక్తులు, బుద్ధిజీవులుగా ఉన్న కవులు, రచయితలు కళాకారులు, పాలక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనను, కవిత, పాట, కథ, నిరసనగళం, తమ కలాల ద్వారా బలమైన అభివ్యక్తితో వినిపించాలని నరహరి అన్నారు. ప్రాచీన కవులైన వ్యాస వాల్మీకుల దగ్గర నుండి గురజాడ, శ్రీశ్రీ, వేమన, దాశరథి, కాళోజి, సుబ్రహ్మణ్య భారతి లాంటి కవులు ప్రజాపక్షం వహించి, అద్భుతమైన కవిత్వం రాసారని, 24 నెలల్లో 18 సార్లు పెట్రోలు, డీజిల్ ఛార్జీలు పెంచిన పాలకులపై ధర్మాగ్రహాన్ని "కవులు" ప్రకటించేందుకు ఈ జనఘోష" జనకవనం ఏర్పాటు అని మోతుకూరి నరహరి తన ప్రసంగంలో పేర్కొన్నారు. నాటి కవుల స్పందనలు, ప్రజాస్వామిక భావజాలంతో పాలక వర్గాల్ని ఎలా పద్యాల్లో, కవితల్లో



హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన 'జనఘోష'కవిసమ్మేళనంలో ప్రసంగిస్తున్న సాహిత్యవేత్త మోతుకూరి నరహరి

ఎండ కట్టారో సాహితీ స్రవంతి నగర ఉపాధ్యక్షులు గేరా సారథ్యంలో జరిగిన జనకవనంలో 20 మందికి పైగా కవులు కవితలు వినిపించారు. పి.వి. సుబ్రహ్మణ్యశాస్త్రి దేశభక్తి గీతంతో (మాతెలుగుతల్లికి మల్లెపూదండ) ఆరంభమైన జనకవనంలో తంగెళ్ళపల్లి కనకాచారి, మోపిదేవి రాధాకృష్ణ, ఆచార్య నరేంద్ర, డి. సైదులు, వెంకటి, జి. నరసింహమూర్తి, శిష్టా మాధవి, శాంతిశ్రీ, గేరా, వొరప్రసాద్, తంగిరాల చక్రవర్తి, జి. యాదగిరిరావు, నరేష్, మొదలైనవారు స్వీయకవితలు వినిపించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కె. లక్ష్మయ్య పాల్గొన్న ఈ సభలో సాహితీస్రవంతి హైదరాబాద్ నగరకమిటి కార్యదర్శి జి. యాదగిరి రావు ఈ సభకు స్వాగతం పలుకగా, సంయుక్త కార్యదర్శి తంగిరాల చక్రవర్తి వందన సమర్పణతో సభ ముగిసింది.

## విజయనగరంలో మాతృభాషా దినోత్సవం

అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 21న సాహితీస్రవంతి విజయనగరం ఆధ్వర్యంలో గురజాడ నిలయంలో సాహిత్యసభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు సాహితీస్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ సమాజంలో సమూహాలుగా జీవించిన తరుణంలో సామూహిక శ్రమనుండి భావ ప్రకటనా మాధ్యమంగా భాష ఉద్భవించిందని అన్నారు. ప్రతీ భాష ఇతర భాషల నుండి నానుడుల్ని, జాతీయాల్ని, నుడికారాన్ని గ్రహించి నిరంతరం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని భాషలకు సమాన హోదా ప్రభుత్వాలు కల్పించాలని అన్నారు. ప్రపంచ రాజకీయాల ఫలితంగా కొన్ని భాషలు ఆధిపత్య ధోరణి వహించడం జరిగిందని, ఆంగ్లభాష ఆ కోవకు చెందిందని అన్నారు. ఈ సందర్భంగా బాలాజీరావు తెలుగుభాష ఔన్నత్యాన్ని పద్యరూపంలో ఆలపించారు. బద్రి కూర్మారావు తెలుగుభాష చరిత్రను, లిపిలేని భాషల ప్రాధాన్యతను వివరించారు. సాహితీస్రవంతి కార్యకర్త ఎస్.వి.ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ తెలుగుభాష ప్రాభవం కోల్పోతున్నదానికి నిదర్శనమైన గణాంకాలను వివరించారు. అనురాధ, మొయిద శ్రీనివాస్, చెళ్ళపల్లి శ్యామల, మానాపురం చంద్రశేఖర్, రెడ్డి శంకరరావు, విజయేశ్వరరావు, ఇల్ల ప్రసన్నలక్ష్మి తదితరులు మాతృభాష ప్రాధాన్యతను చర్చించి, తమ స్వీయ కవితల్ని వినిపించారు. చీకటి చంద్రికారాణి 'అక్షరాలు ఈ అచ్చతెలుగుభాషకు/అఆఇఈలు తొలి నక్షత్రాలు' అంటూ గానం ఆలపించారు. హృషీకేశం, బొంతలకోటి లలిత, ఇనుగంటి జానకి తదితరులు చర్చలో పాల్గొని, తమ కవితలు వినిపించారు.

## రమణ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు

ప్రముఖ కవి, రచయిత, అధ్యాపకుడు డా. కెఎస్.రమణ మృతి తెలుగు సాహితీ రంగం, తెలుగు భాషకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. కెఎస్. రమణ మిత్రబృందం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డా.కెఎస్. రమణ జ్ఞాపకాలు పేరిట సంస్మరణ సభ జరిగింది. పలువురు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో రమణ రచించిన 'జడి' కవితా సంపుటి అనేకమందిని ఆలోచింపజేసిందన్నారు. సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధిపతిగా తెలుగుభాష వికాసం కోసం రమణ తోడ్పాటునందించారని అన్నారు. ఈ సభలో సాహితీస్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి, కుప్పిలి పద్మ, సాహితీవేత్తలు ఎన్ వేణుగోపాల్, తుమ్మల రామకృష్ణ, సౌభాగ్య, గుడిపాటి, ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రస్థానం పత్రికకు కూడా రమణ పలు రచనలు అందించారు.



ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో ఆ.ప్ర. హిందీ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సభలో కవి తాళ్లపల్లి మురళీధర గౌడ్ తెలుగు కవితల హిందీ అనువాద కవితా సంపుటి "ఇతిహాస్‌కే ఖండ్‌హారోయ్"ను ఆవిష్కరిస్తున్న హిందీ అకాడమి పూర్వాధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. చిత్రంలో ఆచార్య ఎం. వెంకటేశ్వర్, అనువాదకర్త శాంతసుందరి, మురళీధరగౌడ్ డా॥ సివిఎస్ఎన్‌శర్మ.




జనవరి 26న 'రమ్యభారతి' ఆధ్వర్యంలో జరిగిన 'కోస్తాంధ్ర కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం' పుస్తకావిష్కరణ. చిత్రంలో మందరపు హైమవతి, ఆల్సి నాగేశ్వరరావు, గుమ్మా సాంబశివరావు, చలపాక ప్రకాష్



"జుమ్మా" పుస్తకానికి ప్రకటించిన "డాక్టర్ కవిత యువ సాహితీ పురస్కారా"న్ని 10-02-13వ తేది కడపలో అందుకుంటున్న వేంపల్లి షరీఫ్. అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ నటుడు కవి రంగనాథ్ ముఖ్య అతిధిగా హాజరై అవార్డు ప్రధానోత్సవం చేసారు సంస్థ నిర్వాహకుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి ఈ అవార్డుల ద్వార యువతను ప్రోత్సహించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు.

## FORM IV

(Rule 8)

**UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867**
**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS**
**ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM**

| | | |
|---|---|---|
| **1. Place of Publication** | : | **Hyderabad** |
| **2. Periodicity of its Publication** | : | **Monthly** |
| **3. Printer's Name** | : | **V. Krishnaiah** |
| **1 (a) Whether a citizen of India** | : | **YES** |
| **(b) If a foreigner, the country of origin** | : | **-** |
| **Address** | : | **H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **4. Publisher's Name** | : | **V. Krishnaiah** |
| **1 (a) Whether a citizen of India** | : | **YES** |
| **(b) If a foreigner, the country of origin** | : | **-** |
| **Address** | : | **H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **5. Editor's Name** | : | **TELAKAPALLI RAVI** |
| **Nationality** | : | **INDIAN** |
| **1(a) Whether a citizen of India** | : | **YES** |
| **(b) If a foreigner, the country of origin** | : | **-** |
| **Address** | : | **H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **6. Name and addresses of owner** | : | **V. Krishnaiah** |
| **1(a) Whether a citizen of India** | : | **YES** |
| **(b) If a foreigner, the country of origin** | : | **-** |
| **Address** | : | **H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**Sd/**
**V. KRISHNAIAH**
**Publisher**

**Date: 28.02.2013**



జనవరి 23. త్యాగరాయగాన సభలో గురజాడ కళావేదిక నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్117వ జయంతిలో గుంటూరు శివరామకృష్ణ రచించిన 'ఉదయ కిరణాలు' ఆవిష్కరణ సభలో తంగిరాల చక్రవర్తి, ప్రొ.బి. జయరాములు, ముఖ్య అతిథి బైస దేవదాస్, ఆవిష్కర్త డా॥ పోతుకూచి సాంబశివరావు, రచయిత జి. రామకృష్ణ, అధ్యక్షులు సుధామ, గురజాడ విజయశ్రీ, అప్పారావు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# రాయప్రోలు సుబ్బారావు


13.03.1892 –30.06.1984



భావ కవిత్వ ఆద్యుడు. ప్రబోధ కవిత్వ మార్గదర్శి, కవితాంజలి, జడకుచ్చులు, రమ్యాలోకం, ఆంధ్రావళి, లలిత, కష్టకమల వగైరా కావ్యాలు రాశారు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, ఫోన్: 040-27660013 27608107, ఫ్యాక్స్: 04027635136

**If Un delivered please return to :** Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059